
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 11
బుధవారం 3-4-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'




భారత నంబర్‌వన్‌గా అర్జున్

ఫిడే రేటింగ్స్‌లో ఆనంద్‌ను అధిగమించిన తెలంగాణ చెస్ స్టార్ -12లో



ఐపీవోల జోరు

2023–24లోమొత్తం 76 కంపెనీల లిస్టింగ్.. 62 వేల కోట్ల సమీకరణ -13లో



అవినీతిపై ఉక్కుపాదమే..

అవినీతిపరులు జైలుకు వెళ్లాల్సిందేనని.. మళ్లీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు, మావోల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు.

- వివరాలు 6లో



రామ్‌దేవ్‌పై సుప్రీం ఆగ్రహం

ఆధునిక వైద్యాన్ని తప్పుబడుతూ చేసిన వాణిజ్య ప్రకటనల విషయంలో రామ్‌దేవ్ బాబాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో



బీజేపీలో చేరకుంటే అరెస్టేనన్నారు

బీజేపీలో చేరకపోతే అరెస్టు కావడానికి సిద్ధంగా ఉండాలంటూ ఆ పార్టీ నేతలు బెదిరించారని ఢిల్లీ మంత్రి అతిశీ ఆరోపించారు.

- వివరాలు 6లో

ఎన్నికల వేడి.. కరువు దాడి


లోక్‌సభ సమరానికి ముందు రైతాంగ సమస్యలే ఎజెండా ● ముదురుతున్న రాజకీయ యుద్ధం

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటున్న ప్రధాన ప్రతిపక్షం

- వినతిపత్రాలు, దీక్షలతో వేడి రాజేస్తున్న వైనం
- మేం చలికాలంలో అధికారంలోకి వచ్చామంటూ అధికార పక్షం వివరణ
- మీ కాలంలోనే కరువు వచ్చిందంటూ ఎదురుదాడి
- మేము సైతం అంటూ బీజేపీ కార్యక్రమాలు

3 లో

కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలు



మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌లోకి నీటిని వదిలిన దృశ్యం

సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ జలాల విడుదలపై రాజుకున్న వివాదానికి మంగళవారం తెరపడింది. కొన్ని రోజులుగా కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలు నిలిపివేయడంతో ఆ వాగు ఆయకట్టు ప్రాంతంలోని వరి పొలాలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తే తామే మల్లన్నసాగర్ గేట్లను తెరుస్తామని ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యంత్రాంగం చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మల్లన్నసాగర్ గేట్లను ఎత్తి కొండపోచమ్మ సాగర్ కాల్వ లోకి నీటిని వదిలారు. సాయంత్రం గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద కొండపోచమ్మ సాగర్ కాల్వ నుంచి కూడవెల్లిలోకి గోదావరి జలాలను వదిలారు. - గజ్వేల్

కరువుకు, కాంగ్రెస్‌కు సంబంధం ఏమిటి?



- కేసీఆర్ పాపాల వల్లే వరుణ దేవుడు పారిపోయాడు
- చనిపోయిన ఆ 200 మంది వివరాలివ్వండి
- ఏ ఊరిలో ఏ రైతు చనిపోయాడో 48 గంటల్లో నివేదిక ఇవ్వండి
- నిజంగా రైతులైతే ఆదుకుంటాం... కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- 6న జరిగే కాంగ్రెస్ జనజాతర సభ ఏర్పాట్లు పరిశీలించిన ముఖ్యమంత్రి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో చనిపోయిన రైతుల వివరాలు ఇవ్వాలని, చనిపోయిన వారు నిజంగా రైతులే అయితే వారి కుటుంబాలను ఆదుకునే బాధ్యత తమదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు సవాల్ విసిరారు. కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, రైతుల మీద ప్రేమ ఉంటే.. ఏ ఊరిలో? ఏ రైతు చనిపోయాడో? 48 గంటల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. ఎన్నికల తర్వాత వారి కుటుంబాలను సచివాలయానికి పిలిపించి మాట్లాడటమే కాకుండా వారిని ఆదుకునేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. తుక్కుగూడ రాజీవ్ ప్రాంగణంలో ఈ నెల 6న తెలంగాణ జనజాతర పేరిట జరగనున్న కాంగ్రెస్ మహాసభ ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200 మంది రైతులు చనిపోయినట్లుగా కేసీఆర్ చెబుతున్నారంటూ ఓ విలేకరి ప్రస్తావించగా సీఎం స్పందించారు.

వర్షాకాలంలో వానలు పడకే కరువు

'80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు వానాకాలం ఎప్పుడొస్తుందో.. చలికాలం మిగతా 3వ పేజీలో ▶

రైతులను ఆదుకునే శ్రద్ధ ఉందా?: హరీశ్



- ప్రభుత్వ వైఫల్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయి
- కేసీఆర్ పాలం బాటతోనే కళ్లు తెరిచిన సర్కార్

3 లో

పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లెత్తాలి: బండి



- రాష్ట్రంలో సాగు, తాగునీటికి తీవ్ర కొరత
- కాంగ్రెస్‌కు చేతకాదంటే కేంద్రం నుంచి నిధులు తెస్తా

3 లో

ఎకరాకు రూ. 25 వేలు పరిహారమివ్వాలి



- రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి
- సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు

3 లో



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

పెన్షన్లు ఆపింది చంద్రబాబే

వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచీ అక్కసే

- ఆయన మనిషి నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించారు..
- మదనపల్లె సభలో ఏపీ సీఎంవైఎస్ జగన్

5 లో

ఏపీ, తెలంగాణ మధ్య 'కృష్ణా' మంటలు!



- కేటాయింపులకు మించి 7.391 టీఎంసీలను తెలంగాణ వాడుకుందన్న ఏపీ
- కృష్ణా బోర్డుకు ఫిర్యాదు.. తక్షణమే త్రిసభ్య కమిటీ భేటీ నిర్వహణకు విజ్ఞప్తి
- ఏపీ వినతిపై స్పందించిన బోర్డు.. 4న సమావేశం ఏర్పాటుకు నిర్ణయం... బోర్డుకు త్వరలో లేఖ రాయనున్న తెలంగాణ

2 లో

కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ




ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గోవింద్‌పూర్‌లో కలవరం

మూడేళ్ల వ్యవధిలో 12 మంది మృతి

- ఇంకా అనేక మందిని పీడిస్తున్న మూత్రపిండాల సమస్య
- భూగర్భ జలాలు తాగునీటిగా వినియోగించడం వల్లేనన్న ఆందోళన... ఒక్కొక్కరుగా ఊరు వదిలిన వైనం
- గతంలోనే అప్రమత్తం చేసిన 'సాక్షి'

తాంసి: చుట్టూ పచ్చని అటవీ ప్రాంతం.. ప్రశాంతమైన వాతావరణం. కాలుష్యానికి ఏమాత్రం తావులేదు. గ్రామంలో ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉంది. సీసీ రోడ్లు, డ్రెయినేజీ లైన్లు, విద్యుత్ సౌకర్యం తదితర వసతులు న్నాయి. కానీ సరైన రక్షిత నీటి సరఫరా లేదు. ఇప్పుడదే తీవ్రమైన సమస్యగా మారింది. గ్రామస్తుల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఎంతలా అంటే ఏ ఒక్క కుటుంబం కూడా మిగలకుండా ఊరు ఖాళీ చేసి వెళ్లిపోయేంతగా..! విధిలేని పరిస్థితుల్లో భూగర్భ జలాలనే తాగునీటిగా వినియోగిస్తున్న గిరిజనుల్లో పలువురు కిడ్నీ (మూత్రపిండాలు) సంబంధిత మిగతా 3వ పేజీలో ▶



ఖాళీ అయిన గోవింద్ పూర్ గ్రామం ● కొత్తచోట ఇంటిని నిర్మించుకుంటున్న గిరిజన మహిళ

న్యూస్‌రీల్

రేవంత్ బీజేపీలోకి వెళ్లడం పక్కా!



సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్లే తొలి వ్యక్తి ఆయనే అన్నారు.

- వివరాలు 2లో

6న కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే?



భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఆయన గత నెల 12న మణుగూరులో కాంగ్రెస్ సభకు సైతం హాజరయ్యారు.

- వివరాలు 2లో

8న 'కాళేశ్వరం'పై విచారణ



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం.. మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సోమవారం వింటామని హైకోర్టు చెప్పింది.

- వివరాలు 10లో

పోలీసు భూమిపై మాజీ పోలీస్ భార్య కన్ను

- గ్రేహౌండ్స్ స్థలం కాజేయడానికి యత్నించిన శివానందరెడ్డి భార్య
- సమీప బంధువు ఆరోగ్యరెడ్డితో కలిసి పక్కా స్కెచ్... రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు
- నాంపల్లి న్యాయస్థానంలో సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు
- అది ప్రభుత్వ భూమే అని స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

2 లో

ఇదండీ సంగతి



ఎందుకో మీ ముందు నడవడానికి అందరూ భయపడుతున్నార్సార్!

ముక్కలు చేసి.. మూసీలో పడేసి!



ప్రణీత్‌రావు

- ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు
- అక్రమ ట్యాపింగ్‌లో అదనపు ఎస్పీల పాత్ర కీలకం
- న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లిన దర్యాప్తు అధికారులు
- జ్యుడీషియల్ రిమాండ్‌కు తిరుపతన్న, భుజంగరావు
- ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌కు నోటీసులు..?

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ద్వారా జరిగిన అక్రమ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అరెస్టు అయిన అదనపు ఎస్పీల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలను ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. ఫలితంగా ట్యాపింగ్‌తో పాటు ఆధారాల ధ్వంసానికి సంబంధించిన సమాచారం సేకరించారు. ఈ వివరాలను పోలీసులు తమ రిమాండ్ రిపోర్టు ద్వారా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భుజంగరావు, తిరుపతన్నలు తమ నేరం అంగీకరించారని, ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే నేరం చేసినట్టు బయటపెట్టారని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో మిగతా 10వ పేజీలో ▶


2014 నుంచి ట్యాపింగ్‌లపై విచారణ జరిపించాలి



- ఏ1 కేసీఆర్, ఏ2 హరీశ్‌రావు, ఏ3 వెంకట్రాంరెడ్డి, ఏ4గా కేటీఆర్ పేరు చేర్చాలి
- 2015లో రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్కన పెట్టి... ఆ తర్వాత ఫోన్‌ట్యాపింగ్‌లపై విచారణ ఎందుకు?
- మీ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టీఫెన్ రవీంద్ర చెప్పిన 30 కోట్లు ఎక్కడికి పోయాయి: రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ సీఎం అయిన 2014 జూన్ 2 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లపై విచారణ జరిపించి.. తప్పు చేసిన వారిని శిక్షించాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. తాను ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సమాజం ఎదుట ఇన్ని ఆధారాలు పెట్టినా కూడా సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని, అన్ని తెలిసి కూడా సీఎం సగం మాత్రం బయటపెట్టడం కూడా సరికాదన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. 2015లో జరిగిన ఓటుకు కోట్లు కేసులో జరిగిన రేవంత్‌రెడ్డి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని పక్కన పెట్టి 2016 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లపై విచారణ అని ఎందుకు చెబుతున్నారని మిగతా 2వ పేజీలో ▶

'గురివింద' బండారం బట్టబయలు



- లెక్కాపత్రం లేని నగదుతో అడ్డంగా దొరికిన 'మార్గదర్శి'
- మార్గదర్శి పేరుతో అక్రమంగా రూ.51,99,800 నగదు తరలింపు
- ద్వారకానగర్ వద్ద పోలీస్ తనిఖీల్లో పట్టుబడిన డబ్బు
- మరో రూ.36,88,675 విలువైన 51 చెక్కులూ లభ్యం
- టీడీపీ నేతలకోసం తరలిస్తున్నారని అనుమానాలు

విశాఖ సిటీ/సాక్షి, అమరావతి: రాజ గురివింద రామోజీ బరితెగించారు. ఎన్నికల వేళ పచ్చ పార్టీకి భారీ మొత్తంలో డబ్బు అక్రమ తరలింపునకు తెగబడ్డారు. రాజకీయంగా చంద్రబాబుకు కొమ్ముకాసే రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లెక్కా పత్రం లేకుండా విశాఖ నగరంలో భారీగా నగదును తరలిస్తూ అడ్డంగా దొరికిపోయింది. రూ.51,99,800 నగదుతో పాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో రామోజీ ఆర్థిక అక్రమాల బండారం మరోసారి బట్టబయలైంది.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖ పోలీసు బృందాలు, కేంద్ర బలగాలు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విశాఖ నగరం ద్వారకానగర్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ మిగతా 5వ పేజీలో ▶

భూకబ్జా కేసులో కన్నారావు అరెస్టు



కన్నారావు

- వైద్య పరీక్షల అనంతరం కోర్టుకు తరలించిన పోలీసులు
- 14 రోజులు రిమాండ్ విధించిన ఇబ్రహీంపట్నం కోర్టు

ఇబ్రహీంపట్నం రూరల్: భూకబ్జా వవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్న కుమారుడు తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. మన్నెగూడలో రెండు ఎకరాల స్థలం సెటిల్‌మెంట్ వ్యవహారంలో మార్చి 3న కన్నారావుపై ఆదిబట్ల పోలీసులు కేసు (క్రైం నంబరు 123/2024) నమోదు చేశారు. మన్నెగూడకు చెందిన జక్కిడి సురేందర్‌రెడ్డి అవసరం నిమిత్తం చావ సురేష్ వద్ద రూ.50 లక్షలు తీసుకున్నాడు. ఇందుకోసం తన భూమిని ఏజీపీఏ చేశాడు. చావ సురేష్ సేల్‌డీడ్ చేసుకొని ఓఎస్ఆర్ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ఎలాగైనా భూమిని చావ సురేష్‌కు దక్కకుండా చూడాలని జక్కిడి సురేందర్‌రెడ్డి అతని బంధువుల ద్వారా కన్నారావును ఆశ్రయించాడు. దీంతో రూ. 3 కోట్లు ఇస్తే సెటిల్ చేస్తానని కన్నారావు చెప్పడంతో రూ. 2.30 కోట్లను సురేందర్‌రెడ్డి కన్నారావుకు ఇచ్చాడు. రోజులు గడిచినా ఆయన ఎలాంటి పని చేయకపోవడం, ఓఎస్ఆర్ కంపెనీ యాజమాన్యం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి హద్దులు మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

10 లక్షల మందితో జనజాతర సభ: కోమటిరెడ్డి



సికింద్రాబాద్: చరిత్రలో నిలిచిపోయే తరహాలో తుక్కుగూడ జనజాతర సభను నిర్వహించనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...ఈనెల 6న నిర్వహించే తుక్కుగూడ జనజాతర సభకు పదిలక్షలకు మించి ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా ఇండియా కూటమి రూపొందించిన మేనిఫెస్టోను ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, మల్లికార్జునఖర్గే ఆవిష్కరించనున్నట్లు మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, ఇందుకు కారణం కేసీఆర్ కుటుంబ, నియంతృత్వ పరిపాలనే కారణమని మంత్రి విమర్శించారు. కొద్దికాలంలోనే బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు ఖాయమన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చేజిక్కించుకుంటుందని జోస్యం చెప్పారు.

చట్టసభల్లో రిజర్వేషన్ సాధనకు ఉద్యమిద్దాం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాజుల



పంజగుట్ట (హైదరాబాద్): చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ వస్తేనే బలహీనవర్గాలు రాజ్యాధికారానికి దగ్గరవుతాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన అగ్రవర్ణ నాయకులు బీసీ అయిన తనను ఓడించారని, అందుకే చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లు సాధిస్తే బీసీలే రాజ్యాధికారం చెయ్యవచ్చునని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 314వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, గతంలో సర్వాయి పాపన్న వర్ధంతి అధికారికంగా చేసేవారమని, ఇప్పుడు ఎన్నికల కోడ్ సాకుతో చెయ్యకపోవడం బాధాకరమని అన్నారు. బీసీల హక్కుల కోసం సర్వాయి పాపన్న స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనకు తెలంగాణనుంచే ఉద్యమం ప్రారంభిద్దామని, దాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా విస్తరిద్దామని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ గళం ఉండేదని, తెలంగాణ వచ్చిన తర్వాత బీసీ ప్రజా ప్రతినిధులు తగ్గిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖమ్మం టికెట్ నాకు కేటాయించాల్సిందే: వీహెచ్



సాక్షి, న్యూఢిల్లీ: ఖమ్మం లోక్‌సభ టికెట్ తనకు కేటాయించాల్సిందేనని బీసీ నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హనుమంతరావు (వీహెచ్) కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. భారీ మెజార్టీతో గెలిచి అధిష్టానానికి గిఫ్ట్‌గా ఇస్తానంటూ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద వీహెచ్ మీడియాతో మాట్లాడారు. ఖమ్మం టికెట్ విషయంలో కొద్దిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరినట్లు తెలిపారు. ఒకవేళ ఇవ్వకుండా అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎంత పెద్ద వారు ఉన్నా సరే ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీలోకి గంగారామ్

సాక్షి, న్యూఢిల్లీ: కామారెడ్డి జిల్లా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారామ్ బీజేపీలో చేరారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో గంగారామ్‌కు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం.. ఇదే నియోజకవర్గానికి చెందిన మరోనేత సంగమేశ్వర్ రెడ్డి కూడా తరుణ్ ఛుగ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు.


ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐతో విచారణ చేయించాలి

- డీజీపీ రవిగుప్తాకు బీజేపీ నేత చీకోటి ప్రవీణ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ నేత చీకోటి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తాకు ప్రవీణ్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. రాధాకిషన్‌రావు వ్యవహారంపై దర్యాప్తు జరపాలన్నారు. రాధాకిషన్‌రావు అక్రమ ఆస్తులపై సైతం ఈడీ, సీబీఐ సంస్థలతో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాధకిషన్ అక్రమ ఆస్తులపై ఈడీకి లేఖ రాస్తానన్నారు. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తనకు నేరుగా ఫోన్ చేసి సీఎం నియోజకవర్గానికి వెళితే పీడీ యాక్ట్ నమోదు చేస్తానని బెదిరించారని చెప్పారు.

ఏపీ, తెలంగాణ మధ్య

'కృష్ణా' మంటలు!



కేటాయింపులకు మించి 7.391 టీఎంసీలను తెలంగాణ వాడుకుందన్న ఏపీ

కృష్ణా బోర్డుకు ఫిర్యాదు.. తక్షణమే త్రిసభ్య కమిటీ భేటీ నిర్వహణకు విజ్ఞప్తి

ఏపీ వినతిపై స్పందించిన బోర్డు.. 4న సమావేశం ఏర్పాటుకు నిర్ణయం

ఏపీ ఆరోపణలపై బోర్డుకు త్వరలో లేఖ రాయనున్న తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: మండు వేసవి కృష్ణా జలాల్లో మంటలు పుట్టించింది. కృష్ణా జలాల వాడకంపై ఏపీ, తెలంగాణ మధ్య మళ్లీ వివాదం రాజుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు వేసవికి ముందే అడుగంటడంతో మిగిలిన కొద్దిపాటి జలాలను తాగునీటి అవసరాలకు వాడుకొనే విషయంలో తాజాగా ఇరు రాష్ట్రాలు కొట్లాటకు దిగాయి. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ జరిపిన కేటాయింపులకు మించి 7.391 టీఎంసీల జలాలను తెలంగాణ వాడుకుందని ఏపీ ఆరోపించింది. లెక్కాపత్రం లేకుండా తెలంగాణ చేస్తున్న నీటి వాడకాన్ని నియంత్రించడానికి సత్వరమే త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని కృష్ణా బోర్డుకు ఈ నెల 1న లేఖ రాసింది. త్రిసభ్య కమిటీకి నీటి అవసరాలపై సరైన ఇండెంట్లు సమర్పించకుండానే.. బోర్డు నుంచి వాటర్ రిలీజ్ ఆర్డర్లు లేకుండానే తెలంగాణ రాష్ట్రం కృష్ణా జలాలను వాడుకుందని లేఖలో ఆరోపించింది. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 513.4 అడుగులకు పడిపోగా నిల్వలు 137.515 టీఎంసీలకు తగ్గిపోయానని ఏపీ ఆందోళన వ్యక్తం చేసింది. డెడ్ స్టోరేజీ లెవల్ 505 అడుగులకు ఎగువన వాడుకోవడానికి వీలుగా 14.182 టీఎంసీలు మాత్రమే లభ్యతగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వకు ఈ నెల 8 నుంచి 5 టీఎంసీల జలాలను విడుదల చేసేందుకు అనుమతించేలా సీఆర్‌పీఎఫ్ బలగాలకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు నీటి విడుదల ప్రక్రియను పర్యవేక్షించడానికి సిబ్బందిని పంపించాలని బోర్డుకు విజ్ఞప్తి చేసింది.

సభ్యులంతా హాజరు కావాలన్న బోర్డు..

ఏపీ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కృష్ణా బోర్డు ఈ నెల 4న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో రానున్న కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, సభ్యులందరూ హాజరు కావాలని ఇరు రాష్ట్రాలను కోరింది. త్రిసభ్య కమిటీ కన్వీనర్‌గా కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరే, సభ్యులుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలు వ్యవహరించనున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాలతోపాటు నీటి విడుదల ఆర్డర్ల జారీపై ఈ కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకోనుంది. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు ఏప్రిల్, మేలలో తాగునీటి సరఫరాకు సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని పంపుల ద్వారా తరలించాలని ఇప్పటికే తెలంగాణ నిర్ణయం తీసుకుంది.

'42.39 టీఎంసీలను తెలంగాణ వాడేసుకుంది'

శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి తమ రాష్ట్రానికి 45 టీఎంసీలు కేటాయించగా తాము 42.457 టీఎంసీలనే వినియోగించుకున్నామని... కానీ తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయిస్తే 7.391 టీఎంసీలు అధికంగా మొత్తం 42.391 టీఎంసీలను వాడుకుందని ఏపీ ఆరోపించింది. ఏపీలో తాగునీటికి తీవ్ర కొరత ఉన్నందున పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల తాగునీటి అవసరాల కోసం ఈ నెల 8 నుంచి నీటి విడుదలకు అనుమతించాలని కోరింది. ఏపీ ఆరోపణలకు బదులిస్తూ త్వరలో తెలంగాణ కృష్ణా బోర్డుకు లేఖ రాయనుంది.

పోలీసు భూమిపై మాజీ పోలీస్ భార్య కన్ను

గ్రేహౌండ్స్ స్థలం కాజేయడానికి యత్నించిన శివానందరెడ్డి భార్య

- సమీప బంధువు ఆరోగ్యరెడ్డితో కలిసి పక్కా స్కెచ్
- రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సీసీఎస్‌లో కేసు
- నాంపల్లి న్యాయస్థానంలో సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు
- అది ప్రభుత్వ భూమే అని స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- మంచిరేవులలోని ఆ భూమి విలువ రూ.2,500 కోట్ల పైనే

సాక్షి, హైదరాబాద్: అసైన్డ్ ల్యాండ్స్ స్కామ్, ప్రీలాంచ్ ఆఫర్స్ పేరుతో మోసాలకు పాల్పడిన కేసులో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల నుంచి తప్పించుకుపోయిన ఏపీలోని నంద్యాల టీడీపీ అభ్యర్థి, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డి భార్య ఉమాదేవిపై మరో కేసు కూడా ఉంది. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ విభాగం గ్రేహౌండ్స్‌కు చెందిన భూమిపై ఆమె కన్నేశారు. తన సమీప బంధువు ఆరోగ్యరెడ్డితో కలిసి కాజేయడానికి కుట్ర పన్నారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో సీసీఎస్ పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. దీన్ని దర్యాప్తు చేసిన అధికారులు నిందితులపై సప్లిమెంటరీ చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. శివానందరెడ్డికి సంబంధించిన తాజా ఎపిసోడ్ నేపథ్యంలో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఇందులో త్వరలో పూర్తిస్థాయి అభియోగ పత్రాలు దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ ఆధీనంలోనే ఉన్న ఆ భూమి మార్కెట్ విలువ రూ.2,500 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. తాజా కేసులో శివానందరెడ్డితో పాటు ఆయన భార్య ఉమాదేవి కూడా నిందితురాలిగా ఉన్న విషయం విదితమే. 1993లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉన్న సర్వే నంబర్ 393/1 నుంచి 392/20 వరకు ఉన్న భూమిని గ్రేహౌండ్స్‌కు కేటాయించింది. మొత్తం 142 ఎకరాల 39 కుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి అప్పటి నుంచి గ్రేహౌండ్స్ ఆధీనంలోనే ఉంది. అ

స్టే ఉత్తర్వులు ఉన్నా..

కాగా.. ఈ భూమిని 1961లో ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ 20 మంది అసైనీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం దీనిపై న్యాయస్థానం విధించిన స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు కొనసాగుతున్నాయి. ఓ దశలో ఈ వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. హైకోర్టులోనే తేల్చుకోవాలంటూ ఆ న్యాయస్థానం స్పష్టం చేయడంతో స్టేటస్ కో కొనసాగుతోంది. ఈ వివాదాల నేపథ్యంలో ఉమాదేవి తన సమీప బంధువు ఆరోగ్యరెడ్డితో కలిసి రంగంలోకి దిగారు. యూ అండ్ ఏ పేరుతో ఉన్న కంపెనీ ముసుగులో కథ నడిపారు. ఆ భూమికి సంబంధించిన అసైనీల వారసుల పేరుతో కొందరి నుంచి తమ కంపెనీ పేరుతో ఒప్పందాలు చేసుకున్నారు. ఎకరం రూ.4 కోట్లకు బేరమాడుకుని, రూ.8 లక్షల చొప్పున అడ్వాన్స్ చెల్లిస్తూ అనేక మంది వారసులతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇది జరిగిన కొన్నాళ్లకు ఆ భూములపై హక్కు పొందేందుకు తమవేనంటూ జీపీఏ కూడా చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రేహౌండ్స్ ఉన్నతాధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం వారు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సర్కారు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమాదేవి, ఆరోగ్యరెడ్డి తదితరులు గ్రేహౌండ్స్ స్థలం కాజేయడానికి కుట్ర పన్నారని ఆరోపిస్తూ పోలీసులు ఐపీసీ 406, 420, 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం జరిగినట్టు నిర్ధారణ కావడంతో ఉమాదేవి, ఆరోగ్యరెడ్డితో పాటు అసైనీ వారసులుగా చెప్పుకుని ఒప్పందాలు చేసుకున్న 60 మందికి సీసీఎస్ పోలీసులు సీఆర్పీసీ 41ఏ కింద నోటీసులు జారీ చేశారు. దర్యాప్తు తుది దశకు చేరిన నేపథ్యంలో ఉమాదేవి సహా మరికొందరిపై సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలోనూ తెరవెనుక శివానందరెడ్డి పాత్ర ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. భూ వివాదం సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. ఆ భూమి ప్రభుత్వానిదే అని, సర్కారే గ్రేహౌండ్స్‌కు కేటాయించడంతో ప్రస్తుతం ఆ విభాగానికి చెందినదే అంటూ తీర్పు కూడా ఇచ్చింది.

అరెస్టులు వద్దు

మరోవైపు బుద్వేల్ అసైన్డ్ భూముల కబ్జా కేసులో తదుపరి విచారణ వరకు నంద్యాల టీడీపీ అభ్యర్థి, మాజీ ఎస్పీ శివానందరెడ్డి, అతని భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్క్‌లను అరెస్టు చేయవద్దని సీసీఎస్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని బుద్వేల్‌లో 26 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించారన్న ఆరోపణలపై శివానందరెడ్డితోపాటు ఉమాదేవి, కనిష్క్(నిందితులు)లపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తమను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి 8వ తేదీ వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

6న కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే?

- తుక్కుగూడ సభలో రాహుల్ సమక్షంలో చేరే అవకాశం
- ఇల్లెందులో కాంగ్రెస్ సమావేశానికి హాజరైన తెల్లం వెంకట్రావు

ఇల్లెందు: భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పలు మార్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన గత నెల 12న మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన సభకు సైతం హాజరయ్యారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ స్థాయి కాంగ్రెస్ సమావేశంలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలసి వెంకట్రావు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైనట్లు సమాచారం. ఈ నెల 6న తుక్కుగూడలో జరిగే సభలో రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. దీనిపై వెంకట్రావును వివరణ కోరగా త్వరలో వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

వ్యవస్థలను కేసీఆర్ నాశనం చేశారు: తుమ్మల

ఇల్లెందు సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా గత ఎన్నికల సందర్భంగా సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరతామని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు కొనసాగిస్తూ కొత్తవి కూడా అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 7,145 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రతి గింజనూ కొంటామన్నారు. ఇప్పటికే 92.36 శాతం రైతుబంధు పంపిణీ పూర్తి చేశామని, పంటల బీమా పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

2014 నుంచి ట్యాపింగ్‌లపై..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించారు. మునుగోడు, దుబ్బాక ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రేవంత్‌రెడ్డి ఎందుకు ప్రస్తావిస్తున్నారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఓటుకు కోట్ల కేసుపై కూడా విచారణ జరిపితేనే ప్రజలు నమ్ముతారని చెప్పారు. 2015లో జరిగిన తన టెలిఫోన్ ట్యాపింగ్ ఎందుకు పక్కకు పెడుతున్నారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. 'రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు అప్పటి డీజీపీ అనురాగ్‌శర్మ, సిటీ పోలీస్ కమిషనర్ ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీలో ఉన్నది ప్రస్తుత ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్... రేవంత్‌రెడ్డి ఇవ్వన్ని ఎందుకు దాచిపెడుతున్నారో సమాధానం చెప్పాలి'అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బయటపడిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అప్పటి సీఎం, అప్పటి డీజీపీలను ఎందుకు ముద్దాయిలుగా చేర్చడం లేదని ప్రశ్నించారు. నిజంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఒప్పందం లేకపోతే మాజీ సీఎం కేసీఆర్ పేరును ఎందుకు ఇందులో చేర్చడం లేదని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి ముద్దాయిగా కేసీఆర్, ఆ తర్వాత హరీశ్‌రావు, వెంకట్రాంరెడ్డి, కేటీఆర్, నవీన్‌రావు, సందీప్‌రావుల పేర్లు వరుసగా చేర్చాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అవగాహనతోనే విచారణ

ప్రస్తుతం ఈ కేసు విచారణ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య కుదిరిన అవగాహనతోనే జరుగుతోందని రఘునందన్‌రావు ఆరోపించారు. మునుగోడు ఉపఎన్నికలో రూ.3.5 కోట్లు పట్టుకున్నా, ఇప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు? ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడే అయినా ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు అని ప్రశ్నించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర చెప్పిన రూ.30 కోట్లు ఎక్కడకు పోయాయని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తాను ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ పరిశీలిస్తే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో సెలెక్టివ్ విచారణ జరుగుతున్నదనే అనుమానం కలుగుతోందన్నారు. 'దుబ్బాక ఉపఎన్నిక సమయంలో నా ఫోన్ ట్యాప్ జరిగిందని డీజీపీకి చెప్పాను. అప్పటి జిల్లా కలెక్టర్, ప్రస్తుత మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావును ముద్దాయిగా చేయాలని చెప్పిన. ఎందుకు చేర్చుతలేరో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి'అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బంగారు దుకాణాల ఓనర్లను బెదిరించి వాళ్ల దగ్గర తెచ్చిన బంగారంతో యాదగిరి టెంపుల్ కట్టారా అని ప్రశ్నించారు.

రఘునందన్‌రావుపై కేసు నమోదు

సంగారెడ్డి: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రెండు రోజుల క్రితం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మాటల మంటలు, ట్వీట్లు @

ట్యాపింగ్!



పరువు నష్టం దావా వేస్తా: కేటీఆర్

అసలు నీకు పరువుందా?: యెన్నం, కేకే మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్, సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్. కాంగ్రెస్ నేతల మధ్య మాటల మంటలు రేగుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి తనపై వచ్చిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఘాటుగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ పేరిట సిరిసిల్ల కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ తనపై నిరాధార, మతిలేని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పరువుకు భంగం కలిగేలా బురద చల్లుతున్న సురేఖ, మహేందర్‌రెడ్డికి లీగల్ నోటీసులు పంపిస్తానని పేర్కొన్నారు. వాస్తవాలను సరిచూసుకోకుండా చెత్త వార్తలను ప్రచురించే మీడియా సంస్థలకు కూడా లీగల్ నోటీసులు పంపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. దీనికి ప్రతిగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా ప్రతిస్పందించారు. ప్రజా కోర్టులో గెలిచిన మాదిరే, లీగల్‌గా కోర్టులో గెలుస్తాం. మీరు మళ్లీ ఓడిపోక తప్పదు. ధర్మో రక్షతి రక్షితః అని ట్వీట్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సైతం ఫోన్ ట్యాపింగ్ చేశారని.. ఓ మాజీ మంత్రి హస్తం ఉందని.. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యెన్నం ఇటీవల డీజీపీని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

కేటీఆర్ అందరి ఫోన్లు ట్యాప్ చేయించారు

పోలీసు రూపంలో ప్రైవేటు సైన్యాన్ని కేసీఆర్ పెంచి పోషించారని, ఆ సైన్యంతోనే అందరి ఫోన్లు ట్యాప్ చేయించారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.కె.మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గాంధీ భవన్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... తమపై పరువు నష్టం దావా వేసేందుకు కేటీఆర్‌కు అసలు పరువుందా? అని ప్రశ్నించారు.

ధరణిపై విచారణను సీబీఐకివ్వండి

లేదా న్యాయ విచారణకు ఆదేశించండి

- గత ప్రభుత్వం ధరణి పేరుతో రూ.2 లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడింది
- 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉంటే ఈ రోజు.. మిగిలింది 6 లక్షల ఎకరాలే
- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ధరణిపై న్యాయ విచారణకు లేదంటే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశంలోనే ధరణి అతి పెద్ద కుంభకోణమని అభివర్ణించిన ఆయన ఇందులో రూ.2 లక్షల కోట్ల విలువైన భూ దందాలు జరిగాయని ఆరోపించారు. ఈ కుంభకోణంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు నేరుగా ప్రమేయం ఉందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇందు లో అవినీతి జరిగిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎందుకు ఈ కుంభకోణా న్ని వెలికితీయడం లేదన్నారు. 'తెలంగాణ ఏర్ప డే నాటికి రాష్ట్రంలో 24 లక్షల ఎకరాలు అసైన్డ్ భూములుంటే ఈ రోజు మిగిలింది 6 లక్షల ఎకరాలు మాత్రమే. ఆ భూము లు ఎక్కడికి పోయాయి.. ఎవరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు'.. ఇవన్నీ లెక్కతేలాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరగానే ఆణిముత్యాలయ్యారా?

గతంలో కేటీఆర్ వెన్నంటే ఉండిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు రంజిత్ రెడ్డి, కె.కేశవరావు భూఅక్రమాలకు పాల్పడ్డారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు వారు కాంగ్రెస్‌లో చేరగానే ఆణిముత్యాలు అయిపోయారా అని నిలదీశారు. రాష్ట్రంలో ఆర్ టాక్స్‌తో పాటు కొత్తగా బీ టాక్స్ తెరపైకి వచ్చిందని విమర్శించారు. పెండింగ్ బిల్లు లు క్లియర్ కావాలంటే 8 నుండి 9 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని కొందరు కాంట్రాక్టర్లు వచ్చి తమతో చెబుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అడ్డగోలుగా సంపాదిస్తున్న డబ్బునే ఢిల్లీ అధిష్టానానికి పంపుతున్నట్టు అనుమానాలున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన ప్రభుత్వం 13 వారాల్లో రూ.13 వేల కోట్లు అప్పులు తెచ్చిందని విమర్శించారు. మళ్లీ తాజాగా రూ.నాలుగు వేల కోట్ల రుణాల కోసం బాండ్లు తాకట్టు పెడుతున్నారని నిందించారు.

కోమటిరెడ్డి వద్దకు నేనెందుకెళ్తా?

కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏమైనా ప్రధానమంత్రా? ముఖ్యమంత్రా? పార్టీ మారేందుకు ఆయ న వద్దకు తానెందుకు వెళతానని ఒక ప్రశ్నకు మహేశ్వర్‌రెడ్డి బదులిచ్చారు. మంత్రి పదవి కోసం పార్టీ మారే వ్యక్తిని కాదని, తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీజేపీ కార్యకర్తగా ఉంటానని స్పష్టం చేశారు.

రేవంత్ బీజేపీలోకి వెళ్లడం పక్కా

లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగేది అదే

- బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
- మల్కాజ్‌గిరిలో బీజేపీతోనే బీఆర్ఎస్ పోటీ.. కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని విమర్శ



శామీర్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీలోకి వెళ్లే మొట్టమొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డే అని వ్యాఖ్యానించారు. అలియాబాద్‌లో మంగళవారం జరిగిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నరేంద్రమోదీని చౌకీదార్ చోర్ హై అని రాహుల్ గాంధీ అంటుంటే రేవంత్ మాత్రం మోదీ హమారా బడే భాయి (పెద్దన్న) అంటున్నారని గుర్తు చేశారు. అసలు సీఎం రేవంత్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కోసం పని చేస్తున్నాడా లేక నరేంద్ర మోదీ కోసం పనిచేస్తున్నాడా అనే సందేహం కలుగుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. లిక్కర్‌స్కాంలో కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయమని అంటున్న రేవంత్ కవిత అరెస్టు కరెక్ట్ అని ఎలా అంటారని నిలదీశారు. మందికి పుట్టిన బిడ్డలని తమ బిడ్డలని చెప్పుకోవడమే సీఎం రేవంత్ తత్వమని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని తాను చేశానని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడితే పేగులు మెడలో వేసుకుంటా అని రేవంత్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని, ఆయన పక్కనే ఉన్న నల్లగొండ, ఖమ్మం మానవ బాంబులతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ సూచించారు.

ఆ తర్వాతే ఈటల ఓట్లడగాలి: మల్కాజ్‌గిరిలో బీజేపీతోనే బీఆర్ఎస్‌కు పోటీ అని, కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని కేటీఆర్ అన్నారు. అందుకే మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. మల్కాజ్‌గిరి అభివృద్ధికి కేసీఆర్ ఏం చేశారో తాము చెప్పగలమని,, కేంద్రంలోని బీజేపీ సర్కారు ఏం చేసిందో చెప్పి ఈటల రాజేందర్ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా కంటోన్మెంట్ భూములు కావాలని అడిగితే బీజేపీ ప్రభుత్వం స్పందించలేదని, చివరికి తెలుగు అధికారి గిరిధర్ వల్ల ఫైల్ కదిలిందని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీ చేయలేదని ఈటల అనడం సిగ్గుచేటని, ఆయన ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే రూ. 16 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసింది నిజం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. సమావేశంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వికారాబాద్‌లో కేటీఆర్ పర్యటన

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం వికారాబాద్‌లో పర్యటించనున్నారు. వికారాబాద్‌లోని నర్సింగ్ ఫంక్షన్ హాల్లో ఉదయం 11:30 గంటలకు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.

ఆ ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధం

- తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీల నుంచి తొలగించాలి
- గొండ్వానా వెల్ఫేర్ సొసైటీ పిటిషన్ విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 1956 ప్రకారం తెలుగు మాట్లాడే వారి ప్రాంతాలతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో 1976 నుంచి తెలంగాణ ప్రాంతంలోని బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తిస్తున్నారని, ఈ ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని గొండ్వానా వెల్ఫేర్ సొసైటీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఒక రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఒకే రిజర్వేషన్ ఉండాలంటూ పార్లమెంటులో చేసిన ఒక డిమాండుతో నాడు తెలంగాణ ప్రాంతంలోని బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించారని తెలిపింది. అయితే, 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలు తిరిగి వేర్వేరు రాష్ట్రాలుగా ఏర్పడిన సందర్భంగా ఆయా కులాలను తెలంగాణలో గతంలో మాదిరి బీసీలుగా పరిగణించాలని కోరింది. ఈ మేరకు తెలంగాణకు చెందిన గొండ్వానా వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, న్యాయవాది రమేశ్ అల్లంకిలు వాదనలు వినిపించారు. ఆయా కులాల విషయంలో ఆర్టికల్ 345 ప్రకారం ఓ ప్రక్రియ అనుసరించలేదని, జనాభా లెక్కలు, చర్చలు, కమిషన్ ఏర్పాటు ఇలా ఏ ప్రక్రియనూ చేపట్టలేదన్నారు. చట్ట సభ చేసిన చట్టంలో న్యాయ వ్యవస్థ జోక్యం ఉండదని, ప్రభుత్వాలను ఆశ్రయించాలని ఉమ్మడి హైకోర్టు పేర్కొందన్నారు. దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉందని పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. ఆయా కులాలు కర్ణాటక, ఒడిశాలో ఎస్సీలుగా మహారాష్ట్రలో బీసీలుగా, ఏపీలో ఎస్టీలుగా ఉన్నారన్నారు. ఈ కులాలకు తెలంగాణ ప్రాంతంలో ఎస్టీ హోదా ఇవ్వడంతో ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన ఆదివాసీలు జనాభా మేరకు రిజర్వేషన్ల ఫలాలు అందుకోలేకపోతున్నారన్నారు. గతంలో ఈ పిటిషన్‌పై కేంద్రం, ఏపీ, తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు కోర్టు నోటీసులు జారీ చేసిందన్నారు. కేంద్రం, తెలంగాణ మాత్రమే కౌంటరు దాఖలు చేశాయన్నారు. పిటిషన్‌కు విచారణ అర్హత ఉందన్న ధర్మాసనం, పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు నుంచి ఒరిజినల్ రికార్డు తెప్పించాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

క్లుప్తంగా...

సర్వాయి పాపన్న స్ఫూర్తితో కాంగ్రెస్ పాలన

అటవీ, దేవాదాయ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: సర్వాయి పాపన్న గౌడ్ అందించిన స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా వివక్ష, అణచివేతను నిరసిస్తూ ఆయన ప్రదర్శించిన పోరాట పటిమను మంత్రి స్మరించుకున్నారు. పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ప్రతీక అని పేర్కొన్నారు. నియంతృత్వ రాచరికాన్ని ఎదిరించి, సామాజిక న్యాయాన్ని పాటిస్తూ, జనరంజక పాలన సాగించిన పాపన్న అసమాన పోరాట యోధుడు, మేధో సంపన్నుడని కీర్తించారు.

టీపీసీసీ కల్లుగీత విభాగంరాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రేవతీగౌడ్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ కల్లు గీత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా టి.రేవతీగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. తనను ఉపాధ్యక్షురాలిగా నియమించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, నాగరాజు గౌడ్‌లకు రేవతి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గాంధీభవన్ లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, నాగరాజుగౌడ్, రేవతీగౌడ్ తదితరులు నివాళులర్పించారు.

టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్‌గా రామ్మోహన్‌రెడ్డి



వనస్థలిపురం (హైదరాబాద్): టీపీసీసీ అధికార ప్రతినిధి, వనస్థలిపురానికి చెందిన సామ రామ్మోహన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి దక్కింది. కాంగ్రెస్ పార్టీ మీడియా, కమ్యూనికేషన్ వ్యవహారాల చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్ కుమార్‌గౌడ్‌లు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌పై విమర్శలు చేయను: కడియం



హనుమకొండ: బీఆర్‌ఎస్ నుంచి తాను బయటకి వచ్చినా ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ఎలాంటి విమర్శలు చేయబోనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం హనుమకొండలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలామంది పార్టీలు మారుతున్నారని, వారిపై స్పందించని బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు తన పట్ల తీవ్రంగా స్పందిస్తున్నారని, అయితే వారి విమర్శలను పట్టించుకోనని పేర్కొన్నారు. తాము డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌లో చేరినట్లు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటామన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి చీడ పురుగురు చేరి బీఆర్‌ఎస్ పార్టీని భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు. పార్టీ నిర్మాణం చేపట్టాలని తాను ఎప్పటి నుంచో చెబుతూ వచ్చానని, అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత చెప్పినా పట్టించుకోలేదని, పార్టీ నిర్మాణం చేస్తే ఈ పరిస్థితి బీఆర్‌ఎస్‌కు వచ్చేది కాదన్నారు.

ఆలోచనలతో లక్ష్య సాధన: బుర్రా వెంకటేశం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: మంచి ఆలోచన విధానం ద్వారానే లక్ష్య సాధన సాధ్యమని, అంతర్ దృష్టి వ్యక్తి ఔన్నత్యాన్ని పెంచుతుందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్ కాలేజియేట్ కమిషనరేట్‌లో 'జిజ్ఞాస-స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్టు: 2023–24' ప్రారంభ కార్యక్రమం మంగళవారం జరిగింది. కాలేజియేట్ ఎడ్యుకేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరేట్, రూసా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనను ఉద్దేశించి వెంకటేశం మాట్లాడారు. విద్యార్థులు తమను తాము మార్చుకోవడమే కాదు, పరిశోధన దృక్పథాన్ని పెంచుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ, ఉన్నత విద్యలో మెరుగైన విధానాన్ని మండలి ప్రోత్సహిస్తోందని చెప్పారు. అకడమిక్ గైడెన్స్ అధికారి ప్రొఫెసర్ బాలభాస్కర్ అతిథులకు స్వాగతం పలికారు.

ఎన్నికల వేడి.. కరువు దాడి

లోక్‌సభ సమరానికి ముందు రైతాంగ సమస్యలే ఎజెండా • ముదురుతున్న రాజకీయ యుద్ధం



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు రైతాంగ సమస్యలే ఎజెండాగా మారాయి. కరువు పేరిట రాజకీయ యుద్ధానికి తెరలేపుతున్నాయి. రైతు సంబంధిత అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటున్నాయి. విపక్షాలు, అధికార పక్షం ఒకదానిపై మరొకటి మాటల దాడులు చేసుకుంటున్నాయి. రైతు సంక్షేమానికి పాటు పడేది తామేనంటూ ఏకరువు పెడుతున్నాయి. ఎండిన పంటల పరిశీలన కోసం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో చేసిన పర్యటనతో కరువు రాజకీయం ముదురు పాకాన పడింది.

కాంగ్రెస్ తెచ్చిన కరువన్న కేసీఆర్

జిల్లాల పర్యటనలో కేసీఆర్ కాంగ్రెస్ పాలనపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువని ధ్వజమెత్తారు. అంతేకాకుండా రైతుల పక్షాన కార్యాచరణలో భాగంగా మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టింది. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆ పార్టీ నేతలు వినతి పత్రాలు అందజేశారు. మరోవైపు ఈనెల 5వ తేదీన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పర్యటనలకు సైతం కేసీఆర్ సిద్ధమవుతుండగా, 6వ తేదీన వరి పంటకు బోనస్ డిమాండ్ చేస్తూ దీక్షలు చేపట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మరోవైపు రిజర్వాయర్ల నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ కన్నెర్ర..

కరువు పేరిట ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్న విపక్షాలపై కాంగ్రెస్ భగ్గుమంటోంది. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతాంగాన్ని కనీసం పట్టించుకోలేదని, ఇప్పుడు రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోన్న తమ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆ పార్టీ ముఖ్య నేతలు విమర్శిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విపక్షనేత కేసీఆర్‌పై పదునైన విమర్శలతో దాడికి దిగారు. వానాకాలంలో వర్షాలు పడకపోతే ఎవరైనా ఏం చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ పాపాలకు దేవుడు కూడా భయపడి పారిపోయాడంటూ ఛలోక్తులు విసిరారు. మీ కాలంలోనే కరువు వచ్చిందని, తాము అధికారంలోకి వచ్చింది చలికాలంలోనని, అలాంటప్పుడు తాము కరువు ఎలా తెస్తామని ప్రశ్నించారు. మరోవైపు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు కేసీఆర్, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీపైనా విరుచుకుపడుతున్నారు. కరువు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని, రైతుబంధు ఇప్పటికే జమ చేశామని, రైతు రుణమాఫీకి కసరత్తు చేస్తున్నామని చెబుతూ విపక్షాలకు దీటైన జవాబిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలు రైతుల చుట్టూనే తిరుగుతూ, వారి సమస్యలే ఎజెండాగా చేస్తున్న రాజకీయ యుద్ధం.. ముదురుతున్న ఎండలు, ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

భరోసా పేరిట బీజేపీ

బీజేపీ కూడా రైతుల పక్షాన ఆందోళనలకు దిగింది. రాష్ట్ర రైతాంగానికి భరోసా ఇవ్వడం కోసమంటూ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మంగళవారం కరీంనగర్ వేదికగా రైతుదీక్ష చేపట్టారు. ఇదే క్రమంలో ఈనెల ఐదో తేదీన రైతు సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షకు కమలనాథులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎదురుదాడికి దిగుతూ విపక్షాలపై విమర్శలు ఎక్కుపెడుతోంది. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, ఇతర మంత్రులు దీటుగా కౌంటర్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాధుల బారిన పడటం, ఇటీవలి కాలంలో మరణాల సంఖ్య పెరగడమే ఇందుకు కారణం. గడిచిన మూడేళ్లలో ఈ వ్యాధి బారిన పడి 12 మంది మృత్యుఒడికి చేరారు. గ్రామంలోని చేద బావులు, చేతి పంపుల నీటిని తాగడం వల్లే తమ కిడ్నీలు పాడవుతున్నాయని ఆందోళనకు గురవుతున్న భీంపూర్ మండలం కమట్‌వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని గోవింద్‌పూర్ గిరిజనులంతా గ్రామాన్ని ఖాళీ చేసి మరో చోటికి వెళ్లిపోయారు.

హామీలిచ్చి మరిచిపోయారు

ఆదిలాబాద్ జిల్లా గోవింద్‌పూర్ గ్రామంలో 40 ఆదివాసీ గిరిజన కుటుంబాలు (200 మంది జనాభా) ఉన్నాయి. వారికి తాగునీటి వసతి సరిగ్గా లేదు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. దీంతో గ్రామంలోని రెండు చేతి పంపులతో పాటు చేద బావుల నీటినే గిరిజనులువినియోగించే వారు. అయితే గడిచిన మూడేళ్లలో వరుసగా కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణాలు సంభవిస్తుండటంతో వారిలో ఆందోళన మొదలైంది. యువకులు సైతం వ్యాధుల బారిన పడుతుండటంతో ఊరు వదిలి వెళ్లడం ప్రారంభించారు. ఈ విషయాన్ని గమనించిన 'సాక్షి' 2022 నవంబర్ 4న 'ఊరొదిలిపోతున్నారు..' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో కొందరు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామాన్ని విడిచి వెళ్లవద్దని, గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, అవసరమైన వైద్య పరీక్షలు చేస్తామని భరోసా ఇచ్చారు. కానీ హామీలేవీ నెరవేరలేదు. క్రమంగా జబ్బుపడే వారి సంఖ్య, మరణాలు పెరుగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వారు ఊరు ఖాళీ చేసి పక్కనే ఉన్న అడవి సమీపంలో గుడిసెలు వేసుకున్నారు. ఇక్కడ వారికి ఎలాంటి వసతులు లేవు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గుడ్డి దీపాలతో నెట్టుకొస్తున్నారు. సమీపంలోని వ్యవసాయ బావి నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఇతర అవసరాల కోసం పక్కనున్న చెరువు, వాగు నీటిని వినియోగిస్తున్నారు.

నీటిలో అధికంగా భార మూలకాలు

'సాక్షి' కథనంతో స్పందించిన హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం భీంపూర్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల రక్త, మూత్ర నమూనాలు, గ్రామంలోని చేతిపంపుల నుంచి నీటిని సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. నీటిలో భార మూలకాల శాతం అధికంగా ఉందని, ఈ కారణంగానే కిడ్నీ సంబంధిత వ్యాధులు సోకుతున్నాయని అప్పట్లోనే ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ అప్పట్నుంచీ ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

సమస్య తీవ్రత చెప్పినా పట్టించుకోలేదు



బోరు బావి నీటిని తాగడం వల్ల పలు అనారోగ్య సమస్యలకు, కిడ్నీ వ్యాధులకు గురవుతున్నామని అధికారులకు మొర పెట్టుకున్నాం. దీంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– జమునబాయి, మాజీ సర్పంచ్, గోవింద్‌పూర్

భార్యను బతికించుకోవాలనుకున్నా కానీ..



నా భార్య కుమ్ర భీంబాయి అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లా. అక్కడ పరీక్షించిన వైద్యులు కిడ్నీ సమస్య ఉందని చెప్పారు. దీంతో ఆమెను బతికించుకునేందుకు రెండేళ్ల కిందటే మా గ్రామాన్ని వదిలేసి పక్కనే ఉన్న జెండాగూడకు వలసవెళ్లాం. కానీ కొన్నాళ్లకే ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించి చనిపోయింది. ఇప్పుడు నా ప్రాణాన్ని కాపాడుకునేందుకు గ్రామానికి దూరంగా ఉంటూ, వ్యవసాయ పనులు కూడా ఇక్కడి నుంచే చేసుకుంటున్నా.

– కుమ్ర పరశురాం, గోవింద్‌పూర్ గ్రామస్తుడు

మరోసారి వైద్య పరీక్షలు చేస్తాం

గోవింద్‌పూర్ గ్రామాన్ని వైద్య సిబ్బందితో కలిసి సందర్శించి అక్కడి పరిస్థితిపై అధ్యయనం చేస్తాం. స్థానికులు గ్రామాన్ని విడిచివెళ్లిన విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. గతంలో ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశాం. మరోసారి నీటి పరీక్షలతో పాటు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– నిఖిల్ రాజ్, భీంపూర్ మండల వైద్యాధికారి

సాగు, తాగునీటిపై చర్చకు సిద్ధమా?

ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల, బాల్క సుమన్, దాసోజు సవాల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగు, తాగునీరుపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా అని బీఆర్‌ఎస్ నేతలు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంటి ఫెయిల్యూర్ ప్రభుత్వాన్ని దేశంలో ఎక్కడా చూడలేదని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, బాల్క సుమన్, దాసోజు శ్రవణ్, గ్యాదరి కిశోర్ మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం జనాలను మభ్యపెడుతోందన్నారు. కేసీఆర్ పర్యటన అనగానే గాయత్రి పంపుహౌస్ నుంచి, నాగార్జునసాగర్ నుంచి ఎడమకాల్వకు నీళ్లు వదిలారని చెప్పారు. ఈ యాసంగి సీజన్‌లో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రాష్ట్రంలో రిజర్వాయర్లలో, చెరువుల్లో నీళ్లు లేవని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. నీళ్లు, కరెంటు, రైతుబంధు ఇవ్వాల్సిన ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆరునెలల్లో అటుఇటు కావచ్చునని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి, హోమ్ సెక్రెటరీని కూడా విచారించాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వం మజ్లిస్‌కు గులామ్‌గా మారింది

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

గోల్కొండ (హైదరాబాద్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి వంగివంగి సలామ్ చేసేదని ప్రస్తుతం కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ఏఐఎంఐఎం పార్టీ ముందు సాష్టాంగపడి మొక్కుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. గుడిమల్కాపూర్ బోజగుట్ట, మెహిదీపట్నం డివిజన్‌లోని పద్మనాభనగర్ కాలనీలలో మంగళవారం జరిగిన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. సుదీర్ఘ కాలంగా హైదరాబాద్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ అభివృద్ధికి చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు.

కరువుకు, కాంగ్రెస్‌కు సంబంధం ఏమిటి?

▶ మొదటి పేజీ తరువాయి

ఎప్పుడు వస్తుందో తెలియదా? కరువుకు, కాంగ్రెస్‌కు సంబంధం ఏమిటి? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది చలికాలంలో. చలికాలంలో వర్షాలు కురుస్తాయా? వర్షాకాలంలో వానలు పడక పోవడం వల్ల ప్రస్తుతం కరువొచ్చింది. కేసీఆర్ పాపాల వల్లే వరుణ దేవుడు భయపడి పారిపోయాడు. నువ్వు చేసిన పాపాలను మా ఖాతాలో రాయడం సమంజసమా?..'అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జనజాతర సభ ఏర్పాట్లు పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి

64 లక్షల మంది ఖాతాల్లో రైతుబంధు నగదు వేశాం

'వంద రోజులు కాలేదు. కానీ అప్పుడే అది చేయలేదు. ఇది చేయలేదని అంటున్నారు. వంద రోజుల్లోనే 64,75,000 మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు నగదు వేశాం. 69 లక్షల ఖాతాలు ఉండగా, ఇప్పటికే 64 లక్షల మంది ఖాతాల్లో నగదు జమ చేశాం. అసెంబ్లీలోనే ఈ లెక్కలు బయట పెట్టా. నువ్వు వస్తావని ఆశించా. కానీ రాకుండా పారిపోయావు. లెక్కల్లో తప్పులు ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమే..'అని సీఎం అన్నారు.

30 సెకన్లు కూడా కరెంటు పోలేదు

'సూర్యాపేటలోని ఏ సబ్‌స్టేషన్‌లోనూ 30 సెకన్లు కూడా కరెంట్ పోలేదు. ఆయన పెట్టుకున్న మైకుకు జనరేటర్ ఉంది. దానిలో ఎవరు వేలు పెట్టారో ఎవరికి తెలుసు? పదేళ్ల ప్రతి పక్షంలో ఉన్నాం. ఏ ఒక్క రోజైనా మమ్మల్ని బయటికి వెళ్లనిచ్చావా? ప్రతిపక్షాల గొంతులు నొక్కి, గొర్రెలను ఈడ్చుకెళ్లినట్లుగా ఈడ్చుకెళ్లి జైళ్లలో పెట్టించావు. కానీ మేము ప్రతిపక్ష నేతకు పూర్తి రక్షణ కల్పించాం. ప్రజా సమస్యలపై తొలిసారిగా బయటికి వచ్చావు. కనీసం ఇలాగైనా పాపాలు కడుక్కుంటారని అనుమతి ఇచ్చాం..'అని రేవంత్ ఎద్దేవా చేశారు.

రూ.100 కోట్లు పంచినా సానుభూతి వచ్చేది

- 'పలు రకాల కమీషన్ల రూపంలో వచ్చిన రూ.1,500 కోట్లు నీ ఖాతాల్లో ఉన్నాయి. ఆ పాపపు సొమ్ములో రూ.100 కోట్లు పంచినా..ప్రజలకు మేలు జరిగేది. రైతుల పట్ల నీకు సానుభూతి ఉందని ప్రజలు అనుకునేవారు. ప్రజల పంట ఎండిపోతే.. దాన్నుంచి కూడా ఎన్నికల్లో లబ్ధి పొందాలని నక్కజిత్తుల వేషాలు వేశావు. పొగ పెడితే ఎలుకలు బయటికి వచ్చినట్లు..ఎన్నికలనే పొగ పెట్టడంతో కేసీఆర్ బయటికి వచ్చాడు. లేదంటే ఆయన ఫాం హౌస్ కూడా దాటి వచ్చేవాడు కాదు. అధికారం కోల్పోయిన తర్వాత ఆగమాగమవుతుండు..'అని సీఎం వ్యాఖ్యానించారు.

కూలగొట్టిన సంసారాన్ని నిలబెడుతున్నాం

'వరికోతలు ఇంకా పూర్తి కాలేదు. కానీ ఇప్పటికే 700కు పైగా ఐకేపీ కేంద్రాలు తెరిపించాం. నీలాగా క్వింటాల్‌కు 10 కేజీలు కోత కోసే అలవాటు లేదు. ఎవరైనా అలా చేస్తే వారి తిత్తి తీస్తాం. నీలాగా మేము కమీషన్ల దందా చేయం. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక అభివృద్ధి ప్రాజెక్టుకు క్లియరెన్స్, నిధులు తీసుకొచ్చామే కానీ నీలాగా కమీషన్ల కోసం పని చేయలేదు. రాష్ట్రంలో కూలగొట్టిన సంసారాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. రూ.22,500 కోట్లతో ఇళ్లులేని పేదలకు ఇళ్లు ఇచ్చాం. ఆడ బిడ్డల కళ్లల్లో సంతోషాన్ని చూసి ఆయన కడుపులో నిప్పులు పోసుకుంటున్నాడు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదన్నట్లు, కేసీఆర్ శాపనార్థాలు మా ప్రభుత్వాన్ని ఏమీ చేయలేవు. కేసీఆర్ చెల్లని రూ.1,000 నోటు లాంటి వాడు. చెల్లని వెయ్యిని జేబులో పెట్టుకుంటే జైలుకు వెళ్లడం ఖాయం..'అని రేవంత్ అన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రణాళికలు

'నేను ఫాంహౌస్‌లో పడుకోవట్లే.. సినిమా వాళ్ల గెస్ట్ హౌసుల్లో పడుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా పునరుద్ధరించాలనే అంశంపై చర్చిస్తున్నాం. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తున్నాం. హైదరాబాద్ నగరానికి సరిపడా తాగునీరు ఇస్తున్నాం. కృష్ణా జలాలు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ ఇస్తున్నాం. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో వచ్చే 90 రోజులకు సరిపడా నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..'అని ముఖ్యమంత్రి తెలిపారు. తుక్కుగూడ వేదికగా జాతీయ స్థాయిలో ఐదు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రకటించనుందని చెప్పారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని, జూన్ 9న రాంలీలా మైదానంలో ప్రమాణ స్వీకారం చేయబోతోందని అన్నారు. సభకు పెద్ద సంఖ్యలో జనం తరలి రావాలని రేవంత్ పిలుపునిచ్చారు.

రైతులను ఆదుకునే శ్రద్ధ ఉందా?

- విపక్ష నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఇళ్లకు వెళుతున్నారు
- ప్రభుత్వ వైఫల్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయి
- కేసీఆర్ పొలం బాటతోనే కళ్లు తెరచిన సర్కార్
- రైతులకు ఇచ్చిన హామీలపై చర్చకు సిద్ధం: హరీశ్ రావు ధ్వజం



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: విపక్షనేతల ఇళ్లలోకి వెళ్లి పార్టీలో చేర్చుకునే శ్రద్ధ రైతులను ఆదుకోవడంలో లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. పంటలు ఎండిపోతుంటే సీఎం, మంత్రులు ఇంతవరకు వెళ్లి చూడలేదన్నారు. రైతులను ఆదుకునేందుకు సమయం దొరకడం లేదని, కానీ బీఆర్‌ఎస్ నేతలను తిట్టడం, కేసులు పెట్టడం బిజీగా ఉన్నారని చెప్పారు. మంగళవారం ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం, పంటలకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ మనుచౌదరికి హరీశ్‌రావు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నీటి నిర్వహణ వైఫల్యం, విద్యుత్ లోపాల వలన రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయన్నారు. కేసీఆర్ పొలం బాట పట్టాకే సర్కారు కళ్లు తెరిచిందని చెప్పారు.

ఎన్నికల హామీలపై చర్చకు సిద్ధమా..?

భట్టి ఒట్టి మాటలు కట్టిపెట్టాలని, రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలన్నారు. తక్షణమే రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీల విషయంలో ఎలాంటి చర్చకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు.

కలిస్తే జోడీ..లేదంటే ఈడీ

గజ్వేల్: 'కలిస్తే జోడీ..లేదంటే ఈడీ అనే తరహాలో బీజేపీ వ్యవహరిస్తుండగా, వంద రోజుల పాలనలో కాంగ్రెస్ వైఫ్యలాలను మూటగట్టుకున్నదని..ఈ రెండు పార్టీలకు ఎంపీ ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాల్సిన అవసరముంది' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మెదక్ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 200మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కోసం పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలుచేసిన తర్వాతే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు అడగాలని డిమాండ్ చేశారు. దుబ్బాకలో ప్రజల తిరస్కరణకు గురైన రఘునందన్‌రావుకు ప్రజలు ఓటు వేసే అవకాశమే లేదని చెప్పారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ తనకు ఎంపీగా అవకాశం కల్పిస్తే..రూ.100 కోట్ల తన నిధులతో ట్రస్టు స్థాపిస్తానని హామీ ఇచ్చారు.

పాల బిల్లులు చెల్లించండి

సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాడి రైతులకు చెల్లించాల్సిన రూ.80 కోట్ల పాల బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన మంగళవారం లేఖ రాశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు క్రమపద్ధతిలో చెల్లించేదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడం లేదని తన లేఖలో పేర్కొన్నారు. దీంతో 45 రోజులుగా రైతులకు రావాల్సిన రూ.80 కోట్ల మేర పాల బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాడి రైతులకు బకాయిలు చెల్లించాలని కోరారు.

ఎకరాకు రూ.25వేలు పరిహారమివ్వాలి

- రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- సీఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన బీఆర్‌ఎస్ నేతలు
- కేసీఆర్ వస్తున్నారనే గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీళ్లు వదిలారు



సీఎస్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ నెల 5న కరీంనగర్‌కు వస్తున్నారని తెలిసే గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీళ్లను లిఫ్ట్ చేసి వదులుతున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమ కాలంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు జోలె పట్టిన కేసీఆర్ ప్రస్తుతం రైతులకు ధైర్యం చెప్పేందుకు పంటల పొలాలకు వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రైతుబంధు సకాలంలో రాకపోవడం, రైతు రుణమాఫీ జరగకపోవడంతో రైతులు ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. 3 నెలల్లోనే 200మందికి పైగా రైతులు మరణించారని, 20 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని హైదరాబాద్‌లోనూ తాగునీటి ఇబ్బందులు తీవ్రమయ్యా యని పేర్కొన్నారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం, క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. రూ.2లక్షల రుణమాఫీని తక్షణమే అమ లు చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎస్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందంలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్‌రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్ఎల్పీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి ఉన్నారు.

ఎన్నాళ్లు కేసీఆర్‌పై అబద్ధపు ప్రచారాలు?

అనంతరం తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం కష్టాల్లో ఉందనే సోయి లేకుండా సీఎం రేవంత్ రెడ్డి మూటలతో ఢిల్లీకి పోవడమే సరిపోతోందని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లెత్తాలి

- రాష్ట్రంలో సాగు, తాగునీటికి తీవ్ర కొరత
- కాంగ్రెస్‌కు చేతకాదంటే కేంద్రాన్ని ఒప్పించి నిధులు తెస్తా
- ఆరు గ్యారంటీలు అమలు కాకుంటే కాంగ్రెస్‌లో మిగిలేది ఆరుగురే
- ఇక బీఆర్‌ఎస్‌లో మిగిలేది నలుగురే
- 'రైతు దీక్ష'లో బండి సంజయ్



కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో రైతుదీక్షలో కూర్చున్న ఎంపీ బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో సాగు, తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎత్తాల్సింది పార్టీ గేట్లు కాదని, సాగునీటి ప్రాజెక్టుల గేట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. నగరాలు, పట్టణాల్లో మంచినీటి కొరత మొదలైనా పట్టించుకోరా? అని నిలదీశారు. ఇచ్చిన హామీలను అమలు చేసే దమ్ము లేదని కాంగ్రెస్ లేఖ ఇస్తే తానే కేంద్రంతో మాట్లాడి నిధులు తెప్పిస్తానని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీలో ఆరుగురే నేతలు మిగులుతారని, కేసీఆర్ కుటుంబంలోనూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితలే ఉంటారని ఎద్దేవా చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 'రైతు దీక్ష'లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లలో తరుగు, రుణమాఫీ, సాగునీటి కొరత, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఈ దీక్ష తలపెట్టారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా దించాలన్న ఆలోచన లేదు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా దించాలనే ఆలోచన బీజేపీకి లేదని బండి స్పష్టం చేశారు. కేసీఆర్‌కి 2 బీహెచ్‌కే (బేటా బేటీ బాప్, హరీశ్, కవిత) పరిస్థితి వస్తుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫాం హౌజ్ నుంచి రాజకీయాలు చేస్తే కాంగ్రెస్ నేతలు హామీల పేరుతో రాజకీయం చేస్తున్నారని బండి విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్.. రూ.600కోట్లతో అమలు చేసినట్లుగా మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. పంటనష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.25 వేల పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు ప్రారంభమైన నేపథ్యంలో అన్ని పంటలకూ రూ.500 బోనస్ ప్రకటించాలని కోరారు. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు ఎందుకివ్వడం లేదని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

ఏ ముఖం పెట్టుకుని వస్తున్నాడు?

గతేడాది చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగులో పంట నష్టపోతే రైతులను పరామర్శించిన కేసీఆర్ ఎకరాకు రూ.10 వేలు ఇస్తానని మాట తప్పారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని కేసీఆర్ కరీంనగర్‌కు వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర రైతాంగానికి క్షమాపణ చెప్పిన తరువాతే కేసీఆర్ కరీంనగర్‌కు రావాలని డిమాండ్ చేశారు. మేం బరాబర్ శ్రీరాముడి ఫొటోతో ఓట్లడుగుతాం.. కాంగ్రెస్‌కు దమ్ముంటే బాబర్ ఫొటోతో ప్రచారం చేసుకోవాలని బండి సవాల్ విసిరారు.



కోరుకున్నది ఫలిస్తే అది మరింత పెద్ద కోరికను కలిగిస్తుంది. కోరిక నెరవేరకపోతే ఏదో ఒక పద్ధతిలో దాన్ని నెరవేర్చుకోవాలని పెనుగులాడతాం. చర్య–ఫలితం–చర్య వీటినిలా కొనసాగిస్తూ పోయే విషవలయమే సంసారచక్రం.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

ఫోకస్

సాక్షి

బుధవారం, 3 ఏప్రిల్ 2024

చిరుదీవిలో ఎన్నికల చేపలవేట

ఎన్నికలంటే సాధారణంగా ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం లాంటివి ప్రస్తావనకొస్తాయి. కానీ, మూడు రోజులుగా ఓ విదేశాంగ విధానం ప్రధానాంశమై కూర్చుంది. లోక్‌సభ ఎన్నికల తొలి దశలోనే తమిళనాట పోలింగ్ జరగనున్న వేళ ఆ రాష్ట్రానికి అతి సమీపంగా భారత – శ్రీలంకల మధ్యనున్న చిరుద్వీపం కచ్చతీవు ఇప్పుడు వార్తల్లో నిలిచింది. స్టాలిన్ సారథ్యంలోని స్థానిక డీఎంకె ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రధాని, విదేశాంగ మంత్రి సహా సమస్త శక్తులనూ బీజేపీ కేంద్రీకరించినట్టు కనిపిస్తోంది. ఎన్నికల మాట అటుంచితే, భారత సర్కారే ఒకప్పుడు శ్రీలంకకు అప్పగించిన ఓ ద్వీపప్రాంత ప్రాదేశిక హక్కులపై ఇప్పుడు రగడ చేయడం సబబేనా? ప్రభుత్వాలు మారినప్పుడల్లా సముద్ర జలాల సరిహద్దులు మార్చేసే ప్రయత్నాలు ఎక్కడికి దారి తీస్తాయి?

భారత్ – శ్రీలంకల మధ్య పాక్ జలసంధిలో 1.6 కిలోమీటర్ల పొడవు, 300 మీటర్ల వెడల్పున్న చిన్న ప్రాంతం కచ్చతీవు. భారత్‌లోని రామేశ్వరానికి ఉత్తరాన 30 కి.మీ.ల దూరంలో, శ్రీలంకలోని జాఫ్నాకు దక్షిణాన 60 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ద్వీపం వ్యూహాత్మకంగా కీలకమైనది. కచ్చతీవు చారిత్రకంగా జాఫ్నా రాజ్యంలో, ఆపైన రామ్‌నాడ్ సహా పలువురు రాజుల ఏలుబడిలో, బ్రిటీష్ వారి హయాంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. తాగునీటితో సహా ప్రాథమిక వసతులేవీ లేని ఈ ప్రాంతంలో ఒకే ఒక్క చర్చి మినహా నివాసాలే లేవు. ఈ ద్వీపం తాలూకు ప్రాదేశిక హోదాపై భారత్, శ్రీలంకల మధ్య దీర్ఘకాలం వివాదం నెలకొంది. అయితే, 1974లో ఇరుదేశాలూ ఓ ఒప్పందానికి వచ్చి, సంతకాలు చేశాయి. శ్రీలంకతో పటిష్ఠ బంధానికై కేంద్రంలో ఇందిరా గాంధీ సారథ్యంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చిరుద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించింది. ఇప్పుడు యాభై ఏళ్ళ తర్వాత మోదీ నేతృత్వంలోని బీజేపీ భారత సమైక్యతకు విఘాతం కలిగిస్తూ కాంగ్రెస్, డీఎంకెలు ‘నిర్లక్ష్యంగా’ ఆ ద్వీపాన్ని శ్రీలంకకు ధారాదత్తం చేసేశాయంటూ దాడికి దిగింది.


తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఇటీవల ‘సమాచార హక్కు’ పిటిషన్ ద్వారా ఇప్పటి దాకా బయటపడని ఈ ద్వీపం అప్పగింత వివరాలను తీసుకున్నారు. అవన్నీ మీడియాలో వచ్చాయి. దక్షిణాదిన, అందునా తమిళనాట బీజేపీ జెండా ఎగరేయాలని తరచూ పర్యటిస్తున్న ప్రధాని మోదీ దాన్ని అందిపుచ్చుకొన్నారు. ద్వీపం అప్పగింత తప్పుడు నిర్ణయమంటూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్వరం కలిపారు. సమీప శ్రీలంక జలాల్లో భారతీయ జాలర్లను పదే పదే అరెస్టు చేస్తున్నారంటే, అదంతా అప్పటి తప్పుడు నిర్ణయం ఫలితమేనని ఆయన ఆరోపణ. ఈ చిరుద్వీపానికి తన దృష్టిలో పెద్దగా ప్రాధాన్యం లేదని 1961 మేలోనే ప్రధాని నెహ్రూ అన్నారట. ద్వీపాన్ని అప్పగించినా చేపలు పట్టుకొనేందుకు భారతీయులకున్న హక్కుల్ని 1974 ఒప్పందంలో పరిరక్షిస్తున్నామంటూ పార్లమెంట్‌కు హామీ ఇచ్చిన నాటి సర్కార్ తీరా ఆ ప్రాంతంలో చేపలు పట్టే హక్కులను సైతం 1976లో వదులుకుందని జైశంకర్ నిందిస్తున్నారు. గత ప్రధానులు ఈ అంశంపై ఉదాసీనంగా ఉన్నా, భారత – శ్రీలంక సముద్రజలాల సరిహద్దు చట్టం అమలు, భారతీయ జాలర్ల హక్కులపై తమ సర్కార్ శ్రీలంకతో చర్చలు జరుపుతుందని ఆయన చెబుతున్నారు.

గమ్మత్తేమిటంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న కమలనాథులు గత పదేళ్ళుగా ఆ పని ఎందుకు చేయలేదో తెలీదు. అలాగే, ఆ ద్వీపాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనే పనిలో మోదీ సర్కార్ ఉన్నట్టు తమిళనాడు బీజేపీ చెబుతోంది కానీ, అసలు ఇప్పటి దాకా ఆ అంశంపై మోదీ సర్కార్ నుంచి అధికారిక సమాచారమే లేదని శ్రీలంక మంత్రి ఒకరు తేల్చేశారు. మరి, కచ్చతీవు అంశాన్ని బీజేపీ ఉన్నట్టుండి ఎందుకు లేవదీసినట్టు? లోక్‌సభ ఎన్నికల తొలి దశలో భాగంగా ఈ నెల 19న తమిళనాట పోలింగ్ జరగనుంది. ప్రాంతీయ, భాషాభిమానాలు మెండుగా ఉండే తమిళనాట చొచ్చుకుపోవడానికి తంటాలు పడుతున్న బీజేపీ దీన్ని ఓ అస్త్రంగా భావించింది. కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఆ ద్వీపాన్ని ఇచ్చేస్తుంటే, అడ్డుకోని కరుణానిధి సారథ్యంలోని డీఎంకె సర్కార్‌దీ తప్పుందని బీజేపీ నిందిస్తోంది. తమిళ ఓటర్లలో సెంటిమెంట్ రగిల్చి లబ్ధి పొందడమే దాని అజెండాగా కనిపిస్తోంది.

నిజానికి, ఎవరు సలహా ఇచ్చారో కానీ ఆ దీవిని శ్రీలంకకు ఇచ్చేశాం. దీవి అప్పగింత విషయం అంతర్జాతీయ వ్యవహారం గనక అప్పట్లో కేంద్రం తమిళ సర్కార్‌కు సమాచారమిచ్చి ఉంటుందే తప్ప, సరేనన్న అనుమతి తీసుకొని ఉంటుందనుకోలేం. స్థానిక అనివార్యతల రీత్యా అప్పటి కరుణానిధి సర్కార్ నుంచి ఇప్పటి స్టాలిన్ సర్కార్ దాకా డీఎంకె ప్రభుత్వాలు శ్రీలంకతో ఒప్పందాన్ని నిరసిస్తూనే వచ్చాయి. చేపల వేటకు వెళ్ళే తమిళ జాలర్లు పదే పదే లంకేయుల చేతిలో అరెస్టవుతున్నారని చెబుతూనే ఉన్నాయి. ఆ మధ్య భారత – శ్రీలంక ప్రధానుల భేటీ ముందూ స్టాలిన్ ఈ సంగతి మోదీ దృష్టికి తెచ్చారు. అవేవీ పట్టించుకోని బీజేపీ ఎన్నికల ముందు ఈ అంశం పట్టుకోవడమే విడ్డూరం. ద్వైపాక్షిక బంధాలపై ప్రభావం చూపే సున్నితమైన అంశాన్ని ఎన్నికల లబ్ధి కోసం తలకెత్తుకోవడం ప్రమాదకరం. నేపాల్ లాంటి పొరుగుదేశాలతోనూ అపరిష్కృత ప్రాదేశిక వివాదాలున్న భారత్ గతాన్ని తవ్వితే తలనొప్పులే. శ్రీలంకలో జాతుల యుద్ధం ముగిశాక వాణిజ్యం, ఇంధన, రవాణా రంగాల్లో ఇరు దేశాలూ ముందుకు సాగుతున్నాయి. పాత చరిత్రను ఆశ్రయిస్తే కొత్త దౌత్య యత్నాలకు చిక్కులు తప్పవు. హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక ప్రాంతంలో లంగరేయడానికి చైనా సిద్ధంగా ఉన్నవేళ కచ్చతీవు వివాదం అభిలషణీయం కానే కాదు. అయినా, మనమే వదులుకున్న ఈ దక్షిణాగ్ర ద్వీపంపై ఇంత ప్రేమ ప్రదర్శిస్తున్న పాలకులు ఉత్తరాన వేలాది చదరపు కిలోమీటర్లు చైనా ఆక్రమించుకున్నట్టు వార్తలున్నా ఉలకరేం? పలకరేం?

నూతన విద్యా విప్లవం వర్ధిల్లాలంటే...

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

గత ఐదేండ్లలో దేశంలో ఎక్కడా లేని విద్యా విధానం ఆంధ్రప్రదేశ్‌లో అమలైంది. కానీ తమ పిల్లల్ని ఖరీదైన ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివించిన వారు... పేదలు తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లలో కావాలని కోరుకుంటే వ్యతిరేకించారు. ఇది విచిత్ర చారిత్రక సన్నివేశం. దేశంలో ప్రయివేట్ విద్య ఎంత ఖర్చుతో కూడుకున్నదో, ఏ భాషలో సాగుతున్నదో తెలియదా? ప్రజా మేధావులకు తెలివి కన్నా, బీద ప్రజల పక్షాన నిలబడే హృదయం ఉండాలి కదా! దేశ చరిత్రలో మొదటిసారి విద్యా సమానత్వ ప్రయోగాన్ని జగన్ ప్రభుత్వం చేస్తోంది. ఆ ప్రక్రియను వ్యతిరేకించే మూడు పార్టీల కూటమిని సమర్థించే మేధావులను ప్రజలు వ్యతిరేకించాల్సింది... తమ పిల్లల భవిష్యత్తు కోసం!

2024 ఆంధ్ర ఎన్నికలు గత రెండు ఎన్నికల కంటే పూర్తిగా భిన్నమైనవి. 2014లో ఒకవైపు మూడు పార్టీల కూటమికీ, వైసీపీకీ రాష్ట్ర విభజన నేపథ్యంలో జరిగాయి. అప్పుడు కేంద్రంలో రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆనాడు కొత్త రాష్ట్ర రాజధాని, ప్రత్యేక ప్యాకేజీ ప్రధాన అంశాలు. 2019 ఎన్నికల్లో అన్ని పార్టీలు విడివిడిగా కొట్లాడాయి. వైసీపీ తన కొత్త విద్యా విధానం, గ్రామాల అభివృద్ధి అంశాలతో 151 సీట్లు గెలిచింది. విడిగా పోరాడిన మూడు పార్టీలు మట్టికరిచాయి. చంద్రబాబుకు 23 సీట్లు, పవన్ కల్యాణ్‌కి 1 సీటు వచ్చాయి.

గత ఐదేండ్లలో ఆ పార్టీలు ఊహించని విధంగా దేశంలో ఎక్కడా లేని విద్యా విధానం ఆంధ్రప్రదేశ్‌లో అమలైంది. దీన్ని ఏపీ నాయకులు చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు, జయప్రకాశ్ నారాయణ తీవ్రంగా వ్యతిరేకించారు. వీరేకాక దేశ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఎం.వి. రమణ కూడా వ్యతిరేకించారు. సమస్య కోర్టుకు పోయింది. అక్కడ కేంద్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకించింది. సుప్రీంకోర్టు జడ్జిగా రమణకు ఇంగ్లీష్ భాష పాత్ర ఎంతో తెలుసు. అయినా వ్యతిరేకించారు. వీరుకాక మీడియా రంగంలో ఈనాడు గ్రూపు, ఆంధ్రజ్యోతి గ్రూపు, టీవీ 5 నెట్‌వర్క్ అధిపతులు తమ పిల్లల్ని మంచి, మంచి ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివించి... రైతులు, కూలీలు, దళితులు, బీసీలు, ఆదివాసులు తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లలో కావాలని కోరుకుంటే వ్యతిరేకించారు. ఇది విచిత్ర చారిత్రక సన్నివేశం.

ఈ ఎన్నికల్లో మళ్ళీ 2014 నాటి ప్రతిపక్ష గుంపు జత కట్టింది. జగన్‌ను ఓడించాలని వీళ్ళు రాత్రింబవళ్లు పనిచేసేది ఎందుకోసం? ముఖ్యంగా గ్రామీణ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువు ఆపెయ్యడం కోసం. ఈ క్రమంలో జయప్రకాశ్ నారాయణ గురించి కొంత చర్చించాలి. ఈయన మాజీ ఐఏఎస్ అధికారి. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కొంతకాలం ఆయన పర్సనల్ సెక్రటరీగా పని చేశారు. ఆ దశలో తెలంగాణలో నక్సలైట్లకూ, తెలుగుదేశం పార్టీకీ తీవ్ర సంఘర్షణ జరుగుతున్నది. ఎన్టీఆర్ సన్నిహిత సోషలిస్టు నాయకుడొకరు కేజీ కన్నాభిరన్ (అప్పటి పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు)కు కబురుపెట్టి, ముఖ్యమంత్రితో హక్కుల నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ మీటింగుకు నేను, కన్నాభిరన్, బాలగోపాల్, ఎం.టి. ఖాన్ వెళ్లాం. మేం వెయిటింగ్ రూంలో ఉండగా జయప్రకాశ్ నారాయణ ఆ మీటింగ్‌ను జరగకుండా చూడాలని చాలా ప్రయత్నం చేశాడు. కానీ ఎన్టీఆర్ వినలేదు. మీటింగ్ జరిగింది.

నక్సలైట్లను అణచివెయ్యాలి గానీ వారితో చర్చలేమిటని జేపీ ఆలోచన. ఆ విభాగాన్ని చూసే పోలీస్ ఆఫీసర్ అరవిందరావుది కూడా అదే ఆలోచన. మా పౌరహక్కుల టీమ్ ఇరుపక్షాల హత్యలు, కిడ్నాప్‌లు, ఎన్‌కౌంటర్లు ఆపించాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్న రోజులవి. అప్పుడు ఎన్‌కౌంటర్లు, టీడీపీ కార్యకర్తల కిడ్నాపులు చాలా జరిగాయి. ఆ తరువాత జయప్రకాశ్ నారాయణ ఈనాడు పేపర్, ఈటీవీ ద్వారా మేధావి అవతారమెత్తాడు. అక్కడి నుండి ఒక ఎన్జీవో పెట్టి, ‘లోక్‌సత్తా’ (అంటే ఇంగ్లీష్‌లో గ్లోబల్ పవర్) అనే రాజకీయ పార్టీ రూపందాల్చి, దానికి అలుపెరుగని, ఎన్నడూ దిగిపోని ఏకోముఖ (అంటే ఆ పార్టీలో మరో ముఖమే కనపడదు) అధ్యక్షుడుగా ఉన్నాడు. ఇప్పుడు ఈ గ్లోబల్ పవర్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిని ఓడించాలని ఉన్న మూడు పార్టీల కూటమి చాలనట్లు నాలుగో పార్టీగా అందులో చేరాడు. ఇప్పుడు జేపీ లక్ష్యమంతా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం చదువు ఆపి, మళ్లీ తెలుగు మీడియం పెట్టేంత వరకూ పోరాటం చెయ్యడం!



చారిత్రక సన్నివేశం: ఏపీలో విద్యా సమానతా ప్రయోగం

ఆయన మరో లక్ష్యం గ్రామాలలో స్కూళ్ల నిర్మాణం, సెక్రటేరియట్ నిర్మాణాలను ఆపి అభివృద్ధికి మార్గంగా అమరావతిని సింగపూర్‌లా చూపడం! అభివృద్ధిపై ప్రపంచ యూనివర్సిటీలు చదివే గొప్ప పుస్తకం ఆయన రాసినట్లు, డెవలప్‌మెంటల్ ఎకనామిక్స్‌లో తాను అథారిటీ అయినట్లు నిరంతర యూట్యూబ్ ఉపన్యాసాలు ఇస్తున్నారు. గ్లోబల్ పవర్ ఈనాడు నుండి ఇప్పుడు యూట్యూబ్‌కు మారింది. విద్యా వ్యవస్థ మీద కూడా జాన్‌డ్యూయి (కొలంబియా యూనివర్సిటీలో అంబేడ్కర్ గురువు) కంటే తానే మంచి ఎక్స్‌పర్ట్ అన్న రీతిలో ఉపన్యాసాలు ఇస్తారు. జేపీ ప్రపంచ మార్పు మీద ఇంగ్లీష్‌లోనో, తెలుగులోనో రాసిన మంచి పుస్తకం మార్కెట్‌లో ఉంటే చదవాలని ఉంది. కానీ ఇంతవరకు ఒక్కటీ కనిపించలేదు.

30,000 ఎకరాల భూమిని చంద్రబాబు నాయుడు తీసుకున్నప్పుడు వెంకయ్యనాయుడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి. ఆయన సలహా, సహకారం లేకుండా చంద్రబాబు ఆ పని చెయ్యడు. ఇప్పుడు గ్రామీణ బడుల నిర్మాణం, ఇంగ్లీష్ మీడియం చదువు, అమ్మ ఒడి పథకం ఆపి, అమరావతి పట్టణం వచ్చే ఐదేండ్లలో కడితే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు దేశానికే ఒక మోడల్ సిటీ వస్తుందని బహుశా జేపీగారి నమ్మకం. కానీ ఒక ఎనిమిదో తరగతి విద్యార్థి మా తల్లిదండ్రులు జగన్‌కు ఓటేసి గెలిపించకపోతే, ఇంగ్లీష్ మీడియం ఆగిపోతే, నాకొచ్చే బట్టలు, బూట్లు ఆగిపోతే నేను ఉన్న బట్టలు సర్దుకుని ఇంట్లోనుండి పారిపోతాను అన్నాడు. ఆ పిల్లోడి ఆశను ఏం చెయ్యాలని ఈ నాయకులు అనుకుంటున్నారు?

ప్రజా మేధావికి తెలివి కన్నా, వాగ్దాటి కన్నా బీద ప్రజల పక్షాన నిలబడే హృదయం ఉండాలి కదా! దేశంలో ప్రయివేట్ విద్య ఎంత ఖర్చుతో కూడుకున్నదో, ఏ భాషలో సాగుతుందో వీరందరికీ తెలువదా?

2024–25 ఎకనమిక్ సంవత్సరానికి ధీరూబాయి అంబానీ కొడుకు, కోడలు నడిపే స్కూలు ఫీజు చూడండి: సంవత్సరానికి ఎల్‌కేజీ విద్యార్థి ఫీజు: 1,70,000. 8–10వ తరగతి పిల్లల ఫీజు: 5,90,000. 11–12వ తరగతి పిల్లల ఫీజు: 9,65,000. ఇటువంటి స్కూళ్లు దేశంలో చాలా ఉన్నాయి. ఇవన్నీ ఏ మాతృభాషలో నడుస్తున్నాయి? ఇంతింత ఫీజులలో ఇంగ్లీష్ మీడియంలో, విదేశీ సిలబస్‌తో చదివే పిల్లల్ని జగన్ మోడల్ విద్యా విధానం ద్వారా కాక ఎలా ఎదుర్కొంటారు?

ఏపీలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అన్నది కాదు సమస్య. ఈ ఎన్నికల పోరాటంలో అక్కడ ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన ఇంగ్లీష్ క్వాలిటీ విద్యా ఎక్స్‌పెరిమెంట్ ఏమైతది అనేది కీలకమైన సమస్య. నేనొక సొంత పార్టీ పెట్టుకొని జగన్‌తో పొత్తు పెట్టుకొని ఈ వ్యాసం రాయడం లేదు. జగన్ ఇచ్చిన ఎమ్మెల్యే పదవో, రాజ్యసభ ఎంపీ పదవో తీసుకుని రాయడం లేదు. ఈ దేశ ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తు మీద భయంతో రాస్తున్నాను. ఒక పబ్లిక్ ఇంటలెక్చువల్‌కు దోపిడీకి, అణచివేతకు గురౌతున్న ప్రజల జీవనం మారడం ముఖ్యం. రాజకీయ నాయకులకు రాజకీయాలలో తమ ఉనికి ముఖ్యం. తమ ఉనికి కోసమైనా రాజకీయ నాయకులు ప్రజల మార్పు కోసం, సమానత్వం సాధించడం కోసం చర్యలు చేపట్టినప్పుడు వాటిని సమర్థించడం ప్రజా మేధావి ప్రధాన కర్తవ్యం. ఈ క్రమంలోని దేశ చరిత్రలో మొదటిసారి విద్యా సమానత్వ ఎక్స్‌పెరిమెంట్ జగన్ ప్రభుత్వం చేస్తున్నందున నేనీ విద్యా విధానాన్ని సమర్థిస్తున్నాను. ఆ ప్రక్రియను వ్యతిరేకించే మూడు పార్టీల కూటమిని సమర్థించే మేధావులను ప్రజలు వ్యతిరేకించాల్సింది... తమ పిల్లల భవిష్యత్తు కోసం!

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

అనవసర రాజకీయం



స్థానిక రాజకీయాల కోసం ‘కచ్చతీవు’ అంశాన్ని లేవడమంటే, అది దౌత్యాన్నీ, శ్రీలంకతో సంబంధాలనూ దెబ్బ తీయడమే. ఆఖరికి అనుభవజ్ఞుడైన జైశంకర్ లాంటి దౌత్యవేత్త కూడా దీనితో మాట కలపడం ఆయన ఇమేజ్‌కు నష్టం కలిగిస్తుంది. దీనివల్ల మాల్దీవుల లాగా శ్రీలంకను చైనా వైపు నెట్టడమే తప్ప, దక్షిణాదిలో బీజేపీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.

– కె.సి. సింగ్, మాజీ దౌత్యవేత్త

పెంచాల్సిన ఓటింగ్



భారత జనాభాలో పస్మాందా ముస్లింల సంఖ్య గణనీయమైనది. అయినప్పటికీ చారిత్రకంగా వాళ్లలో ఓట్లువేసేవాళ్లు తక్కువ. ఈ కమ్యూనిటీని ఆ దిశగా చైతన్యవంతులను చేయడం ద్వారా, సామూహికంగా ఓటు వేసేలా ప్రోత్సహించడం ద్వారా ఓటు శాతం పెంచవచ్చు.

– అద్‌నాన్ కమర్, ముస్లిం నాయకుడు

వాళ్లనూ పట్టించుకోవాలి!



రిజర్వేషన్లు ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. సామాజిక న్యాయం ఎప్పటికంటే ఎక్కువగా ఉంది. అగ్ర కులాల మీద దూషణలు కూడా ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. జనరల్ కేటగిరీని దెబ్బ కొట్టేలా ఏ రాజకీయ పార్టీ బుజ్జగింపులూ ఉండకూడదు. వాళ్లు కష్టపడతారు. 50 శాతం కంటే ఎక్కువ పన్ను చెల్లిస్తారు. వాళ్లకు కూడా సమాన హక్కులు ఉండాలి.

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక కార్యకర్త

రక్తంలోకి ఇంకుతుందా?



చదవడంలో ఉండే విరోధాభాస: మనం ఏం చదివామో చాలావరకు మరిచిపోయినప్పటికీ, మనం చదివే పుస్తకాలు మనల్ని లోలోతుల నుంచి మార్చుతాయి.

– డేవిడ్ పెరెల్, రచయిత

ఉండాల్సిన నియంత్రణ



పిచ్చిగా కార్లు నడిపేవారి వల్ల, మన ఇంటి బయట కూర్చున్నా సురక్షితంగా ఉండేట్టు లేము. డిజైన్‌తో గానీ, బలవంతంగా గానీ వేగం మీద నియంత్రణ విధించాలి.

– కుమార్ మనీశ్, కంటెంట్ క్రియేటర్

ఇన్ బాక్స్

వారంతా కుక్కలూ, నక్కలా?

చాలా కాలం తర్వాత కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి పంటలు ఎండి కష్ట కాలంలో ఉన్న రైతాంగాన్ని పరామర్శించేందుకు జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు పర్యటించారు. ఈ పర్యటనలో ఒక సందర్భంలో పార్టీలు మారిన వారిని ఉద్దేశించి ‘కుక్కలూ, నక్కలూ పార్టీలు మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేద’నే మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. మరి ఇతర పార్టీల నాయకులను ఆయన తన పార్టీలో చేర్చుకున్న సంగతి ఆయనకు గుర్తు లేదా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో 63 ఎమ్మెల్యే స్థానాల్లో గెలిచి అప్పటి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆనాటి పరిస్థితుల్లో టీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదమేమీ లేకున్నా 15 స్థానాలు గెలిచిన టీడీపీని తెలంగాణలో లేకుండా చేయాలనే ఉద్దేశంతో 12 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో కలుపుకొన్నారు కేసీఆర్. అప్పటికి అన్ని విధాలుగా బీజేపీతో మిత్ర పక్షంగానే ఉంది టీఆర్ఎస్. 2018 ఎన్నికల్లో 88 స్థానాల్లో గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్ నుండి 12 మందిని కలుపుకొని ఒకరికి మంత్రి పదవి కూడా ఇచ్చారు టీఆర్ఎస్ అధినేత. మరి ఆనాడు టీఆర్ఎస్‌లో కలుపుకున్న ఇతర పార్టీల ఎమ్మెల్యేలంతా కుక్కలు నక్కలేనా? అత్యధిక మెజారిటీ స్థానాలు గెలిచినా, ఏడు ఎమ్మెల్యేల బలం ఉన్న ఎంఐఎమ్ మద్దతుగా నిలిచినా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఆకర్షించి తన పార్టీలో చేర్చుకోవలసిన అవసరం కేసీఆర్‌కు ఏమొచ్చింది? ఆనాడు తన పార్టీలోకి ఫిరాయించినవారు పులు కడిగిన ముత్యాలూ, ఈనాడు తన పార్టీ నుంచి వేరే పార్టీలకు ఫిరాయించినవారు కుక్కలూ, నక్కలూనా?


ఇప్పుడు బీఆర్ఎస్ రోజు రోజుకూ ఎందుకు బలహీనపడుతోంది? 150 ఏళ్ళ కిందటి కాంగ్రెస్ కాని, నూరేళ్ళ కింద ఏర్పడ్డ కమ్యూనిస్ట్ పార్టీ కాని, బీజేపీ పార్టీ కాని ఎందుకు ఇంకా ఉనికిలో ఉండి అధికారంలోకి రాగలుగుతున్నాయి. ఈ పార్టీలు అనేక త్యాగాలుచేసి, సిద్ధాంతాలతో ఒక ఫిలాసఫీ ప్రతిపాదికగా ఏర్పడ్డ పార్టీలు. కమ్యూనిస్ట్ పార్టీలో అధికారం కొరకు పార్టీలు మారింది బహు అరుదు. సిద్ధాంత విభేదాలతోనే ఆ పార్టీలు ముక్క చెక్కలయ్యాయి. ఇక బీజేపీ వారికి కూడా వారికి ఉండే సిద్ధాంతాలు వారికీ వున్నాయ్. అది ఆర్ఎస్ఎస్ భావజాలం పునాదిగా ఉన్న పార్టీ. ఒకప్పుడు 2 స్థానాలే పార్లమెంటులో వున్న ఆ పార్టీ ఇప్పుడు పూర్తి మెజారిటీతో దేశాన్ని పాలిస్తోంది. ఇక కాంగ్రెస్ కూడా లౌకిక పార్టీగా ఇంతకాలం మనగలుగుతోంది.

అయితే తెలంగాణ సాధన తమ పార్టీ ఒక్కదాని వల్లనే సాధ్యమయ్యిందనే అహంభావం కేసీఆర్‌కు ఉన్నట్లుంది. నిజాయితీ పరులనూ, ప్రశ్నించిన వారినీ దూరం చేసుకొని అవినీతి పరులనూ, అవకాశవాదులనూ, వ్యాపార వేత్తలనూ చేరదీసి ఎమ్మెల్యేలూ, ఎంపీలుగా చేశారు. అటువంటివారు అధికారం, డబ్బు ఎక్కడుంటే అక్కడికే పోతారు. కనీసం ఎమ్మెల్యేలు, మంత్రుల వంటి వారికి కూడా ముఖ్యమంత్రి అందుబాటులో లేకుండా, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలనచేస్తే ఆయన అన్నట్లు ‘కుక్కలూ, నక్కలూ’ పుట్టుకొస్తయి మరి!

– డా॥ కె. సుధాకర్ రెడ్డి । రిటైర్డ్ లెక్చరర్

శిలాజ ఇంధనాలకు రాయితీలు తగ్గితేనే...

విశ్లేషణ




డా॥ దొంతి నరసింహా రెడ్డి

శిలాజ ఇంధనాల వినియోగం నానాటికీ పెరుగుతున్నందు వల్ల కాలుష్యం మరింత పెరుగుతోంది. అందుకే ప్రపంచ దేశాలు ఆ ఇంధనాలపై ఇస్తున్న సబ్సిడీలను తగ్గించాలని వివిధ అంతర్జాతీయ సంస్థలూ, సదస్సులూ దశాబ్దాలుగా పిలుపునిచ్చాయి. ఉదాహరణకు కాప్–21 సదస్సులో 40 కంటే ఎక్కువ దేశాలు శిలాజ ఇంధన సబ్సిడీలను తొలగించడానికి ఒక ఉమ్మడి ప్రకటన చేశాయి. అయినా కూడా పారిశ్రామిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు శిలాజ ఇంధనాల ఉత్పత్తి, వినియోగానికి బడ్జెట్ బదిలీలు, పన్ను మినహాయింపులు, ఆర్థిక హామీలు అందజేస్తూనే ఉన్నాయి. ఈ సబ్సిడీల వలన వాతావరణానికి ప్రాథమికంగా హాని చేస్తున్న శిలాజ ఇంధనాల ఉపయోగం పెరుగుతూనే ఉన్నది. అభివృద్ధి చెందిన దేశాల నుంచి తగిన చర్యలు లేకపోవడంతో వర్ధమాన దేశాలు కూడా ముందడుగు వేయడానికి సిద్ధంగా లేవు.

2023లో భారతదేశంలో మొత్తం ఇంధన సబ్సిడీలు రూ. 3.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ‘ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్’ చేసిన కొత్త పరిశోధన ప్రకారం ఇవి గత తొమ్మిదేళ్లలో గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. దేశంలో ఇంధన వనరుల డిమాండ్ పెరగడంతో పాటు, 2022లో ప్రపంచ ఇంధన సంక్షోభం నేపథ్యంలో, ప్రభుత్వం 2023లో అన్ని రకాల ఇంధన వనరుల లభ్యతను విస్తరిస్తూ హైబ్రిడ్ విధానాన్ని అవలంబించింది.

పెరుగుతున్న ఇంధన వినియోగం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తరువాత అంతర్జాతీయ ఇంధన ధరల సంక్షోభం ప్రభావం, అనేక దేశాలు అనుకున్న లక్ష్యాలకు వ్యతిరేకంగా శిలాజ ఇంధనాలకు మద్దతును గణనీయంగా పెంచాయి. భారతదేశం కూడా ఈ దిశగానే అనేక చర్యలు అమలులోకి తెచ్చింది. 2022–2023లో గరిష్ఠ స్థాయికి చేరుకున్న శిలాజ ఇంధన ధరల ప్రభావం నుంచి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవడానికి భారత ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ రిటైల్ ధరలను పరిమితం చేసింది. పన్నులను తగ్గించింది. వ్యాపారులు, వినియోగదారులకు ప్రత్యక్ష నగదు బదిలీలు చేసింది. ఆయా చర్యల ఫలితంగా చమురు, గ్యాస్ సబ్సిడీలు 2022తో పోలిస్తే 2023లో 63 శాతం పెరిగాయి. అయితే, 2023లో మొత్తం ఇంధన సబ్సిడీలలో బొగ్గు, చమురు, గ్యాస్ సబ్సిడీలు దాదాపు 40 శాతం కాగా, కాలుష్య రహిత ఇంధన వనరుల (క్లీన్ ఎనర్జీ)కు సబ్సిడీలు 10 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. మిగిలిన సబ్సిడీలలో ఎక్కువ భాగం విద్యుత్ వినియోగానికీ, ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించినవీ ఉన్నాయి. ఇదే కాలంలో బొగ్గు సబ్సిడీలు కూడా 17 శాతం పెరిగాయి. మొత్తంగా క్లీన్ ఎనర్జీ సబ్సిడీల కంటే శిలాజ ఇంధన సబ్సిడీలు ఐదు రెట్లు ఎక్కువ.



కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రభుత్వ ఆధీనంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రత్యక్ష బడ్జెట్ బదిలీల ద్వారా చమురు, గ్యాస్ రంగానికి గణనీయమైన మద్దతును అందించింది. ఈ కాలంలో, మొత్తం చమురు – గ్యాస్ సబ్సిడీలు కనీసం రూ.70,692 కోట్లకు పెరిగాయి. ఇటీవల కాలంలో ప్రభుత్వ సబ్సిడీల కారణంగా వరి, గోధుమలు, మక్కలు, చెరుకు వంటి ఆహార సంబంధిత ఉత్పత్తుల నుంచి ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి చాలా మంది మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు ఆహార భద్రత సాధించటానికీ, ఆకలి తగ్గించడానికీ వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం... ఇంకొక వైపు సబ్సిడీలు ఇచ్చి అదే ఆహార పంటలను ఇతరత్రా ఉపయోగాలకు మళ్ళిస్తోంది. ఇందువల్ల కలిగే దీర్ఘకాలిక దుష్ప్రభావం ఊహించలేని విధంగా ఉండవచ్చు.

2020 ఆర్థిక సంవత్సరంలో, కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి మొత్తం ఇంధన ఆదాయం రూ. 6,99,565 కోట్లుగా అంచనా. ఇది మొత్తం ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 17 శాతం. ఇంధన వనరుల నుంచి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం (83 శాతం) చమురు, గ్యాస్ నుండి వస్తోంది. పునరుత్పాదక ఇంధనం నుంచి 1 శాతం కంటే తక్కువే వస్తోంది. ఈ ఆదాయం కూడా ఎక్కువగా కేవలం రెండు పన్నుల నుండి వస్తోంది: కేంద్ర ఇంధన ఎక్సైజ్, రాష్ట్ర స్థాయి వ్యాట్. శిలాజ ఇంధన శక్తి వనరుల వల్ల ఆదాయం 2030 నాటికి అదనంగా రూ. 30 వేల కోట్ల నుంచి రూ. 3,40,000 కోట్లకు పెరగవచ్చు అని అంచనా వేస్తున్నారు. ఈ ఆదాయం కోల్పోవటానికి ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. క్రమంగా ఈ ఆదాయం మీద ఆధార పడటం తగ్గించడానికి కూడా సుముఖంగా లేవు.

అయితే శిలాజ ఇంధనాల వల్ల ఆదాయం మాత్రమే కాదు భారం కూడా ఉంటుంది. ఇంధనాల ధరలో ప్రతిబింబించని ఖర్చుల భారం చాల ఎక్కువ. ఒక అంచనా ప్రకారం ఈ భారం ప్రభుత్వ ఆదాయానికి ఐదు రెట్లు ఎక్కువ. ఈ భారం రకరకాలుగా ఉంటుంది. ప్రధానంగా నీరు, గాలి, ఇతర ప్రకృతి వనరుల కాలుష్యం వల్ల కలిగే మరణాలు, అనారోగ్య సమస్యలు, వాటిని అధిగమించడానికి కల్పించవలసిన మౌలిక సదుపాయాల రూపంలో ఈ భారాన్ని చూడవచ్చు.

అందుకే కాలుష్య రహిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) ఉత్పత్తులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని అనేక అంతర్జాతీయ సంస్థలు అంటున్నాయి. ప్రపంచ వాతావరణ సదస్సులలో కాలుష్య రహిత ఇంధనాల వైపు ఉత్పత్తి, వినియోగ రంగాలు మారాలని ఎప్పటి నుంచో ఒత్తిడి ఉంది. ‘గ్లాస్గో కాప్ 26’ సదస్సులో బొగ్గు ఆధారిత విద్యుత్, ఇతర ఇంధన ఉపయోగాలను క్రమంగా తగ్గించాలని పెట్టిన ముసాయిదా తీర్మానాన్ని భారత ప్రభుత్వం వ్యతిరేకించింది. కేవలం బొగ్గు కాకుండా అన్ని రకాల శిలాజ ఇంధనాల ఉపయోగం క్రమంగా తగ్గించాలని వాదించింది. దుబాయి కాప్ 28 సదస్సులో ఈ దిశగా అన్ని రకాల శిలాజ ఇంధనాలను దశలవారీగా తగ్గించాలనే తీర్మానం దాదాపు ఖరారు అయినా సర్వామోదం పొందలేదు.

పెరుగుతున్న కర్బన కాలుష్యం కారణంగా భూమి ఉష్ణోగ్రతలు పెరిగి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదకర శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా వాటికి రాయితీలు తగ్గించాలి. అది సాధ్యం కావాలంటే సమూల ఆర్థిక పరివర్తనం అవసరం. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. క్లీన్ ఎనర్జీ అందుబాటులోకి వస్తే ఆర్థిక వృద్ధి సుస్థిరం అవుతుంది. శిలాజ ఇంధన దిగుమతుల మీద ఆధారపడిన ఆర్థిక అభివృద్ధి సుస్థిరం ఎప్పటికీ కాలేదు. ప్రకృతిని కలుషితం చేస్తూ అభివృద్ధి దిశగా పయనించడం దుర్భరంగా ఉంటుంది. అందుకే కర్బన కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా అవసరమైన వాతావరణ లక్ష్యాలను చేరుకోవడం కోసం ఒక ఆచరణాత్మక దృష్టి అవసరం. ప్రభుత్వం శిలాజ ఇంధన పన్ను ఆదాయంలో కొంత భాగాన్ని కొత్త కాలుష్య రహిత శక్తి వనరుల వైపు మళ్ళించాలి. సుస్థిర అభివృద్ధికీ, సమాన ఫలాలు అందరికీ అందించే ఆర్థిక వ్యవస్థకూ ఇంధనాల కూర్పు చాల కీలకం.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.నవమి ప.1.53 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.42 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.31 నుండి 10.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.27 వరకు, **అమృత ఘడియలు:** ప.11.31 నుండి 1.04 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.58, **సూర్యాస్తమయం:** 6.09.

పెన్షన్లు ఆపింది చంద్రబాబే

వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచీ అక్కసే • మదనపల్లె సభలో సీఎం వైఎస్ జగన్

- ఆయన మనిషి నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించారు
- ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వకుండా ఈసీ ద్వారా ఆదేశాలిప్పించారు
- 99 శాతం మార్కులొచ్చే స్టూడెంట్‌కు పరీక్షలంటే భయం ఉండదు
- 10 శాతం మార్కులు సాధించిన టీడీపీకి భయం కాబట్టే అన్ని పార్టీలతో కలిసింది
- జెండాలు జత కట్టిన ఈ తోడేళ్ల మాటలు నమ్మొద్దు
- చంద్రబాబుకు ఓటేస్తే మోసకారికి వేసినట్టే.. పేదల సంక్షేమ వ్యతిరేకికి ఓటేసినట్టే.. ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లే...
- ఈ విషయాన్ని ప్రతి ఇంటికి చెప్పండి




సీఎం జగన్ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్లను ఆన్ చేసి మేమంతా సిద్ధం అని నినదిస్తున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కడప: 'చంద్రబాబుకు పేదలంటే గిట్టదు. వారికి మేలు చేస్తున్న మన వలంటీర్ల వ్యవస్థ అంటే అసలే గిట్టదు. మొదటి నుంచీ ఈ వ్యవస్థపై ఏడుపే. ఈ ఏడుపులో భాగంగా మూడు రోజుల క్రితం ఏం జరిగిందో మీరందరూ చూశారు. లక్షల మంది అవ్వాతాతలకు, వికలాంగులకు, వితంతు అక్కచెల్లెమ్మలకు, ఇంకా తమను తాము పోషించుకోలేని అభాగ్యుల ఇంటికి వలంటీర్లు వెళ్లి పింఛన్ ఇవ్వడాన్ని అడ్డుకున్నారు. ఈ పెన్షన్ డబ్బులు అందితే తప్ప జీవితాలు గడవని వారికి నెల నెలా 1వ తారీఖున ఇంటికే వచ్చి, సూర్యోదయానికంటే మునుపే చిక్కటి చిరునవ్వులతో పెన్షన్ ఇచ్చిపోతున్న వలంటీర్లపై తన మనిషి నిమ్మగడ్డ రమేష్ చేత ఫిర్యాదు చేయించాడు. వారు ఏప్రిల్ 1వ తారీఖు నుంచి పెన్షన్ ఇవ్వటానికి వీల్లేదని ఎన్నికల కమిషన్ ద్వారా ఆదేశాలు ఇప్పించారు. జగన్‌ను నేరుగా దెబ్బ కొట్టలేక ముసలి వాళ్లపై కక్ష తీర్చుకుంటున్నారు. ఇలాంటి మనిషిని ఏమనాలి?'అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. 'మేమంతా సిద్ధం'బస్సు యాత్రలో భాగంగా 6వ రోజు మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నడవలేని వయసులో ఉన్న అవ్వాతాతలు, వికలాంగులకు తోడుగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను ప్రశంసించాల్సింది పోయి.. ఏకంగా ఆ వ్యవస్థను రద్దు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి పెత్తందార్లకు, ఇలాంటి పేదల వ్యతిరేకులకు పొరపాటున ఓటు వేస్తే.. తమ పెన్షన్లు, తమకు అందే స్కీములు, ఇంటింటికీ వచ్చి సేవలందించే వలంటీర్ వ్యవస్థను రద్దు చేసేందుకు మనమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లవుతుందని ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మెరిట్ విద్యార్థి పరీక్షలకు భయపడతాడా?

• ఇవాళ ఎన్నికలు వస్తున్నాయంటే ప్రతిపక్షంలో ఉన్న వారంతా విడివిడిగా రాలేకపోతున్నారు. ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఏ ఒక్కరికీ లేదు. అధికారం కోసం గుంపులుగా, తోడేళ్లుగా జెండాలు జత కట్టి.. అబద్ధాలతో వస్తున్నారు. ఇంత మంచి జరిగింది కాబట్టే మీ జగన్ ప్రజల గుండెల్లో గుడి కట్టాడు. అందుకే ఈరోజున ఒక్కడి మీద ఇంత మంది దాడి చేస్తున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు, ఒక దత్తపుత్రుడు, ఒక బీజేపీ, ఒక కాంగ్రెస్.. వీళ్లందరూ కుట్రలు, కుతంత్రాలతో ఏకమవుతున్నారు.

• ఇంత మంది జతకట్టి వచ్చినా వాళ్లందరికీ తెలియని విషయం ఒకటి ఉంది. 99 మార్కులు తెచ్చుకున్న మెరిట్ స్టూడెంట్ పరీక్షలకు భయపడతాడా? అటు వైపు గతంలో వాళ్ల పరీక్షలు రాసినప్పుడు 10 మార్కులు కూడా తెచ్చుకోని స్టూడెంట్.. పరీక్ష పాసవుతాడా? ఎన్నికల మేనిఫెస్టోను ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావిస్తూ ఏకంగా 99 శాతం వాగ్దానాలు నెరవేర్చిన మన విశ్వసనీయత ముందు 10 శాతం వాగ్దానాలు కూడా తన హయాంలో నెరవేర్చకుండా మోసం చేసిన చంద్రబాబు, ఆయన కూటమి నిలబడగలుగుతుందా?

• విలువలు, విశ్వసనీయత లేని ఇలాంటి వారితో 30 పార్టీలు కలిసి వచ్చినా మన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, పేద వర్గాలు భయపడరు. పైగా పెత్తందారులతో సమరానికి మేమంతా సిద్ధం.. అని చెబుతున్నారు.

• '175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. డబుల్ సెంచరీ కొట్టేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమేనా.. మళ్లీ మనందరి ప్రభుత్వమే ఉండాలన్న ఆకాంక్షతో పేదల వ్యతిరేకులను, పెత్తందార్లను ప్రతిపక్ష కూటమిని ఓడించాలన్న సంకల్పంతో తరలి వచ్చిన సమరయోధుల సముద్రంలా మదనపల్లె కనిపిస్తోంది.

పేదల రక్తం పీల్చే పసుపుపతి చంద్రబాబు

• మోసాలే అలవాటుగా, అబద్ధాలే పునాదులుగా చేసుకున్న ఓ జిత్తుల మారి పొత్తుల ముఠాతో యుద్ధం చేస్తున్నాం. ఆ ముఠా నాయకుడు నారా చంద్రబాబునాయుడు. నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతున్న ఈ పసుపుపతి 2014లోనూ ఇదే మాదిరి పొత్తులు పెట్టుకున్నాడు. ఈ మూడు పార్టీలూ కలిసి ఇంటింటికీ ముఖ్యమైన హామీలు అంటూ పాంప్లెట్ పంపించారు.

• ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లో అడ్వర్‌టైజ్‌మెంట్లతో హోరెత్తించారు. రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా? ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు.

> అరుంధతి సినిమాలో సమాధి నుంచి లేచి వచ్చే పశుపతి లాగా అధికారం కోసం ఐదేళ్ల తర్వాత పసుపుపతి చంద్రబాబు వస్తున్నాడు. వదల బొమ్మాళి వదలా.. అంటూ పేదల రక్తం పీల్చేందుకు వస్తున్నాడు. కుర్చీ కోసం ఈ పసుపుపతి నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతాడు. పొరపాటున నమ్మారంటే సంక్షేమాభివృద్ధికి వ్యతిరేకంగా ఓటేసినట్లే. ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లే. కుట్రలు, కుతంత్రాలతో జెండాలతో జత కట్టిన తోడేళ్లు ఒక్కటై వస్తున్నాయి. మోసపోకూడదని ఇంటింటా చెప్పాలి.
> గత ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసిన వారికి కూడా మన ప్రభుత్వం మంచి చేసింది. ఏం మంచి చేశామో వాళ్లకు చూపించి, వారి మనసు తట్టి, వారి గుండెను గెలిచి, ఫ్యానుకు ఓటు వేస్తేనే.. మళ్లీ జగన్ సీఎంగా ఉంటేనే ఈ మంచి కొనసాగుతుందని చెప్పే నైతికత మనకు మాత్రమే ఉంది. మన అక్కచెల్లెమ్మలను ఈ ఐదేళ్ల మాదిరిగానే వచ్చే ఐదేళ్లు కూడా ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికే మళ్లీ మనందరి ప్రభుత్వం రావాలి. కుటుంబానికి ఆ అక్కచెల్లెమ్మలను బలమైన శక్తిగా నిలబెట్టే ప్రక్రియ కొనసాగించాలనే లక్ష్యంతోనే మళ్లీ అధికారం అడుగుతున్నాం.
> - సీఎం వైఎస్ జగన్

నిజమైన సామాజిక న్యాయానికి జైకొడదాం

• నిజమైన సామాజిక న్యాయానికి జై కొట్టండి. రాబోయే రోజుల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగబోయే ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో జరగబోయేదేమిటో తెలుసా? ప్రజలకు మంచి చేసిన ఫ్యాను.. మీ ఇంట్లోనే ఉంటుంది. అంటే అధికారంలోనే ఉంటుంది. ప్రజలను పదే పదే మోసం చేసిన సైకిల్ ఇంటి బయటే ఉంటుంది. బాబు ప్యాకేజీని గటగటా తాగేసి తన వారిని తాకట్టుపెట్టిన గ్లాసు సింక్‌లోనే ఉంటుంది. ఇది ప్రజల మాట.

• ఆ పొత్తుల, ఎత్తుల, జిత్తుల ముఠా ఎన్ని చేసినా, ఏమిచెప్పినా ఎంత ప్రయత్నించినా మన ప్రజలకు మనం చెప్పాల్సింది ఒక్కటే. మనం వేసే ఈ ఓటు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు మాత్రమే కాదు. మన భవిష్యత్తు, మన తల రాతలు ఈ ఓటు మీద ఆధారపడి ఉన్నాయని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. మళ్లీ అన్నను తెచ్చుకుందాం.. అన్నే రావాలి. ఈ ఐదేళ్లుగా జరిగిన మంచిని కొనసాగించేందుకు, పేదవాడి భవిష్యత్ బాగు పడటానికి, మనందరి ప్రభుత్వానికి తోడుగా నిలబడటానికి, మళ్లీ అన్నే రావాలని ప్రతి ఒక్కరికీ, ప్రతి గడపకూ వెళ్లి చెప్పండి.

చంద్రబాబు ఏ స్థాయికి దిగజారిపోయాడో ఆలోచించండి

- దత్తపుత్రుడు, మోదీతో కలిసి మరో డ్రామా
- ఎక్స్ లో సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: చంద్రబాబు డ్రామాలు.. దిగజారుడుతనంపై ప్రజలు ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారు. "2014లో చంద్రబాబు సంతకం చేసి ఇంటింటికీ పంపిన మేనిఫెస్టోలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కానీ ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు రంగు రంగుల మేనిఫెస్టోతో దత్తపుత్రుడు, మోదీ గారితో కలిసి చంద్రబాబు మరో డ్రామాకి తెరదీస్తున్నాడు" అని ఎక్స్ వేదికగా సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. అదే ఎక్స్ లో మరో ట్వీట్ చేసిన జగన్.. "లక్షల మంది అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకి ప్రతి నెలా ఒకటో తారీఖున చేతికి పెన్షన్ ఇచ్చే వలంటీర్లు.. ఏప్రిల్ 1 నుంచి ఇవ్వడానికి వీల్లేదని చంద్రబాబు ఆయన మనుషుల చేత ఈసీకి ఫిర్యాదు చేయించి ఆదేశాలిప్పించాడు. చంద్రబాబు ఏ స్థాయికి దిగజారిపోయాడో ఆలోచించండి"అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కడప ఎంపీగా పోటీచేస్తున్నా

- ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల వెల్లడి



వేంపల్లె/సాక్షి, న్యూఢిల్లీ/కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వైఎస్సార్ జిల్లా కడప లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తాను పోటీచేస్తున్నట్లు పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు. ఈ నిర్ణయం తనకు సులువైంది కాదని, ఇది తమ కుటుంబాన్ని చీలుస్తుందని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయమన్నారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఐదు పార్లమెంటు, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు షర్మిల వెల్లడించారు. 'జగన్‌మోహన్‌రెడ్డి నా అన్న.. అన్న అంటే నాకు ద్వేషం లేదు' అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విభజన హామీలు నెరవేరాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అనంతరం.. షర్మిల గెలుపొందేలా కడప పార్లమెంటు ప్రజలందరూ ఆమెను ఆశీర్వదించాలని తల్లి వైఎస్ విజయమ్మ కోరారు. వైఎస్సార్ ఘాట్ వద్ద పార్టీ నేతలతో కలిసి షర్మిల, విజయమ్మ వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

ఐదు లోక్‌సభ అభ్యర్థులు వీరే..

కాంగ్రెస్ విడుదల చేసిన లోక్‌సభ నియోజకవర్గాల తొలి జాబితాలో కడప నుంచి షర్మిల, రాజమండ్రి గిడుగు రుద్రరాజు, కాకినాడ పళ్లంరాజు, బాపట్ల జేడీ శీలం, కర్నూలు నుంచి రామ్‌పుల్లయ్య యాదవ్ పోటీచేయనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, 114 మందితో అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాను వెల్లడించారు.

రాష్ట్రీయం

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మంత్రి శ్రీధర్‌బాబుకు రాములునాయక్, జనక్‌ప్రసాద్ వినతి



సాక్షి, హైదరాబాద్: ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని భిక్షపతి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ట్రేడ్ యూనియన్ లీడర్ జనక్ ప్రసాద్ మంగళవారం గాంధీభవన్‌లో కలిశారు. కార్మికుల సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 73 రంగాల్లోని 1 కోటి 7 లక్షల మంది కార్మికుల కనీస వేతనాలపై 12 ఏళ్లుగా రివిజన్ చేయలేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నిత్యావసరాల ధరలు 200 శాతం పెరిగాయని, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు 150 శాతం పెరిగాయని తెలిపారు. కార్మికుల జీతాల్లో మాత్రం పెరుగుదల లేక కొనుగోలు శక్తి తగ్గి కుటుంబాలను పోషించుకోలేక అప్పులపాలై దుర్భరమైన స్థితిలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన మంత్రి తమ ప్రభుత్వం కార్మిక శ్రేయస్సుకు కృషి చేస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఏఎస్ఆర్టీయూ స్టాండింగ్ కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్(ఏఎస్ఆర్టీయూ) ఆధ్వర్యంలో 210వ ప్రైస్ రివిజన్ సబ్ కమిటీ సమావేశం మంగళవారం బస్ భవన్‌లో జరిగింది. ఏఎస్ఆర్టీయూ స్టాండింగ్ కమిటీ (స్టోర్స్ అండ్ కాంట్రాక్ట్స్) చైర్మన్, టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 18 రాష్ట్రాల ఆర్టీసీలకు చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బస్సుల విడిభాగాలకు చెందిన 15 గ్రూప్‌లకు సంబంధించిన ధరలను ఇందులో నిర్ధారించారు. ఏఎస్ఆర్టీయూ నిర్ధారించి సిఫారసు చేసిన రేట్ కాంట్రాక్ట్ ప్రకారం ఏకరీతి ధరలకు కొనుగోలు చేస్తే తక్కువ ధరకే నాణ్యమైన విడి భాగాలు లభిస్తాయని ఏఎస్ఆర్టీయూ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సజ్జనార్ తెలిపారు. సమావేశంలో ఏఎస్ఆర్టీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యకిరణ్, డైరెక్టర్ ఆర్‌ఆర్‌కే కిశోర్, టీఎస్ఆర్టీసీ సీఎంఈ రఘునాథరావుతో పాటు 18 రాష్ట్రాల ఆర్టీసీలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో కన్నారావు అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టుకోవడంతో ఇదేమిటని సురేందర్‌రెడ్డి కన్నారావును ప్రశ్నించాడు. దీంతో మార్చి 3న కన్నారావు మనుషులు వచ్చి ఆ భూమిని కబ్జా చేసి అందులోని సామగ్రి ధ్వంసం చేశారు. దీనిపై అదే రోజు ఆదిబట్ల పోలీసులకు ఓఎస్‌ఆర్ కంపెనీ యజమాని ఫిర్యాదు చేయడంతో కన్నారావుతోపాటు 38 మందిపై కేసులు నమోదయ్యాయి. వారిలో పది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బెయిల్‌కు ప్రయత్నిస్తూ పట్టుబడి..

తనపై కేసు నమోదైనప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా బెంగళూరు, ఢిల్లీలో తలదాచుకున్న కన్నారావు.. తనపై కేసును తొలగించాలంటూ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను కోర్టు కొట్టేయడంతో బెయిల్ కోసం మరో పిటిషన్ వేశాడు. దాన్ని కూడా న్యాయస్థానం కొట్టేయడంతో హైదరాబాద్ మాదాపూర్‌లోని తన అడ్వకేట్‌ను కలవడానికి కన్నారావు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి 12:30 గంటలకు బాలాపూర్‌లో ఆదిబట్ల పోలీసులకు కన్నారావు పట్టుబడ్డాడు. దీంతో అతన్ని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఆయన ఏ3గా ఉన్నాడు. కన్నారావుపై 307, 436, 447, 427, 148 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వైద్య పరీక్షల అనంతరం ఇబ్రహీంపట్నం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ను చర్లపల్లి జైలుకు తరలించారు.

నేనే ఫోన్ చేసి లొంగిపోయా: కన్నారావు

ఇది ఒక భూ వివాద సమస్య. ఇందులో కొద్దిగా నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టారు. ఈ సెక్షన్లకు ముందస్తు బెయిల్ లభించనందున ఆదిబట్ల ఎస్సై రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డికి ఫోన్ చేసి ఫలానా చోట ఉన్నానని చెప్పి సరెండర్ అయ్యాను. నాకు కచ్చితంగా బెయిల్ వస్తుంది. ఈ కేసును సుప్రీంకోర్టు కొట్టేస్తుంది.

వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ఆపింది మేమే

రాజమహేంద్రవరం టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు కీలక వ్యాఖ్యలు



రాజమహేంద్రవరం సిటీ: అవ్వాతాతలకు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నది తామేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ–జనసేన–బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తే వారు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తారని, అదే జరిగితే తాము అడ్డుకుంటామని, దీనివలన శాంతిభద్రతల సమస్య తలెత్తుందంటూ తమ పార్టీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి రిటర్నింగ్ అధికారికి చెప్పారని, డీఎస్పీ కూడా అది వాస్తవమని అన్నారని వాసు తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం రిటర్నింగ్ అధికారికి లేనందున ఈ విషయాన్ని తమ అధినేత చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకుని వెళ్లానని ఆయన చెప్పారు. అందువల్లే ఎన్నికల కోడ్ ముగిసే వరకూ వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయొద్దంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు.

పేదలపై పంతం..

ఐదేళ్లుగా ఇంటి వద్దే అందుతున్న సంక్షేమ పథకాలపై పెత్తందారుల అక్కసు
వలంటీర్ వ్యవస్థపై తొలి నుంచీ విషం కక్కిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

- గోనె సంచులు మోసే ఉద్యోగాలంటూ తూలనాడిన చంద్రబాబు
- ఇంట్లో మగాళ్లు లేనప్పుడు తలుపులు తడుతున్నారంటూ నీచమైన వ్యాఖ్యలు
- వలంటీర్లు సంఘ విద్రోహ శక్తులంటూ పవన్ విద్వేష ప్రసంగాలు
- తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామంటూ హూంకరింపులు
- ఎన్నికల వేళ కుట్రపూరితంగా వలంటీర్ల సేవలను అడ్డుకున్న వైనం
- లక్షలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై తీవ్ర ప్రభావం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'గురివింద' బండారం బట్టబయలు

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. ఏపీ31సీజే 7825 నంబరు స్కూటీపై ఇద్దరు వ్యక్తులు సూట్‌కేస్‌తో వెళుతుండగా పోలీసులు వారిని ఆపారు. వారి వద్ద ఉన్న సూట్‌కేసును తనిఖీ చేయగా అందులో రూ.500 నోట్ల కట్టలు, చెక్కులు కనిపించాయి. వాటిని లెక్కించగా రూ.51,99,800 నగదు ఉన్నట్లు తేలింది. రూ.36,88,675 విలువైన 51 చెక్కులను గుర్తించారు. ఆ డబ్బు ఎవరిదని, ఎక్కడకు తీసుకువెళుతున్నారని పోలీసులు ప్రశ్నించారు. ఇందుకు వారు పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఆ డబ్బు మార్గదర్శి చిట్స్‌కు సంబంధించినదని, ఎవరికీ ఇవ్వడానికి కాదని, బ్యాంకులో డిపాజిట్ చేయడానికి తీసుకెళుతున్నట్లు బుకాయించే ప్రయత్నం చేశారు. పోలీసులు ఆధారాలు చూపించాలని అడిగినప్పటికీ వారు చూపించలేదు. దీంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించారు. అందులో ఒకరు లక్ష్మణరావు మార్గదర్శి చిట్స్‌లో అకౌంట్స్ అసిస్టెంట్‌గా, మరొకరు శ్రీనివాస్ ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. వారు ఆ డబ్బుకు ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో పోలీసులు నగదు, చెక్కులను ఎన్నికల అధికారులకు అందజేశారు. వారు ఆదాయ పన్ను శాఖ అధికారులకు అందజేశారు.

గత ఎన్నికల్లోనూ ఇదే విధంగా తరలింపు!

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెద్ద మొత్తంలో నగదు తరలిస్తే అందుకు ఆధారాలు ఉండాలి. ఈ విషయం పత్రికాధిపతి రామోజీకి చెందిన సంస్థకు తెలియనిది కాదు. అయినా మార్గదర్శి ద్వారా లక్షలాది రూపాయలు ఎటువంటి ఆధారాలు లేకుండా తరలించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. తెలుగుదేశం పార్టీ నేతలకు డబ్బు చేరవేసేందుకే ఈ నగదును తీసుకువెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో టీడీపీ అభ్యర్థులకు డబ్బు చేరవేస్తున్నట్లు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కూడా విశాఖలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిల నుంచి భారీ స్థాయిలో నగదు పంపిణీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే భీమిలిలో ఉన్న ప్రైవేటు పరిశ్రమ నుంచి టీడీపీ నేతలకు రూ.కోట్లు ముట్టినట్లు వార్తలు వినిపించాయి. వాస్తవానికి మార్గదర్శి, ఆ పరిశ్రమ సిబ్బంది చేతుల మీదుగానే రూ.కోట్ల డబ్బు పంపిణీ జరిగిందన్నది బహిరంగ రహస్యమే. ఈ ఎన్నికల్లోనూ అదే పంథాలో డబ్బు పంపిణీకి పూనుకున్నట్లు ఈ వ్యవహారంతో తేటతెల్లమైంది.



ద్వారకానగర్‌లో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన డబ్బు

డిజిటల్ చెల్లింపులేవి రామోజీ!

2022 డిసెంబర్ నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు వేయడంలేదు. పాత చిట్టీలే కొనసాగుతున్నాయి. కాలపరిమితి ముగియడంతో చిట్టీలు మూసివేస్తున్నారు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిల్లో చిట్టీ గ్రూపుల సంఖ్య సగానికంటే తగ్గిపోయింది. అయినప్పటికీ విశాఖపట్నం బ్రాంచిలో ఖాతాదారుల నుంచి మూడు రోజుల్లోనే రూ.51 లక్షలు నగదు రూపంలో వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఆ ప్రకారం నెలకు రూ.5.10 కోట్లు వసూలు చేస్తున్నట్టు. ఇక రాష్ట్రంలోని 37 బ్రాంచిల ద్వారా నెలకు సగటున రూ.188.70 కోట్లు వసూలు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదంతా నగదు రూపంలోనే వసూలు చేస్తున్నట్లు కూడా స్పష్టమవుతోంది. ప్రస్తుతం కిళ్లీ దుకాణాలు, బజ్జీ దుకాణాల్లో కూడా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు కాబట్టి నగదు లావాదేవీలు జరపకూడదని రామోజీరావే ఈనాడు పత్రికలో పదే పదే వార్తలు రాయిస్తున్నారు. కానీ ఆయన మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ద్వారా భారీగా నగదు లావాదేవీలే నిర్వహిస్తుండటం గమనార్హం. చందాదారుల నుంచి డిజిటల్ / ఆన్‌లైన్ చెల్లింపులు ఎందుకు స్వీకరించడం లేదు? నగదు రూపంలోనే ఎందుకు తీసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. మార్గదర్శి పేరుతో ఎన్నికల్లో టీడీపీకి డబ్బు తరలింపు, భారీగా నల్లధనం చలామణిలోకి తేవడమే లక్ష్యంగా ఈ దందా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

పక్కా మనీలాండరింగే..

విశాఖలో అక్రమంగా తరలిస్తున్న డబ్బు పట్టుబడటంతో రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో భారీగా నల్లధనం దందా మరోసారి ఆధారాలతోసహా వెలుగులోకి వచ్చింది. ఈ డబ్బు ఎక్కడిదని మార్గదర్శి సిబ్బందిని పోలీసులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకునేందుకు యత్నించారు. చివరగా గత మూడు రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో చందాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కానీ ఆ నగదు, చెక్కులకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలీసులు వాటిని జప్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మనీ లాండరింగ్‌కు పాల్పడుతోందని గతంలో స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో వెల్లడైన విషయం వాస్తవమేనని ఈ ఘటన మరోసారి రుజువుచేసింది. చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం ఒక బ్రాంచిలో వసూలు చేసే మొత్తాన్ని అదే బ్రాంచి పరిధిలో బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ఇతర బ్యాంకుల్లోని ఖాతాల్లోకి మళ్లించకూడదు. రామోజీరావు ఈ నిబంధనలను ఏనాడూ పట్టించుకోలేదు. మార్గదర్శి చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయం ఖాతాకు మళ్లిస్తూ వచ్చారు. అదే రీతిలో చందాదారుల సొమ్మును సోమవారం విశాఖలో ఇతరత్రా అవసరాలకు మళ్లిస్తూ పోలీసులకు పోలీసులకు చిక్కినట్లు స్పష్టమైంది.

యూటీలు ఎటో?

2019లో బీజేపీదే హవా | 12 సీట్లలో ఐదింట గెలుపు | ఈసారి 8 ఖాయం: సర్వేలు

కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీ) మొదటి నుంచీ జాతీయ పార్టీలదే ఆధిపత్యం! గత ఎన్నికల్లో యూటీల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న బీజేపీ ఈసారి మరిన్ని సీట్లపై కన్నేయగా, వాటిల్లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది...



2019 లోక్‌సభ ఎన్నికల్లో యూటీలను బీజేపీ కొల్లగొట్టింది. ఢిల్లీలో మొత్తం 7 సీట్లనూ చేజిక్కించుకుంది. జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌ల్లో 3 సీట్లు నెగ్గింది. చండీగఢ్ ఎంపీ సీటును కాషాయ పార్టీ తరఫున ప్రముఖ నటి కిరణ్ అనుపమ్ ఖేర్ వరుసగా రెండోసారి గెలిచారు. అంతక్రితం ఈ సీటు కాంగ్రెస్ గుప్పిట్లో ఉండేది. డామన్ దయ్యు స్థానమూ బీజేపీ హస్తగతమైంది. 1987లో ఏర్పాటైన ఈ యూటీలో కాంగ్రెస్ 5 సార్లు, బీజేపీ 6 సార్లు నెగ్గాయి. అయితే 2009 నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. అండమాన్ నికోబార్‌లో మాత్రం బీజేపీ సీటును కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది! 2009, 2014ల్లో బీజేపీ గెలిచిన ఈ స్థానం 2019లో కాంగ్రెస్ పరమైంది. దాద్రానగర్ హవేలీ సీటును 2021 ఉప ఎన్నికల్లో శివసేన గెలుచుకుంది. ఇక్కడ పలు పార్టీల తరఫున ఏకంగా ఏడుసార్లు నెగ్గిన మోహన్‌భాయ్ సంజీభాయ్ దేల్కర్ 2019లో స్వతంత్రునిగా నెగ్గారు. 2021లో అనుమానాస్పద రీతిలో ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో ఆయన భార్య కాలాబెన్ మోహన్‌భాయ్ దేల్కర్ శివసేన తరఫున పోటీ చేసి నెగ్గారు. ఇక లక్షద్వీప్‌లో కాంగ్రెస్ హవాకు 2019లో ఎన్సీపీ అడ్డుకట్ట వేసింది. ఇటీవల మాల్దీవులతో వివాదం నేపథ్యంలో లక్షద్వీప్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. మోదీ పర్యటన తర్వాత టూరిస్టుల తాకిడి కూడా పెరిగింది.



నోట్: కేంద్రపాలిత ప్రాంతాల్లో 7 లోక్‌సభ స్థానాలున్న ఢిల్లీపై విడిగా కథనం అందిస్తాం

2019లో ఏ పార్టీకి ఎన్ని?

(మొత్తం సీట్లు 12)

అండమాన్ నికోబార్ - 1 (కాంగ్రెస్ 1)
చండీగఢ్ - 1 (బీజేపీ 1)
దాద్రానగర్ హవేలీ - 1 (శివసేన 1)
డామన్ దయ్యూ 1 (బీజేపీ 1)
జమ్మూకశ్మీర్ - 5 (బీజేపీ 2, జేకేఎన్సీ 3)
లద్దాఖ్ - 1 (బీజేపీ 1)
లక్షద్వీప్ - 1 (ఎన్సీపీ 1)
పుదుచ్చేరి - 1 (కాంగ్రెస్ 1)

పుదుచ్చేరిపై పార్టీల గురి

పుదుచ్చేరిలో ప్రాంతీయ పార్టీలైన ఎన్ఆర్ కాంగ్రెస్ (ఎన్ఆర్సీ), డీఎంకేతో పాటు కాంగ్రెస్ కూడా చక్రం తిప్పుతున్నాయి. ఈ ఎంపీ సీటును 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ఆర్సీ గెలుచుకుంది. 2019లో దీన్ని కాంగ్రెస్ చేజిక్కించుకుని బీజేపీ, ఎన్ఆర్సీలతో కూడిన ఎన్డీఏ కూటమికి షాకిచ్చింది. ఎన్.రంగస్వామి కాంగ్రెస్ నుండి విడిపోయి ఎన్ఆర్ కాంగ్రెస్ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్నారు. నాటినుంచి ఇక్కడ కాంగ్రెస్ తేరుకోలేకపోతోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 30 సీట్లలో ఎన్ఆర్సీ 10 చోట్ల గెలిచింది. బీజేపీకి 6 సీట్లు రావడంతో రంగస్వామి మళ్లీ సీఎంగా ఎన్డీఏ సర్కారు కొలువుదీరింది. పుదుచ్చేరి అసెంబ్లీలోని నియోజకవర్గాల్లో ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్న యానాం కూడా ఉండటం విశేషం!

కశ్మీర్.. బీజేపీ బ్రహ్మాస్త్రం

2019లో బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన నాటినుంచీ జమ్మూ కశ్మీర్‌పై మోదీ సర్కారు ఫోకస్ చేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370ను 2019 ఆగస్ట్ 5న రద్దు చేసింది. రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో 6 లోక్‌సభ స్థానాలున్నాయి. 2019లో జమ్మూ, లద్దాఖ్‌లోని 3 సీట్లను బీజేపీ గెలుచుకుంది. కాశ్మీర్ లోయలోని 3 సీట్లను జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జేకేఎన్సీ) చేజిక్కించుకుంది. 2014లో కూడా బీజేపీకి 3 సీట్లు రాగా పీడీపీకి 3 దక్కాయి. 2014 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీడీపీ 28 సీట్లు, బీజేపీ 25 సీట్లలో గెలిచి ముఫ్తీ మహమ్మద్ సయీద్ సీఎంగా సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేశాయి. 2016లో ఆయన మరణించడంతో కుమార్తె మెహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. 2018లో బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో ప్రభుత్వం కూలిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్ లోపు అక్కడ జమ్మూ కశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత దానికి మళ్లీ రాష్ట్ర హోదా దక్కే అవకాశాలున్నాయి. గతంలో ఇక్కడ చక్రం తిప్పిన కాంగ్రెస్ గులాంనబీ ఆజాద్ రాజీనామాతో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. సొంత పార్టీ పెట్టుకున్న ఆజాద్ చిన్న పార్టీలతో కలిసి పోటీ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇండియా కూటమి పక్షాలు కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీ సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. జమ్మూలోని 2 సీట్లలో కాంగ్రెస్‌కు ఎన్సీ, పీడీపీ మద్దతివ్వనున్నాయి. కాశ్మీర్ లోయలోని 3 సీట్లపై మాత్రం పీటముడి పడింది. మూడింట్లోనూ పోటీ చేస్తామని ఎన్సీ ప్రకటించింది. పీడీపీ కూడా వెనక్కి తగ్గడం లేదు.

పోలింగ్ తేదీలు...

అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి - ఏప్రిల్ 19 (1వ విడత)
దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ - మే 7 (3వ విడత)
లద్దాఖ్ - మే 20 (5వ విడత)
చండీగఢ్ - జూన్ 1 (7వ విడత)
జమ్మూ కశ్మీర్ - ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20 (5 విడతలు)

సర్వేల అంచనాలు ఇలా...

ఈసారి కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ బలం మరింత పెరుగుతుందని సర్వేలు చెబుతున్నాయి. ఢిల్లీలో మళ్లీ క్లీన్‌స్వీప్‌తో పాటు పుదుచ్చేరి, లద్దాఖ్, చండీగఢ్ ఆ పార్టీ పరం అవుతాయంటున్నాయి. జమ్ము కశ్మీర్‌లో 2, దాద్రానగర్, డామన్ దయ్యు, అండమాన్ సీటు కూడా బీజేపీ వేనన్నది వాటి అంచనా. కాంగ్రెస్ లక్షద్వీప్‌లో మాత్రం నెగ్గవచ్చని, కశ్మీర్‌లోని 3 సీట్లలో ఎన్సీ గెలుస్తుందని అన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

కాదేదీ ప్రచారానికి అనర్హం అంటున్నారు అభ్యర్థులు. చివరికిలా మొండిగోడలను కూడా వదలడం లేదు. కేరళలో అలత్తూర్ లోక్‌సభ స్థానం పరిధిలో వాటిపై ఇలా కాంగ్రెస్ అభ్యర్థి పోస్టర్లు అంటించారు!

ఎలక్షన్ బీట్

మహిళా సిబ్బందితో 'మహే' పోలింగ్

పుదుచ్చేరి: పుదుచ్చేరిలోని మహే లోక్‌సభ నియోజకవర్గంలో పోలింగ్‌ను పూర్తిగా మహిళలే నిర్వహించనున్నారు. మహే ప్రాంతంలో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నందున.. మొత్తం 31 పోలింగ్ స్టేషన్లలో మహిళలనే విధుల్లో ఉంచనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి.జవహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఎన్నికలను మెరుగైన పద్ధతిలో నిర్వహించగలరని, 'మోడల్ పోలింగ్ స్టేషన్లు' ఏర్పాటు ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రంలో పూర్తిగా దివ్యాంగులైన ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. శిశువులతో పోలింగ్ బూత్‌కు వచ్చే మహిళల పిల్లల సంరక్షణ కోసం క్రెచ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు.

ఒడిశాలో ఎన్నికల 'శంఖా'రాగం..!

ఒడిశా: శంఖారావం... హిందువులు ఏవైనా శుభకార్యాలు ప్రారంభించేప్పుడు, ప్రత్యేకించి జాతరలు, పండుగల సమయాల్లో చేసేది. ఈ ఎన్నికల వేళ ఒడిశా మొత్తం శంఖారావం చేస్తోంది. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు శాసనసభకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ గుర్తు 'శంఖం'. ఎన్నికల ప్రచారం కోసం ప్రారంభించేందుకు ఆ పార్టీ అభ్యర్థులంతా శంఖం ఊదేవారిని సంప్రదిస్తున్నారు. దీంతో శంఖం ఊదేవారికి డిమాండ్ పెరిగింది.

అనంత్‌నాగ్ -రాజౌరీ నుంచి ఆజాద్

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) తెలిపింది. పార్టీ కోర్ కమిటీ సమావేశమై, ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీపీఏపీ నేత తాజ్ మొహియుద్దీన్ తెలిపారు. కాశ్మీర్‌లోని ఇతర లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను తగిన సమయంలో నిర్ణయిస్తామని మొహియుద్దీన్ చెప్పారు. కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల అనుబంధానికి ముగింపు పలికిన ఆజాద్.. 2022లో సొంత పార్టీ డీపీఏపీని ప్రారంభించారు. 2014లో ఉధంపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, బీజేపీ నేత జితేంద్ర సింగ్ చేతిలో ఓడిపోయిన తర్వాత ఆజాద్‌కు ఇదే తొలి లోక్‌సభ ఎన్నికలు.

17 మందితో కాంగ్రెస్ మరో జాబితా

న్యూఢిల్లీ: మరో 17 మంది లోక్‌సభ అభ్యర్థుల పేర్లతో తాజా జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం విడుదలచేసింది. ఈ జాబితా ప్రకారం బిహార్‌లోని కృష్ణగంజ్ నుంచి మొహమ్మద్ జావెద్ పోటీ చేయనున్నారు. కతిహార్ నుంచి తారిఖ్ అన్వర్, భాగల్పూర్ నుంచి ఎమ్మెల్యే అజీత్ శర్మ బరిలో నిలుస్తున్నారు. మొత్తంగా ఒడిశాలో ఎనిమిది, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు, బిహార్‌లో మూడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్క స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ తాజాగా ఎంపికచేసింది. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ నుంచి మునీశ్ తమాంగ్ పోటీచేస్తారు. మంగళవారం విడుదలైన జాబితాతో కలిపి పార్టీ ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 228 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

సరన్ నా కర్మభూమి: రోహిణి

సరన్: సరన్ తన కర్మభూమి అని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణీ ఆచార్య అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో సరన్ నియోజకవర్గం నుంచి ఆర్జేడీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న ఆమె మంగళవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సోనేపూర్ చేరుకున్న ఆమెకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కొడుకులనే గాక కూతురిని కూడా లాలూ రాజకీయాల్లోకి తేవడం వారసత్వ రాజకీయాలకు మరో ఉదాహరణ అని బీజేపీ ఎద్దేవా చేసింది.

మోదీతో రాహుల్‌కు పోలికా: షా

బెంగళూరు: ''ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవుల్లో ఏకధాటిగా 23 ఏళ్లపాటు కొనసాగిన నరేంద్ర మోదీ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. కాంగ్రెస్ నేత రాహుల్ బాబా మాత్రం వేసవి వస్తుందంటే విదేశీ యాత్రలకు వెళ్లిపోతారు. ఆయన ఎక్కడున్నారోనని ప్రతి ఆరు నెలలకు కాంగ్రెస్ వెతుక్కుంటుంది'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఎద్దేవా చేశారు. ''23 ఏళ్ల పదవీ కాలంలో మోదీ కనీసం 25 పైసల అవినీతికి పాల్పడినట్లు కూడా ప్రతిపక్షాలు ఆయన్ను వేలెత్తి చూపలేదు. యూపీఏ పదేళ్ల పాలనలోనేమో ఏకంగా రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయి. మోదీ వంటి నేత ప్రపంచంలోనే మరొకరు ఉండరేమో! వాళ్లు, వీళ్లని తేడా లేకుండా ప్రపంచమంతా మోదీని ఆరాధిస్తోంది. ఆయనకు, రాహుల్‌కు పోలికే లేదు'' అని అమిత్ షా అభిప్రాయపడ్డారు.

అమరావతి బరిలో అంబేడ్కర్ మనవడు

ముంబై: బీఆర్ అంబేడ్కర్ మనవడు, రిపబ్లికన్ సేన నేత ఆనంద్‌రాజ్ అంబేడ్కర్ మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. అమరావతిలో బహుముఖ పోటీ నెలకొంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ నవనీత్ రానా, కాంగ్రెస్ బల్వంత్ వాంఖడే, వంచిత్ బహుజన్ అఘాడీ నుంచి ప్రజక్త పిల్లెవన్, ప్రహార్ జనశక్తి పార్టీ నేత దినేశ్ బుబ్ రంగంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంద్‌రాజ్ తమ మద్దతు కోరారని ఎంఐఎం నేత, ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ మంగళవారం వెల్లడించారు.

నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం.. 29 మంది దుర్మరణం

ఇస్తాంబుల్: తుర్కియేలోని అతిపెద్ద నగరం ఇస్తాంబుల్‌లోని ఓ నైట్ క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 29 మందిని బలి తీసుకుంది. క్లబ్‌లో పునరుద్ధరణ పనుల సందర్భంగా ఈ దుర్ఘటన జరిగింది. బాధితులంతా పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్న వారేనని అధికారులన్నారు. ఇస్తాంబుల్‌లో యూరప్ ఖండం పరిధిలోకి వచ్చే బెసిక్టాస్ జిల్లాలోని ఓ భవనంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

బాబా రామ్‌దేవ్‌పై సుప్రీం ఆగ్రహం

మాట తప్పారని మొట్టికాయ ● క్షమాపణలు తిరస్కరించిన కోర్టు

న్యూఢిల్లీ: ఆధునిక వైద్య శాస్త్రాలను తప్పుబడుతూ మరోసారి వాణిజ్య ప్రకటనలు ఇవ్వబోమని సుప్రీంకోర్టుకు చెప్పి కూడా అదే తప్పును పునరావృతం చేశారంటూ యోగా గురు రామ్‌దేవ్, పతంజలి ఆయుర్వేద ఎండీ బాలకృష్ణలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. వారు మంగళవారం వారు వ్యక్తిగతంగా హాజరై క్షమాపణలు చెప్పినా తిరస్కరించింది. మనస్ఫూర్తిగా చెప్పలేదంటూ మండిపడింది. ''కోవిడ్ విజృంభణ సమయంలో అలోపతిని తక్కువ చేసి చూపుతూ, తమ ఉత్పత్తులే రోగాలను నయం చేస్తాయని పతంజలి ప్రకటనలిచ్చింది. అయినా కేంద్రం చర్యలు తీసుకోకుండా కళ్లు మూసుకుంది'' అంటూ జస్టిస్ హిమా కోహ్లి నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. తప్పుడు ప్రకటనలు ఇవ్వబోమంటూ కోర్టు సంతృప్తి చెందేలా మరోసారి అఫిడవిట్లు సమర్పించాలని వారిని ఆదేశించింది. ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనల విషయంలో చట్టాన్ని ఇకపై ఉల్లంఘించబోమని పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ నవంబర్ 21న సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. తర్వాత ఉల్లంఘనకు పాల్పడటంపై కోర్టు షోకాజ్ నోటీసులిచ్చినా వాటికి పతంజలి స్పందించలేదు.

స్కూల్‌లో 12 ఏళ్ల బాలుడు కాల్పులు.. ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

హెల్సింకీ: ఫిన్లాండ్‌లోని ఓ పాఠశాల వద్ద 12 ఏళ్ల విద్యార్థి జరిపిన కాల్పుల్లో ఒకరు చనిపోగా మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. రాజధాని హెల్సింకీ శివారులో వంటా నగరంలోని వియెర్టోలా పాఠశాలలో మంగళవారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. బాలుడు తన బంధువుకు చెందిన లైసెన్సుడ్ హ్యాండ్‌గన్‌తో జరిపిన కాల్పుల్లో ఒక విద్యార్థి అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

బీజేపీలో చేరకుంటే అరెస్టేనన్నారు

త్వరలో నాతోసహా నలుగురిని అరెస్టు చేస్తారు ● ఢిల్లీ మంత్రి, ఆప్ నేత అతిశి



న్యూఢిల్లీ: బీజేపీలో చేరాలని, లేకపోతే నెల రోజుల్లోగా అరెస్టు కావడానికి సిద్ధంగా ఉండాలంటూ ఓ సన్నిహితుడి ద్వారా ఆ పార్టీ నేతలు తనకు వర్తమానం పంపించారని ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అతిశి ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ద్వారా అరెస్టు చేయిస్తామంటూ హెచ్చరికలు పంపారని అన్నారు. తనతో సహా నలుగురిని త్వరలో అరెస్టు అవకాశం ఉందని చెప్పారు. ఆమె మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాతోపాటు తనను త్వరలో అరెస్టు చేయబోతున్నారని తెలిపారు. కేజ్రీవాల్‌ను జైలుకు పంపించినా ఆమ్ ఆద్మీ పార్టీని విచ్ఛిన్నం చేయలేమన్న నిజాన్ని బీజేపీ గుర్తించిందని, అందుకే తమ నలుగురిని టార్గెట్ చేసిందని విమర్శించారు. తనకు అందిన సమాచారం ప్రకారం.. తొలుత తన ఇంట్లో, బంధువుల ఇళ్లల్లో సోదాలు జరుగుతాయని, తర్వాత తనకు సమన్లు ఇస్తారని, అనంతరం అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిందితుడు కాదని, చార్జిషీట్‌లో ఆయన పేరు లేదని గుర్తుచేశారు. అందుకే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే అవకాశం లేదని అతిశీ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఆయన పూర్తిస్థాయి మెజార్టీ ఉందని వివరించారు. మరోవైపు మంత్రి అతిశీ ఆరోపణలను బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. ''ఆరోపణలకు ఆమె ఆధారాలు చూపాలి. లేదంటే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలి'' అన్నారు.

సంజయ్ సింగ్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. సంజయ్ కస్టడీ పొడిగింపు అవసరం లేదని ఈడీ పేర్కొనడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను బుధవారం విడుదల చేస్తారని సమాచారం. సంజయ్‌ని గతేడాది అక్టోబర్ 4న ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యంలో ఇదొక గొప్ప రోజని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. సాక్షులను, అప్రూవర్లను బెదిరించి తీసుకున్న స్టేట్‌మెంట్ల ఆధారంగా లిక్కర్ కుంభకోణం కేసును సృష్టించినట్లు సుప్రీంకోర్టు ఉత్తర్వును బట్టి తేటతెల్లం అవుతోందని పేర్కొన్నారు. విపక్షాలపై దర్యాప్తు సంస్థలు కక్షపూరితంగా వ్యవహరించడం లేదని బీజేపీ పేర్కొంది. బెయిల్‌కు ఈడీ అభ్యంతరం చెప్పకపోవడమే నిదర్శనమంది.

జైలులో కేజ్రీవాల్ ధ్యానం

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహార్ జైలులో ఇతర ఖైదీల తరహాలోనే సాధారణ జీవనం గడుపుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కోర్టు ఆయనను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించిన సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం 4 గంటలకు జైలుకు చేరుకున్న కేజ్రీవాల్ రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదు. మంగళవారం తెల్లవారుజామున లేచారు. తన గదిలోనే తొలుత గంటకుపైగా ధ్యానం, యోగా చేశారు. ఉదయం 6.40 గంటలకు అల్పాహారం స్వీకరించారు. బ్రెడ్, టీ తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అధికారులు ఆయనకు రాత్రి భోజనం అందించారు. జైలులో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు టీవీ చూసే అవకాశం కేజ్రీవాల్‌కు కల్పించారు. దోమల బెడద లేకుండా బ్యారక్‌లో తెర అమర్చారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు జైలు అధికారులు కుర్చీ, టేబుల్‌తో పాటు ప్రత్యేక మంచాన్ని ఏర్పాటు చేశారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవడానికిషుగర్ సెన్సార్, గ్లూకోమీటర్‌ను అందుబాటులో ఉంచారు. మంగళవారం ఉదయం పరీక్షించగా, చక్కెర స్థాయి కొంత పడిపోయినట్లు వెల్లడయ్యింది.

పక్కనే ఉగ్రవాది, డాన్, గ్యాంగ్‌స్టర్

తిహార్ జైలు ప్రాంగణంలోని నెంబర్ 2 జైలులో ఉన్న కేజ్రీవాల్ సమీపంలోనే అండర్‌వరల్డ్ డాన్ చోటా రాజన్, గ్యాంగ్‌స్టర్ నీరజ్ బవానా, ఉగ్రవాది జియాఉర్ రెహ్మాన్ తదితర నేరగాళ్లు ఉన్నారు. ఒకప్పుడు దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడైన చోటా రాజన్ తర్వాత అతడికే ప్రత్యర్థిగా మారాడు. నీరజ్ బవానాపై 40కిపైగా కేసులున్నాయి. ఇక జియాఉర్ రెహ్మాన్ ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్‌లో సభ్యుడిగా చేరి, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు.

అవినీతిపై ఉక్కుపాదమే

ఇది నా గ్యారంటీ: మోదీ
- మూడో టర్మ్‌లో కఠిన చర్యలు
- కాంగ్రెస్‌ను తుడిచిపెట్టాలి
- అవినీతిపరులు జైలుకేనని వ్యాఖ్య



రుద్రపూర్/జైపూర్: అవినీతిలో కూరుకుపోయిన కొందరు నాయకులు తనను బెదిరించేలా మాట్లాడుతున్నారని, నిస్సిగ్గుగా దూషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. అలాంటి వారికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో నెగ్గి, మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అవినీతిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అవినీతిపై ఇక ఉక్కుపాదమేనని, ఇది తన గ్యారంటీ అని స్పష్టం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా దేశం గొంతు విప్పుతోందని అన్నారు. ప్రతి ఒక్క అవినీతిపరుడిపై చర్యలు ఉంటాయని, ఎవరినీ వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. తప్పుడు పనులు చేసినవారు జైలుకు వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. తనను తిట్టొచ్చు, బెదిరించవచ్చు గానీ అవినీతిపై చర్యల విషయంలో మాత్రం ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే దేశమంతటా మంటలు తప్పవంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్‌ను దేశం నుంచి తుడిచిపెట్టేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో తొలి బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్, 'ఇండియా' కూటమి ఉద్దేశాలు బయటపడుతున్నాయని చెప్పారు. అధికారం కోల్పోయి నిరాశలో ఉన్న కాంగ్రెస్ రాజకుటుంబ వారసుడు దేశంలో మంటలు సృష్టించడం గురించి మాట్లాడుతున్నాడని, అలాంటివి మీరు అనుమతిస్తారా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ విధమైన అనుచిత భాష మాట్లాడవచ్చా? వారిని మీరు శిక్షిస్తారా? లేదా? అని అడిగారు.

బుజ్జగింపు రాజకీయాలే కాంగ్రెస్ నైజం 'ఎమర్జెన్సీ' ఆలోచనా ధోరణి ఉన్న కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యంపై ఏమాత్రం విశ్వాసం లేదని ప్రధానమంత్రి ఆరోపించారు. ఎన్నికల్లో రాబోయే ఫలితాలపై ప్రజలను రెచ్చగొట్టాలని కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. దేశాన్ని అస్థిరత, అరాచకం వైపు మళ్లించాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమని ఆక్షేపించారు. ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేశాన్ని విడగొట్టాలన్న కాంగ్రెస్ నాయకుడిని శిక్షించాల్సింది పోయి లోక్‌సభ బరిలో దింపుతోందని ఆక్షేపించారు.

ఆ అగ్నిని పదేళ్లుగా ఆర్పేస్తున్నా...

విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ''అవినీతిపై చర్యలను అడ్డుకోవడానికి అవినీతిపరులంతా చేతులు కలిపిన తొలి లోక్‌సభ ఎన్నికలివి. సొంత కుటుంబాలను కాపాడుకోవడానికి కుటుంబ పార్టీలు ర్యాలీల మీద ర్యాలీలు వరుసగా నిర్వహిస్తున్న తొలి ఎన్నికలు కూడా ఇవే'' అన్నారు. రాజస్తాన్‌లోని కోట్‌పుత్లీలో ఆయన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే దేశం అగ్నిగుండం అవుతుందంటూ కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. అలాంటి అగ్నిని గత పదేళ్లుగా తాను ఆర్పేస్తూనే ఉన్నానని స్పష్టం చేశారు.

మహువాపై ఈడీ మనీ లాండరింగ్ కేసు

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగిన కేసులో టీఎంసీ నేత మహువా మొయిత్రా, వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీలపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. ''సీబీఐ ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నాం. ఫెమా నిబంధనల కింద దర్యాప్తు చేస్తున్నాం'' అని ఈడీ వర్గాలు తెలిపాయి. విచారణకు రావాలంటూ సమన్లు పంపగా అధికార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నామని వారు బదులిచ్చారని వెల్లడించాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో మంగళవారం పోలీసుల బలగాలు, మావోల నడుమ జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు. గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కొర్చోలి, లేంద్ర గ్రామాల సమీపాన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే నిఘా వర్గాల సమాచారంతో సోమవారం రాత్రి జిల్లా రిజర్వ్ గార్డ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా కమాండో , బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కొర్చేలి, లేంద్ర మధ్య అటవీ ప్రాంతంలో బలగాలకు మావోయిస్టులు తారసపడి కాల్పులు మొదలుపెట్టారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. సుమారు రెండు గంటల పాటు హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోయిస్టులు అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేస్తుండగా 11 గంటల సమయాన మళ్లీ వారికి మావోలు తారసపడి కాల్పులకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో మరో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మొత్తంగా పది మంది మావోయిస్టులు మృతి చెందారని, ఇందులో ఒక మహిళ ఉన్నారని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్ రాజు వెల్లడించారు. మృతులు మావోల పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ రెండో కంపెనీ సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పుల ఘటనలో సుమారు 30 మంది మావోలు పాల్గొని ఉంటారని భావిస్తున్నారు. పలువురు గాయాలపాలై తప్పించుకున్నట్లు భావించి పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఘటనాస్థలి నుంచి పెద్ద మొత్తంలో లైట్ మెషీన్ గన్స్, ఏకే 47 తుపాకులు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, మందుపాతరలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో మరో ఇద్దరు

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఘటనలో ఇద్దరు కరడుగట్టిన మావోయిస్టులు మృతి చెందారు. వారిని సాజంతి అలియాస్ క్రాంతి(38), రఘు అలియాస్ షేర్ సింగ్(52)గా గుర్తించారు. ఘటనా స్థలిలో ఆయుధాలు దొరికాయి. సాజంతిపై రూ.29 లక్షలు, రఘుపై రూ.14 లక్షల రివార్డులున్నాయి.

రూ.1,460 కోట్ల బాండ్ సమర్పించిన ట్రంప్

న్యూయార్క్: ఆస్తులను ఎక్కువ చేసి చూసి రుణాలు, బీమాలు పొంది బ్యాంక్‌లు, బీమా సంస్థలను మోసం చేశారన్న కేసులో కోర్టు ఆదేశాల మేరకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా రూ.1,460(17.5 కోట్ల డాలర్లు) విలువైన ష్యూరిటీ బాండ్‌ను న్యూయార్క్ కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో గతంలో రూ.3,785 కోట్ల జరిమానా చెల్లించాలని కోర్టు గతంలో ట్రంప్‌కు సూచించింది. దీనిపై ట్రంప్ పై కోర్టులో సవాల్ చేస్తామని చెప్పారు. అయితే ఆలోపు ఆస్తుల జప్తు ఆగాలంటే కనీసం 17.5 కోట్ల డాలర్ల బాండ్‌ను తమకు సమర్పించాలంటూ ట్రంప్‌కు న్యూయార్క్ అప్పిలేట్ కోర్టు 10 రోజుల గడువు ఇచ్చిన తెల్సిందే. దీంతో ట్రంప్ ఎట్టకేలకు అంతటి భారీ మొత్తానికి బాండ్ సమర్పించారు. దీంతో ట్రంప్ ఆస్తుల జప్తు తాత్కాలికంగా ఆగింది. 45.4 కోట్ల డాలర్ల(రూ.3,785 కోట్ల) జరిమానా సంబంధిత ఈ కేసులో ట్రంప్ ఒక వేళ గెలిస్తేనే ఈ రూ.1,460 కోట్ల బాండ్‌ను ఆయనకు తిరిగి ఇస్తారు. ఓడితే ట్రంప్ మొత్తం 45.4 కోట్ల డాలర్ల జరిమానాను రోజువారీ వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



గ్రేటర్ పరిధిలో రూ.4449.14 కోట్లు
- జీవితకాల పన్ను రూపంలో రూ.3617 కోట్లు

రవాణా రాబడి అదరహో

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఏటా లక్షల కొద్దీ కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రస్తుతం సుమారు 80 లక్షలకు పైగా వాహనాలు సిటీ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. ఏటా పెరుగుతున్న కొత్త వాహనాల సంఖ్యకు అనుగుణంగానే రవాణా శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కొత్త వాహనాలపై జీవితకాల పన్ను రూపంలోనే రవాణాశాఖకు రూ.3617.87 కోట్ల ఆదాయం లభించగా, వివిధ రకాల పన్నులతో కలుపుకొని ఈ ఆర్థిక సంవత్సరం రూ.4449.14 కోట్లు లభించినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు. గతేడాది కంటే ఇది ఎక్కువ గత సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు జిల్లాల్లో జీవితకాల పన్నుతో పాటు అన్ని రకాల ఫీజుల రూపంలో సుమారు రూ.3900 కోట్ల వరకు లభించగా, ఈ ఏడాది ఇంచుమించు రూ.4450 కోట్లకు చేరింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా లభించిన రూ.6990 కోట్లలో ఇది 64 శాతానికి పైగా ఉంటుందని అధికారులు తెలిపారు.

రంగారెడ్డి టాప్..

జీవితకాల పన్నుతో సహా అన్ని రకాలుగా రవాణాశాఖకు ఆదాయాన్ని ఆర్జించడంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో జీవితకాల పన్ను ద్వారా రూ.1209.76 కోట్లు లభించగా, రంగారెడ్డి జిల్లాలో రూ.1376.41 కోట్లు లభించడం గమనార్హం. మేడ్చల్‌లో రూ.1031.70 కోట్లు లభించింది. రవాణా వాహనాలపైన ప్రతి మూడు నెలలకు ఒకసారి విధించే త్రైమాసిక పన్నుల ద్వారా రంగారెడ్డిలో రూ.160.99 కోట్లు, హైదరాబాద్‌లో రూ.76.94 కోట్లు, మేడ్చల్‌లో రూ.134.47 కోట్లు లభించింది.

మిగతా అన్ని రకాల పన్నులు, ఫీజులు, సర్వీస్‌చార్జీలు కలుపుకొని ఈ ఆర్థిక సంవత్సరం రంగారెడ్డిలో రూ.1688.78 కోట్లు లభించగా, హైదరాబాద్‌లో రూ.1462.04 కోట్లు, మేడ్చల్‌లో రూ.1298.33 కోట్ల చొప్పున ఆదాయం లభించింది. గత సంవత్సరం కంటే ఈసారి ఆదాయం కొంత మేరకు పెరిగినప్పటికీ మోటారు వాహన నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాహనాలపై పెద్దగా నిఘా చేపట్టకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై వచ్చే ఆదాయం తగ్గినట్లు అంచనా. పొరుగు రాష్ట్రాలకు చెందిన వాహనాలు హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున తిరుగుతున్నప్పటికీ అధికారులు పెద్దగా తనిఖీలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి ఇక్కడికి బదిలీ అయ్యే వాహనాలపై పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గుతున్నట్లు అంచనా.



ఓ వైపు ఉద్యోగాల భర్తీ.. మరో వైపు కొత్త నోటిఫికేషన్లు నిరుద్యోగుల్లో ఆశలు పెంచుతున్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టాక రాష్ట్రంలో టెట్, డీఎస్సీ, గ్రూప్–1 తదితర ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఓయూలో ఎక్కడ చూసినా చదువుల వాతావరణం కన్పిస్తోంది. విద్యార్థులు ఎలాగైనా జాబ్ కొట్టాలన్న పట్టుదలతో సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్నారు. యూనివర్సిటీ లైబ్రరీ, ల్యాండ్‌స్కేప్ గార్డెన్, హాస్టల్ గదుల్లో విద్యార్థులు నిరంతరం పుస్తకాల్లో మునిగితేలుతున్నారు. ఇటీవల భర్తీ చేసిన పలు ఖాళీల్లోనూ పెద్ద సంఖ్యలో ఓయూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఓయూ సెంట్రల్ లైబ్రరీలో కన్పించిన దృశ్యమిదీ.. – ఉస్మానియా యూనివర్సిటీ

‘కొలువు’ కొట్టాల్సిందే..

గోడపై ‘కోడ్’?

అయితే చెడ్డీ గ్యాంగ్ రెక్కీ చేసి ఉండొచ్చు

- కోడ్ భాషలోనే ముఠా కమ్యూనికేషన్
- టార్గెట్ చేసిన ఇల్లు, ఆఫీసు గోడలపై అంకెలు లేదా అక్షరాలతో రాతలు
- తద్వారా గ్యాంగ్‌లోని ఇతర సభ్యులకు సమాచారం చేరవేత
- రెక్కీ, చోరీలకు ఇద్దరేసి చొప్పున రెండు వేర్వేరు బృందాలు
- మియాపూర్ ఠాణా కేసులో రెండు అనుమానిత కాల్స్ గుర్తింపు

మీ ఇల్లు లేదా ఆఫీసు గోడపై ఎక్కడో ఓ చోట ఒకటి, రెండంకెల నంబర్లు లేదా అక్షరాల రూపంలో ఏమైనా రాసి ఉన్నాయా? అయితే చెడ్డీ గ్యాంగ్ కన్నేసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంకెలు, అక్షరాల రూపంలో కోడ్ భాషలోనే చెడ్డీ గ్యాంగ్ కమ్యూనికేషన్ చేసుకుంటుందని సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ఇటీవల మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చెడ్డీ గ్యాంగ్ రూ.7.8 లక్షలు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులకు ఎలాంటి ఆధారాలు చిక్కకపోవడంతో సాంకేతిక అంశాల ఆధారంగానే దర్యాప్తు సాగుతోంది. టవర్ డంప్ సాంకేతికతతో రెండు అనుమానిత కాల్స్‌ను పోలీసులు గుర్తించారు. ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

– సాక్షి, సిటీబ్యూరో



ఇప్పటివరకు ఇళ్లలో చోరీలకు పాల్పడిన చెడ్డీ గ్యాంగ్.. పాఠశాలలు, కార్యాలయాలపై కూడా కన్నేసినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇటీవల జరిగిన చోరీ కేసులో తొలుత ఇది చెడ్డీ గ్యాంగ్ పని కాదని మియాపూర్ పోలీసులు భావించారు. చోరీ జరిగిన రోజున పాఠశాలలో పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) జరగడంతో పాటు సెలవు దినం కావడంతో పాఠశాల యాజమాన్యం, అక్కడి పరిస్థితుల గురించి అవగాహన ఉన్నవాళ్ల పనై ఉంటుందని భావించారు. కానీ, పోలీసుల డేటా బేస్ ఆధారంగా చెన్నై, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సిమెంట్ ఫ్యాక్టరీ, ఓ ప్రైవేట్ ఆఫీసులోనూ చెడ్డీ గ్యాంగ్ ఇదే తరహా చోరీలు చేసినట్లు గుర్తించారు. తాజా కేసులో గుజరాత్‌లోని దాహోద్ ప్రాంతానికి చెందిన చెడ్డీ గ్యాంగ్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు.

అర్ధరాత్రే తర్వాతే చోరీలు..

సాధారణంగా ఈ ముఠాలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులుంటారు. ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచి రైలు మార్గంలో హైదరాబాద్‌కు చేరుకుంటారు. స్టేషన్ లోపలి నుంచి బయటికి రావడం, ఆటో లేదా ఇతరత్రా ప్రజా రవాణాలను వీరు వినియోగించరు. సీసీ టీవీ కెమెరాలకు చిక్కకుండా రైలు పట్టాలను పట్టుకొని నడుచుకుంటూ బయటికి వెళ్లిపోతారు. రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న ఇళ్లు, స్కూళ్లు, ఆఫీసులను రెక్కీ చేస్తారు. చోరీకి బయలుదేరే ముందు సమీప చెట్ల పొదలు, నిర్మానుష్య ప్రాంతాలలో ఒంటి మీద దుస్తులను విప్పేసి, కేవలం లోదుస్తులు మాత్రమే వేసుకుంటారు. ముఖం కనిపించకుండా క్లాత్‌ను చుట్టుకుంటారు. అర్ధరాత్రి 1–2 గంటల తర్వాతే దొంగతనాలు చేస్తుంటారు. ఆపైన నిర్మానుష్య ప్రాంతాలలో లేదా శివారు ప్రాంతాలలో తాత్కాలికంగా అద్దె ఇళ్లలో తలదాచుకుంటారు. పరిస్థితులు సద్దుమణిగాక తిరిగి రైలులో సొంతూళ్లకు పరారవుతారు.

రెక్కీ, చోరీకి వేర్వేరు బృందాలు..

ముఠా నాయకుడు రెక్కీ, చోరీలను పక్కాగా ప్లాన్ చేస్తాడు. ముఠాలోని ప్రతీ సభ్యుడూ చురుగ్గా, తనకు కేటాయించిన విధులను పక్కాగా నిర్వర్తిస్తాడు. రెక్కీ చేసేందుకు ఇద్దరు, చోరీకి దిగేది ఇద్దరేసి సభ్యుల చొప్పున రెండు వేర్వేరు బృందాలుగా విడిపోతారు. రెక్కీ చేసిన బృందం ఆ సమాచారాన్ని ముఠాలోని ఇంకో గ్రూప్‌కు చేరవేసేందుకు టార్గెట్ చేసిన ఇల్లు లేదా ఆఫీసు, స్కూల్ గోడల మీద ఒక చోట అంకెలు, అక్షరాల రూపంలో రాతలు రాస్తారు. దీంతో ముఠాలోని చోరీ చేసే బృందం అర్ధరాత్రి చీకట్లో కూడా టార్గెట్ చేసిన ఇంటిని సులువుగా గుర్తిస్తారు. తాళాలను తెరిచేందుకు ఇనుప రాడ్లు, స్క్రూడ్రైవర్ వంటి పదునైన ఆయుధాలను వెంట తీసుకెళ్తారు. ఎవరైనా ఎదురు తిరిగితే వాటితో దాడి చేసేందుకూ వెనుకాడరు.

ఎవరక్కడ?

అభ్యర్థుల ప్రకటనపై ఆలస్యమెందుకో?

- కంటోన్మెంట్‌లో అన్ని పార్టీలదీ అదే దారి
- షెడ్యూల్ వచ్చి పక్షం రోజులైనా అదే సస్పెన్స్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై పక్షం రోజులు గడుస్తున్నా ప్రధాన పార్టీలు ఇప్పటికీ అభ్యర్థులను ఖరారు చేయలేదు. మూడు ప్రధాన పార్టీలూ ప్రత్యర్థుల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నాయి. దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో అనివార్యమైన ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సైతం తమ అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. లాస్య నందిత సోదరి నివేదిత తాను పోటీలో ఉంటానని ప్రకటించినప్పటికీ, అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. నివేదితతో మరో ముగ్గురు కీలక నేతలు బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తూ ఉండటంతోనే అధిష్టానం అభ్యర్థి ప్రకటనను ఆలస్యం చేస్తుందని తెలుస్తోంది. ఇక కంటోన్మెంట్ చరిత్రలోనే బీజేపీ గత ఎన్నికల్లో అత్యధికంగా సుమారు 42 వేలు ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. 2018, 2023లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీగణేశ్ అకస్మాత్తుగా కాంగ్రెస్‌లో చేరిపోవడంతో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. కొత్త అభ్యర్థి వెతుకులాటలో భాగంగా బీజేపీ అగ్రనేతలు స్థానిక నేతలతో అభిప్రాయ సేకరణ మొదలుపెట్టారు. ఇక బీజేపీలో టికెట్ పక్కా అనుకున్న సమయంలో కాంగ్రెస్‌లోకి వెళ్లిన శ్రీగణేశ్ విషయంలో కాంగ్రెస్ ఎటూ తేల్చడం లేదు. టికెట్ హామీతోనే శ్రీగణేశ్ పార్టీ మారినట్లు ఆయన అనుచరులు చెబుతున్నప్పటికీ, తెరపైకి కొత్త పేర్లు వస్తూ ఉండటంతో కాంగ్రెస్ కార్యకర్తల్లోనూ గందరగోళం నెలకొంది.



కొత్త అభ్యర్థి వేటలో...

ఇదిలా ఉండగా బలమైన అభ్యర్థిని పోగొట్టుకున్న బీజేపీ మళ్లీ కొత్త అభ్యర్థి వేట మొదలుపెట్టింది. పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జీవీఎస్‌రెడ్డి ఆదివారం స్థానిక నేతలతో భేటీ అయ్యి అభ్యర్థి ఎంపికపై చర్చించారు. మొత్తం 22 మంది అభ్యర్థులు పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇతర పార్టీల్లోని నేతల పేర్లు సైతం పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో కొనసాగుతున్న మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పేర్లను సైతం కొందరు ప్రతిపాదించడం గమనార్హం. ఇక బీఆర్ఎస్‌లో టికెట్ ఆశిస్తున్న మరో సీనియర్ నేత పేరును సైతం బీజేపీ కీలక నేత ప్రతిపాదించినట్లు సమాచారం.

వేచిచూస్తున్న బీఆర్ఎస్


దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందిత కుటుంబ సభ్యురాలైన నివేదితకు టికెట్ ఖరారు చేయడంలోనూ బీఆర్ఎస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు ఆమె అభ్యర్థిత్వానికి మద్దతు పలుకుతున్నప్పటికీ, కొందరు పార్టీ నేతలు విభేదిస్తూ ఉండటం ఇందుకు కారణమని తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా పనిచేసిన గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె కృషాంక్‌లు సైతం టికెట్ ఆశిస్తూ ఉండటంతో పార్టీ అధిష్టానం ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తోంది. మర్రి రాజశేఖర్ రెడ్డి ద్వారా పార్టీ కేడర్ నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది.

శ్రీగణేశ్ చేరికతో మారిన సమీకరణాలు..

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గద్దర్ కుమార్తె వెన్నెల ఆశించిన స్థాయిలో ఓట్లు రాబట్టుకోలేకపోయింది. కేవలం 16 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకోవడంతో అధిష్టానం పునరాలోచనలో పడింది. తొలుత సాయన్న కుమార్తె నివేదితను కాంగ్రెస్‌లోకి రప్పించే ప్రయత్నం చేయగా, బెడిసికొట్టింది. మరో బలమైన ప్రత్యర్థి శ్రీగణేశ్‌ను పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీజేపీని బలహీన పర్చింది. అయితే శ్రీగణేశ్ అభ్యర్థిత్వం ఖరారులోనూ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీపైనే ఆశలు పెట్టుకున్న వెన్నెలతో పాటు అద్దంకి దయాకర్‌ల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. పార్టీ ప్రకటనతో పనిలేకుండానే కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచే శ్రీగణేశ్ క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ ఉన్నారు.

ప్రమాద భయం వెంటాడింది.. ప్రాణాలను బలిగొంది

- భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



రితీష్ రెడ్డి (ఫైల్)

నాగోలు: రోడ్డు ప్రమాదానికి కారణమయ్యానని భయాందోళనకు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రి భవనం నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఎల్బీనగర్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన గుమ్మడి రితీష్ రెడ్డి (30) వృత్తిరీత్యా వ్యాపారి. నగరంలో ఓ పని నిమిత్తం కారులో వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో దిల్‌సుఖ్ నగర్ నుంచి ఎన్టీఆర్ నగర్‌లోని ఆద్య ఆస్పత్రికి వచ్చి కారును పార్కింగ్ చేశాడు. భయాందోళనతో ఉన్న అతను ఆస్పత్రి నాలుగో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా..నగరంలో పని నిమిత్తం వెళ్లిన అతను మూసారాంబాగ్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి కారణమైనట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. ఈ క్రమంలో రితీష్‌రెడ్డిని బైకుపై ఇద్దరు వ్యక్తులు వెంబడించడంతో భయాందోళనకు గురయ్యాడు. రోడ్డు ప్రమాదానికి కారణమైన తనపై కేసు పెడితే జైలుకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా.. రితీష్ రెడ్డి కారును ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెంబడించారు. అతను కారు ప్రమాదం చేసి వచ్చాడని అక్కడివారికి చెబుతున్న క్రమంలోనే.. రితీష్‌రెడ్డి భవనంపై నుంచి దూకడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. రితీష్ రెడ్డికి 8 నెలల క్రితమే వివాహమైందని, ఇంతలోనే ఘోరం జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రితీష్ రెడ్డిని వెంబడించినవారి కోసం స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



భవనంపైనుంచి పడుతున్న రితీష్ (వృత్తంలో)

హజ్ యాత్ర సేవకుల ఎంపిక పూర్తి

సాక్షి సిటీబ్యూరో: హజ్ యాత్రికుల సేవకులుగా ఎంపికైన వారు తమ విధులను సక్రమంగా నిర్వహించకపోతే తగిన చర్యలు తప్పవని రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి షేక్ లియాఖత్ హెచ్చరించారు. మంగళవారం నాంపల్లి హజ్‌హౌస్‌లో హజ్ యాత్రికుల సేవకులుగా 8 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఇప్పటికే 22 మంది ఎంపికయ్యారు. ప్రస్తుతం వీరి సంఖ్య 30కి చేరింది. ఈ సందర్భంగా లియాఖత్ మాట్లాడుతూ.. హజ్ యాత్రకు వెళ్లేవారు ఎక్కువ శాతం వయసు పైబడిన వారు ఉంటారన్నారు. వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆసుపత్రుల్లో చేర్పించి వైద్యం చేయించాలన్నారు. ఎంపికైన వారు మే నెలలో హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపారు.

సైబర్ యోధులకు సెల్‌ఫోన్లు

సీపీ అవినాష్ మహంతి



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబరాబాద్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైం యోధులకు (సైబర్ క్రైం పోలీసు కానిస్టేబుళ్లు) ప్రత్యేకంగా కొత్త సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులను అందజేశారు. మంగళవారం తెలంగాణ సైబర్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీసీబీ) అధికారులతో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఉపకరణా లతో సైబర్ నేరాల బాధితులకు సైబర్ క్రైమ్ యోధులతో సంప్రదింపులు, కేసుల నమోదు, దర్యాప్తు వంటి అంశాలు సులభతరమవుతా యని తెలిపారు. దీంతో సైబర్ సెక్యూరిటీ చర్యలను మెరుగవుతాయని చెప్పారు. 1930 టోల్ ఫ్రీ నంబరుకు వచ్చిన సైబర్ నేరాల ఫిర్యాదులు నేరుగా సంబంధిత సైబర్ యోధులకు మళ్లించడంతో బాధితులకు మార్గ నిర్దేశం చేయడంతో పాటు కేసు దర్యాప్తు పురోగతి తదితర అంశాలలో బాధితులకు సంప్రదింపులకు మార్గం సులువవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ, క్రైమ్స్, సైబర్ క్రైం ఇన్‌చార్జి డీసీపీ నర్సింహ, ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఓఈ ఏసీపీ చంద్రకాంత్, ఇన్‌స్పెక్టర్లు ఎస్ రమేష్, రవి, నరేందర్ రెడ్డి, శంకర్ రెడ్డి, అజయ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భానుడి భగభగ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరం వేడెక్కుతోంది. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. మధ్యాహ్నం పూట బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రోజురోజుకూ వేడిగాలుల ఉద్ధృతి పెరుగుతోంది. మంగళవారం అత్యధికంగా కుత్బుల్లాపూర్ ఆదర్శనగర్‌లో 42.1, హయత్‌నగర్, సరూర్‌నగర్ 41.8, ముసాపేట 41.4, ఉప్పల్ 41.2 , చందానగర్‌లో 41.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, చిన్నారులు వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప సాధ్యమైనంత వరకు పగటి పూట బయటికి వెళ్లొద్దంటున్నారు. వాహనదారులు చలువ అద్దాలు ధరించాలని సూచిస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి


మంత్రి సీతక్క



మహిళా శక్తి లోగోను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

మణికొండ: మహిళలు స్వశక్తితో వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలో ఉగాది నుంచి ప్రారంభించనున్న మహిళా శక్తి గ్రూప్ లోగోను ఆమె మంగళవారం నగరంలోని ప్రజా భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా శక్తి గ్రూపు సభ్యులు కె. విజయ, సునైన, సరోజిని, పద్మ, స్వప్న, లక్ష్మి, రాజేశ్వరి, చిత్రపురి ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్ ఓనర్స్ కమిటీ నాయకులు కె.శ్రీనివాస్, ధన్‌రాజ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇక గండిపేట నీటి సరఫరా



మణికొండ క్వార్టర్స్ వద్ద సిద్ధమైన ఫిల్టర్ బెడ్

మణికొండ: మండల వాసులకు గండిపేట చెరువు నీటిని తాగే అవకాశం వచ్చింది. ఇప్పటి వరకు నగర ప్రజలకే సరఫరా చేస్తున్న ఈ నీటిని ఇకపై మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలకు సౌకర్యం కలగనుంది. గతంలో గండిపేట చెరువు నీటిని జంట మున్సిపాలిటీల పరిధిలోని కొన్ని గ్రామాలకు అందించాలనే ఉద్దేశంతో మణికొండ క్వార్టర్స్, పుప్పాలగూడ బీఆర్‌సీ అపార్ట్‌మెంట్‌ల సమీపంలో రూ.80 లక్షలతో ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేశారు. అప్పట్లో గండిపేట జలాశయంలో నీరు అడుగంటి ఉండటం, వాటిని స్థానికంగా ఫిల్టర్ చేసినా మురుగు వాసన రావటంతో సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం జలాశయం నిండుగా ఉండటంతో అలాంటి సమస్య రాదనే ఉద్దేశంతో ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి స్థానికంగా సరఫరా చేయాలని నిర్ణయించారు. మణికొండ క్వార్టర్స్ వద్ద ఉన్న 3 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఫిల్టర్‌బెడ్ పనులను మంగళవారం పూర్తి చేసి ట్రయల్‌రన్ చేశారు. బుధవారం నుంచి నీటిని ఫిల్టర్ చేసే పనులను పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని జలమండలి అధికారులు తెలిపారు. బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న 2లక్షల లీటర్ల సామర్థ్యం ఫిల్టర్ బెడ్‌లో ఎలక్ట్రికల్ పనులు చేయాల్సి ఉన్నందున అక్కడ మరో వారం రోజుల తర్వాత నీటిని సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు.

మూసీకి ఇరువైపులా 50 మీటర్ల వరకు

నో పర్మిషన్

- జీహెచ్‌ఎంసీ అధికారులకు కమిషనర్ ఆదేశాలు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ నేపథ్యంలో..



సాక్షి, సిటీబ్యూరో: మూసీ సరిహద్దులకు ఇరువైపులా భవన నిర్మాణాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు సంబంధించి జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. నదికి రెండు వైపులా 50 మీటర్ల వరకు ఎలాంటి కొత్త లేఔట్లకు, భవన నిర్మాణాలకు, ఇతరత్రా అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వవద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్ని జోన్ల కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ పనులు చేపట్టిన ఎంఆర్‌డీసీఎల్ నుంచి కమిషనర్‌కు అందిన లేఖకు అనుగుణంగా ఆయన ఆదేశాలు జారీ చేశారు.

- ఉస్మాన్‌సాగర్ డౌన్‌స్ట్రీమ్ పాయింట్ నుంచి ఓఆర్ఆర్ ఈస్ట్ (గౌరెల్లి) వరకు, హిమాయత్ సాగర్ డ్యామ్ డౌన్‌స్ట్రీమ్ పాయింట్ నుంచి బాపూఘాట్‌లో కలిసే వరకు 55 కి.మీ. మేర నీటి వనరుల్ని రిక్రియేషనల్, గ్రీన్ బఫర్ జోన్‌లుగా నిర్వహించాల్సి ఉన్నందున కొత్త లే ఔట్లు, నిర్మాణాలకు అనుమతులివ్వరాదని ఎంఆర్‌డీసీఎల్ ఎండీ కోరడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అందుకనుగుణంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును వెంటనే చేపట్టాల్సిందిగా సూచించడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు తగిన విధంగా ఐకానిక్ డిజైన్‌ను కూడా రూపొందించాలని ఆదేశించడం తెలిసిందే.
- మూసీ సరిహద్దులతో పాటు బఫర్‌జోన్ లో ఎన్ని ఆస్తులు, ఆక్రమణలు ఉన్నాయో కూడా గుర్తించాల్సిందిగా సమీక్ష సమావేశంలో సీఎం సూచించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎక్కువ బృందాల్ని నియమించాల్సిందిగా ఆదేశించారు. సర్వే పనుల కోసం ప్రభుత్వం నియమించిన డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు 14 మండలాల పరిధిలో ఉన్న 55 కి.మీ. మేర సర్వే పనులు చేపట్టారు. సర్వే సందర్భంగా నది అవతల 50 మీటర్ల లోపున కొత్తగా నిర్మాణాలెన్నో జరుగుతున్నట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతే కాకుండా.. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనుల్లో యుటిలిటీ కారిడార్ ఎంతో కీలకమైనది కావడంతో ఆపనులకు ఆటంకాలు లేకుండా ఉండేందుకు మూసీకి ఇరువైపులా తగినంత స్థలం అవసరం. నది వెంబడి చేపట్టబోయే అభివృద్ధి పనులు, రవాణా తదితరమైనవి కూడా పరిగణనలోకి తీసుకున్నారు.



మాతృ సంస్థకు తిరిగివచ్చిన వార్డు అసిస్టెంట్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డు అసిస్టెంట్లుగా విధులు నిర్వహించిన సుమారు 150 మంది ఉద్యోగులు తిరిగి మాతృ సంస్థ జలమండలికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఎండీ సుదర్శన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు వివిధ సమస్యలు, ఉద్యోగుల పదోన్నతులపై ఎండీతో చర్చించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ , సలహాదారు విశ్వనాథ్ లక్ష్మణ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి కిరణ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆశం నరసింహారెడ్డి, నర్సింగ్ రావు. అజయ్‌నాథ్, మోతిరాం,చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మొగులయ్య, ఉమామహేశ్వర్, ట్రెజరర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఎండీ సుదర్శన్ రెడ్డికి ఉద్యోగుల సమస్యలు విన్నవిస్తున్న యూనియన్ ప్రతినిధులు

కేశవా.. నీళ్లు రావా.!

- భూ సేకరణ అడ్డంకులతో సామర్థ్యం తగ్గింపు
- గత ప్రభుత్వ యూటర్న్‌తో ఆదిలోనే నిలిచిన కేశవాపూర్ ప్రాజెక్టు
- అటకెక్కిన హైదరాబాద్‌కు తాగునీటి ప్రతిపాదనలు


కేశవాపూర్ ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతం

సాక్షి, సిటీబ్యూరో: కేశవాపూర్ రిజర్వాయర్ కథ కంచికి చేరింది. జంటనగరాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు దాదాపుగా అటకెక్కింది. భూసేకరణపై అభ్యంతరాలు, మారిన రాజకీయ సమీకరణలు కూడా ప్రాజెక్టు ముందడుగుకు బ్రేక్ పడింది. గత ప్రభుత్వ హయాంలోనే భూ సేకరణకు స్థానికంగా అభ్యంతరాలు వ్యక్తం కావడంతో రిజర్వాయర్ సామర్థ్యాన్ని కూడా కుదించారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణా నది జలాలు నగర తాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. మంచి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా నగర శివార్లలో శామీర్‌పేట మండలం, కేశవాపూర్‌లో జలాశయాన్ని నిర్మించాలని గత సర్కారు నిర్ణయించింది. ఈ రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే 2050 వరకు హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి ఉండదని భావించింది. కానీ, దీనికి ప్రతిపాదనల దశలోనే బ్రేక్ పడింది.

ఇదీ కథ

ఆరేళ్ల క్రితం కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా తరలించి హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చేలా కేశవాపూర్ రిజర్వాయర్‌ను 10 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టాలని నిర్ణయించారు. రిజర్వాయర్ నిర్మాణానికి 13 కి.మీటర్ల కట్ట నిర్మాణంతో పాటు కొండపోచమ్మ సాగర్ మీదుగా కేశవాపూర్ జలాశయానికి మూడు 3,600 ఎంఎం డయా గ్రావిటీ పైప్ లైన్ల ద్వారా నీటిని తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రిజర్వాయర్ నుంచి వచ్చే రా వాటర్‌ను ఘనపూర్‌లో నీటి శుద్ధి కేంద్రంలో (డబ్ల్యూటీపీ) శుద్ధి చేసి శామీర్‌పేట , సైనిక్‌పురి మీదుగా ఉన్న గోదావరి రింగ్ మెయిన్ పైప్ లైన్లకు జలాలను పంపింగ్ చేసే విధంగా రూపకల్పన జరిగింది.

- కేశవాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి 3,822 ఎకరాల భూమి అవసరం ఉంటుందని భావించి భూసేకరణ, పరిహారం చెల్లింపునకు రూ. 518.7 కోట్లతో ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 4,777.59 కోట్లతో పరిపాలనా అనుమతులు లభించాయి ప్రాజెక్టు నిర్మాణానికి 3,918 కోట్లతో టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి చేశారు.
- పనులు చేపట్టేందుకు బొందాసపేట. పొన్నాల గ్రామాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే కొందరు రైతులు భూసేకరణకు సహకరించడం లేదు. భూసేకరణ కోసం
- రెవెన్యూ అధికారులు సమావేశాలు నిర్వహించినా ముంపు గ్రామాల ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.
- భూ సేకరణకు అడ్డంకుల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం జలాశయ సామర్థ్యాన్ని 10 టీఎంసీల నుంచి 5.04 టీఎంసీలకు కుదించింది. ప్రభుత్వ భూమి 918.84 ఎకరాల మేర అటవీ భూమి ప్రాంతంలోనే నిర్మాణం చేపట్టేలా ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. కేశవపురం వద్ద 5 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని తగ్గించి. మిగిలిన 5 టీఎంసీలను కొండపోచమ్మ సాగర్ నుంచి నేరుగా ఘనపూర్‌కు తరలించేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. అయితే ప్రభుత్వం ప్రాజెక్టు విషయంలో యూ టర్న్ తీసుకోవడంతో హైదరాబాద్‌కు తాగు నీటి తరలింపు ప్రతిపాదనలు అటకెక్కినట్లయ్యింది.

సీఏఏకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం: కేటీఆర్


పండ్లు తినిపిస్తున్న కేటీఆర్

మల్కాజిగిరి: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు బీఆర్‌ఎస్ వ్యతిరేకమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని జీకే ఫంక్షన్‌హాల్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ హోం మంత్రి మహ్మద్ ఆలీ, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..కేసీఆర్ పాలనలో మైనార్టీల సంక్షేమానికి కృషి చేశారన్నారు. వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీ సహకారంతో గ్రేటర్‌లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అదే స్థాయి విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు సబితాకిషోర్, సునీతయాదవ్, మీనారెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోకిరీల పని పడుతున్నారు..

- 15 రోజుల్లో 96 మంది అరెస్టు
- ఇందులో 49 మంది మైనర్లే

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న పోకిరీల పనిపడుతున్నారు రాచకొండ పోలీసులు. గత నెల 1–15 తేదీల్లో 118 ఫిర్యాదులు అందగా.. వాటిలో 96 మందిని అరెస్టు చేశారు. వీరిలో 47 మంది మేజర్లు కాగా, 49 మంది మైనర్లు ఉండటం గమనార్హం. వీరందరికీ మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంపు కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు.

చున్నీతో ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య

మియాపూర్ : చున్నీతో ఉరివేసుకుని ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నారాయణపేట్‌కు చెందిన వెంకటప్ప, పద్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు (కవలలు). బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి గోపాల్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె (17) 8వ తరగతితో చదువు ఆపేసి ఇంటివద్దే ఉంటుంది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు కూలీ పనులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం కుమారుడు తిమ్మప్ప భోజనం చేసేందుకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో చెల్లెలు ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానిక సహాయంతో ఆమెను కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు.

లాలాగూడ మాజీ సీఐ పద్మ సస్పెన్షన్

అడ్డగుట్ట: విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ పద్మను ఇటీవల కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆమెను సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు లాలాగూడ ఇన్‌స్పెక్టర్ పద్మను శనివారం కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. కాగా, ఆమెను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ఫిట్స్‌తో ఎంటమాలజీ కార్మికుడి మృతి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విభాగానికి సంబంధించిన పనులు చేస్తున్న ఎంటమాలజీ(దోమల నివారణ) విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికుడు ఫిట్స్‌తో మృతి చెందిన సంఘటన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న కొందరు ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఎన్నికల నేపథ్యంలో ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విభాగానికి సంబంధించిన పనుల్లో నియమించారు. వారిలో ఒకరైన పెండ్యాల కిషన్(48)కు ఫిట్స్ రావడంతో సమీపంలోని నర్సింగ్‌హోమ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు.కాచిగూడలోని గోల్నాకలో పనిచేసే కిషన్‌తో పాటు మరికొందరిని సోమవారమే ప్రధాన కార్యాలయంలో పనులకు నియమించినట్లు సమాచారం.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌పై పడుకునేందుకు జాగా ఇవ్వలేదనే కారణంగా బండ రాయితో మోది హత్యకు పాల్పడిన సంఘటనలో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జె. మునిరాజు(30), ఖమ్మంజిల్లా తిరుమలాయ పాలెం గ్రామానికి చెందిన వినోద్ సినీ కార్మికులుగా పని చేస్తూ ఫుట్‌పాత్‌పై నివాసం ఉండేవారు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చిన వినోద్ తాను నిద్రించే ప్రదేశంలో మునిరాజు నిద్రపోతుండటాన్ని గుర్తించి అతడితో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి లోనైన వినోద్ పక్కనే ఉన్న సిమెంట్ రాయితో మునిరాజు తలపై గట్టిగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వినోద్‌ను నిందితుడిగా గుర్తించారు. పరారీలో ఉన్న అతడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

రూ.15 లక్షలు వసూలు

బంజారాహిల్స్: ఫేస్ బుక్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివసించే మహిళ(32)కు రవికుమార్ అనే వ్యక్తితో ఫేస్ బుక్ లో పరిచయం ఏర్పడింది. దీంతో ఇద్దరు తమ సెల్ ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రవికుమార్ సదరు మహిళకు దగ్గరయ్యాడు. వ్యాపారం చేస్తానని నమ్మించి ఆమె వద్ద రూ. 15 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వకుండా, పెళ్లి చేసుకోనని తేల్చి చెప్పాడు. నమ్మించి మోసం చేయడమే కాకుండా డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 1.5 కోట్ల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు

అబిడ్స్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు మంగళవారం రాత్రి మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారుసలాం ప్రాంతంలో దాదాపు కోటిన్నర నగదును స్వాధీనం చేసుకున్నారు. పూర్తి సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ ప్రాంతానికి చెందిన కొత్త రవిచంద్ర, జస్తి సురేష్ బేగంబజార్ ప్రాంతంలో రూ.1.5 నగదు తీసుకుని డ్రైవర్ శ్రీనివాస్‌తో కలిసి జీపులో వెళుతుండగా దారుసలాం వద్ద పోలీసులు జీపును తనిఖీ చేయగా భారీగా నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు జీపులో ఉన్న కొత్త రవిచంద్ర, జస్తి సురేష్‌లతో పాటు డ్రైవర్ చిత్తల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో హవాలా డబ్బుగా అనుమానిస్తున్నారు. నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఏసీపీ కోట వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

- గ్రేటర్ పరిధిలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మూల్యాంకనం
- తప్పిదాలకు పాల్పడితే చర్యలు

సాక్షి,సిటీబ్యూరో : పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభం కానుంది. ఈ నెల 11వరకు జరిగే మూల్యాంకనం కోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జల్లా, మేడ్చల్ జిల్లాలో నాలుగు మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి అసిస్టెంట్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, కోడింగ్ అధికారులు, ప్రత్యేక సహాయకులుగా ఉపాధ్యాయలను నియమించారు.

విద్యార్థులకు జిరాక్స్ పత్రాలు

పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు మూల్యాంకనమైన తమ జవాబు పత్రాలు పొందవచ్చు. జవాబు పత్రంలో ఏ జవాబుకు ఎన్ని మార్కుల వచ్చాయి. చేసిన తప్పిదాలేంటో తెలుసుకునేందుకు ఎస్ఎస్సీ బోర్డు జిరాక్స్ పత్రాల వెసులు బాటు కల్పించింది.

హైదరాబాద్ జిల్లాకు 3, 62,640 పత్రాలు

హైదరాబాద్ జిల్లాలో రెండు మూల్యాంకనం కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 3,62, 640 జవాబు ప్రతాలను విద్యాశాఖ కేటాయించింది. ఇందు కోసం సుమారు 1,733 మంది కి విధులు అప్పగించారు. ఇందులో 1147 మంది ఏఈలు, 190 సీఈలు, 380 మంది ప్రత్యేక సహాయకులుగా ఉపాధ్యాయులు, 16 మంది ఏసీఓలను నియమించారు.

- రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్‌లో ఒక మూల్యాంకన కేంద్రం. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బాలనగర్‌లో ఒక మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేశారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

పదో తరగతి పరీక్షా పత్రాలు దిద్దడంలో అలసత్వం వహించే ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరించాలని విద్యాశాఖ నిర్ణయించింది. స్పాట్ వాల్యుయేషన్‌లో అక్రమాలకు పాల్పడితే జరిమానాలు విధించడం, నోటీసులు జారీ చేయనుంది. ఒకటి నుంచి ఐదు తప్పిదాలు చేసే ఎగ్జామినర్లకు రూ. 500, స్పెషల్ అసిస్టెంట్లకు రూ. 200 జరిమానా విధిస్తారు. 6 నుంచి 10 తప్పిదాలకు ఎగ్జామినర్‌కు రూ.500, స్పెషల్ అసిస్టెంట్లకు రూ. 200, 11 నుంచి 20 తప్పులకు ఎగ్జామినర్లకు రూ.1000, స్పెషల్ అసిస్టెంట్లకు రూ.500, 21 నుంచి 30 పొరపాట్లకు ఎగ్జామినర్లకు రూ.1500, స్పెషల్ అసిస్టెంట్లకు రూ. 700లు, 30కి పైగా తప్పిదాలు చేస్తే రూ.2000 జరిమానాలు విధిస్తారు. 30 కంటే ఎక్కువ తప్పిదాలు చేస్తే శాశ్వతంగా మూల్యాంకనం నుంచి తప్పిస్తారు.

గంజాయి గుట్టు రట్టు

- ఎస్ఓటీ పోలీసుల దాడి
- 580 గ్రాముల గంజాయి, 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం
- ఇద్దరు నిందితుల రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

మొయినాబాద్: గంజాయి చాక్లెట్లు, గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 580 గ్రామాల గంజాయి (ప్యాకెట్లు), 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్న సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సౌరభ్‌కుమార్ యాదవ్ ఏడాదిగా మండలంలోని తోలుకట్ట గ్రామ శివారులో ఉంటూ మాణిక్యం వెల్డింగ్ షాపులో వెల్డింగ్ పని చేస్తున్నాడు. కొంత కాలంగా అతను బీహార్‌కు చెందిన సుబోధ్‌సింగ్ నుంచి గంజాయి, గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నాడు. సోమవారం రాత్రి నగరంలోని లంగర్‌హౌస్‌లో ఉంటూ జ్యూస్ మేకర్‌గా పని చేసే బీహార్‌కు చెందిన ముజ్తాబా అలీఖాన్ గంజాయి కొనుగోలు చేసేందుకు తోలుకట్టకు వచ్చాడు. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 92 గంజాయి చాక్లెట్లు, 580 గ్రాముల గంజాయి (చిన్న ప్యాకెట్లు), 5 సెల్‌ఫోన్లు, ప్యాకింగ్ మిషన్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని తెలిపారు.

సెల్‌ఫోన్లు ఇచ్చి గంజాయి కొనుగోలు..

సౌరభ్‌కుమార్‌యాదవ్ వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన ముజ్తాబా అలీఖాన్ సెల్‌ఫోన్ల దొంగ. నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో అతడిపై సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నాయి. చోరీ చేసిన సెల్‌ఫోన్లను ఇచ్చి గంజాయి కొనుగోలు చేసేవాడు. సోమవారం రాత్రి సైతం ఇదే తరహాలో గంజాయి కొనుగోలు చేస్తుండగా ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ



ఫిల్లింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఎండీ సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఆయన మణికొండ, నేతాజీ పార్క్, షేక్ పేట్ ఫిల్లింగ్ స్టేషన్ల పనితీరును పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్ బుక్స్‌ను పరిశీలించారు. ఫిల్లింగ్ స్టేషన్లలోని సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో ఆరా తీశారు. జీహెచ్‌ఎంసీ నుంచి వచ్చిన తాత్కాలిక డ్రైవర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో వీలైనంత ఎక్కువగా వాణిజ్య నీటి అవసరాల ట్రిప్పులు సరఫరా చేస్తే.. పెండెన్సీ లేకుండా చూసుకోవచ్చన్నారు.

జలమండలి గత నెలలో మొత్తం 1.69 లక్షల ట్యాంకర్ల నీటిని సరఫరా చేసింది. మార్చి 1న దినసరి ట్యాంకర్ బుకింగ్ సంఖ్య 4588 ఉండగా, 31 నాటికి వాటి సంఖ్య 6280 చేరింది.నెల చివరి నాటికి సుమారు 1700 ట్రిప్పులు అదనంగా సరఫరా చేసినట్లు జలమండలి పేర్కొంది. వేసవిని దృష్టిలో పెట్టుకుని.. ట్యాంకర్ డిమాండ్‌ను అంచనా వేసి జలమండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అందులో ట్యాంకర్లు, డ్రైవర్ల సంఖ్య పెంచుకోవడం, 3 షిఫ్టుల్లో పని చేయడం, రాత్రి వేళల్లో షిఫ్టు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించడం, అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, వాటర్ ఫిల్లింగ్ పాయింట్స్ తదితర చర్యలు చేపట్టింది. మొత్తం మీద గతేడాది మార్చిలో 79వేల ట్యాంకర్లు బుకింగ్ కాగా.. ఈ ఏడాది మార్చిలో మొత్తం 1.19 లక్షల బుకింగ్స్ వచ్చినట్లు జలమండలి పేర్కొంది.

నకిలీ కరెన్సీ కలకలం

- ముఠాను పట్టుకున్న పోలీసులు
- రూ.36 లక్షలు స్వాధీనం


నకిలీ కరెన్సీ కట్టలు

గన్‌ఫౌండ్రీ: నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.36,35,500 కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన పబ్బతి మురళీకృష్ణ (38) ఏపీలోని గుంటూరులోని ఓ హోటల్‌లో కిచెన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఇతనికి తమిళనాడుకు చెందిన ఫాదర్ మైకెల్ (38) హౌస్‌హోల్డ్ ఆర్టికల్స్ ద్వారా పరిచయమయ్యాడు. వీరిద్దరూ కలిసి నకిలీ కరెన్సీని తయారీ చేసేందుకు పటాన్‌చెరులో ఒక గదిని అద్దెకు తీసుకుని ముద్రణ ప్రారంభించారు. నకిలీ కరెన్సీని మార్కెట్‌లో విస్తృతంగా తీసుకువెళ్లేందుకు బేగంబజార్‌కు చెందిన హితేష్, దశరథ్ కుమార్, మాలి రాజారాం, ప్రవీణ్ కుమార్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వారికి లక్ష రూపాయల నకిలీ నోట్లను చెలామణి చేస్తే రూ.17 వేలు కమీషన్‌గా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విషయం పోలీసులకు విశ్వసనీయంగా తెలియడంతో బేగంబజార్‌లో నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.28 వేల నగదుతో పాటు రూ.36 లక్షల నకిలీ కరెన్సీ, 8 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, కంప్యూటర్స్, స్క్రీన్ ప్రింటింగ్ ఫ్రేమ్‌లు, నలుపు, తెలుపు, కలర్ ప్రింటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మురళీకృష్ణపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. నకిలీ కరెన్సీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.రష్మీ పెరుమాళ్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తింపు చిహ్నాలను గమనించాలని తెలిపారు. మార్కెట్లో నకిలీ కరెన్సీ వస్తే పోలీసులు, బ్యాంక్ అథారిటీ ప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలి

లిబర్టీ: ప్రతి పౌరుడు దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలని జేఏసీ చైర్మన్ ఉమాశంకర్ భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షులు కే.వీ.ఎస్.శర్మలు కోరారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని కులాలు, మతాలకు అతీతంగా ప్రతివ్యక్తి పరస్పర సహకారం చేసుకుంటూ.. జీవితం సాగించాలని సూచించారు. వారు మాట్లాడుతూ బైబిల్, ఖురాన్, భగవద్గీతలో ఉన్న సారాంశం ఒక్కటేనని వారు వివరించారు. దైవభక్తి దేశభక్తి మించింది మరోకటి లేదని దైవభక్తితో జీవనం సాగిస్తే ముక్తి మార్గంలో పయనిస్తారన్నారు.

క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: క్రికెట్ బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా హోర్డింగ్ ఏర్పాటు చేసిన నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని సిటీ సెంట్రల్‌మాల్‌కు ఐఎక్స్ బెట్.ఇన్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఈ హోర్డింగ్ బెట్టింగ్‌లను ప్రోత్సహించేలా ఉండటంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. సిటీ సెంట్రల్ మాల్ మేనేజర్ ఆసిం ముంతాజ్ సిద్దికీ, కుష్ అడ్వర్టైజింగ్ కంపెనీ సీనియర్ మేనేజర్ ఓలేటి శ్రీనివాసరావులపై ఐపీసీ సెక్షన్ 116, గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగ్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సీవరేజ్ గుంతలో పడిన వృద్ధుడి మృతి

సైట్ ఇన్‌చార్జి రిమాండ్

బంజారాహిల్స్: రక్షణ చర్యలు లేకుండా పనులు నిర్వహిస్తూ వృద్ధుడి మృతికి కారణమైన వ్యవహారంలో నిర్మాణ సంస్థకు చెందిన సైట్ ఇన్‌చార్జిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేట సమీపంలోని గులామ్ మహ్మద్ (78) అనే విశ్రాంత బీహెచ్ఈఎల్ ఉద్యోగి ఆదివారం సాయంత్రం మసీదులో ప్రార్థనలు ముగించుకుని హోండా డుయో బైక్‌పై టోలిచౌకి వైపు వెళ్తుండగా.. అండర్ గ్రౌండ్ సీవరేజ్ లైన్ కోసం తవ్విన భారీ గోతిలో పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఆయనను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహ్మద్ అమీర్ సయీద్ ఫిర్యాదు మేరకు సైట్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అభినందన



లిబర్టీ: భువనగిరి లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మాల మహానాడు జాతీయ కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నేత సదానందు కలిశారు. మంగళవారం ఆయనను కలిసి శాలువాతో సత్కరించి లోక్‌సభ టికెట్ కేటాయించినందుకు అభినందించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

గెలుపే ధ్యేయంగా పనిచేస్తాం



సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10 ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో జరిగిన సమావేశంలో పద్మారావుగౌడ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన పనులకు దిశా నిర్దేశం చేశామని, వాటిని ఖచ్చితంగా అమలుచేస్తామన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు మంచి మెజార్టీ తీసుకొచ్చే దిశలో పనిచేస్తామన్నారు. పద్మారావుగౌడ్ నీతి, నిజాయితీకి మారుపేరు అని, ఆయనను గెలిపించుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో సమర్థవంతమైన నేతకు పోటీ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

ఫ్లాగ్‌మార్చ్



ఖైరతాబాద్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఖైరతాబాద్ : శాంతి భద్రతలు, ప్రజల్లో నమ్మకాన్ని నింపేందుకు మంగళవారం సాయంత్రం ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఖైరతాబాద్ బడా గణేష్, ఖైరతాబాద్ సీఐబీ క్వార్టర్స్, మార్వాడి గల్లి, మార్కెట్ రోడ్డు, ఇందిరానగర్, శ్రీనివాస్‌నగర్, మారుతీనగర్, బీజేఆర్‌నగర్‌లలో ఏసీపీ ఆర్.సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

చీటింగ్ కేసులో నిందితుడి కోసం గాలింపు

బంజారాహిల్స్: భూమిపై పెట్టుబడి పేరుతో మోసానికి పాల్పడిన వ్యాపారి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం మేరకు..జూబ్లీహిల్స్‌కు చెందిన టి.రఘురాం వైజాగ్‌కు చెందిన శేషంరావు నిరంజన్ అనే వ్యక్తికి 2011లో చేబదులుగా రూ.37.5 లక్షలు ఇచ్చాడు. డబ్బులకు బదులు స్థలం ఇస్తానని చెప్పిన నిరంజన్ తనకు బీటీఎస్ గ్రీన్ ఫీల్డ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీటీఎస్ మైన్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ తన్మయి శేషం ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణవేణి గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వ్యాపార సంస్థలు ఉన్నాయని నమ్మించాడు. డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో రఘురాం నాంపల్లిలోని ఎనిమిదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన కోర్టు అతడికి 6 నెలల జైలు శిక్షతో పాటు డబ్బులకు రెట్టింపు ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు విధించిన షరతులు ఉల్లంఘించడంతో నిందితుడిని అరెస్టు చేసి తమ ఎదుట హాజరుపరచాలని న్యాయస్థానం ఇటీవల జూబ్లీహిల్స్ పోలీసులను ఆదేశిస్తూ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- ఈనెల 15 వరకు నూతన ఓటు నమోదు
- జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు



ఖైరతాబాద్ ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు మే 13న జరగనుండగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో హడావిడి మొదలైంది. ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమాల్లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌లు ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తూ.. పలు కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అధికారులు కూడా ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఓటర్లు చేయాల్సిందల్లా తమ ఓటు జాబితాలో ఉందో లేదో చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాను సరిచూసుకోవాలని చెబుతున్నారు. పొరపాటున ఓటు కూడా తొలగిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడే స్పందించి ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.

వెబ్‌సైట్: voters.eci.gov.in

ఓటు గల్లంతైతే ఆందోళన చెందాల్సిన పని లేదని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. పైన సూచించిన వెబ్‌సైట్‌లో ఫారం-6లోకి వెళ్లి పూర్తి వివరాలు నింపి ఆన్‌లైన్‌లో కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంది. మార్పులు, చేర్పులకు ఫారం-8, పేరు తొలగించుకునేందుకు ఫారం-7లో వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఏప్రిల్ 15 వరకు గడువు ఉంది.

అందుబాటులో జాబితాలు...

ఓటరు తుది జాబితా ఫిబ్రవరి 8న విడుదల చేశారు. వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచారు. మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంచడమే కాకుండా స్థానికంగా ఉండే బీఎల్‌ఓల వద్ద జాబితా ఉంటుంది. ఈనెల 15 వరకు గడువు ఉంటుంది. జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవడంతో పాటు పోలింగ్ బూత్, ఏరియా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో చూసి సిబ్బంది చెబుతున్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గ ఓటర్లు..

ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,96,383 మంది ఓటర్లు నమోదు కాగా.. పురుషులు 1,53,833, మహిళలు 1,42,516, ఇతరులు 34 మంది ఉన్నారు.

మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వకపోవడం బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పంజగుట్ట: రాష్ట్రంలో అతిపెద్ద కులమైన మాదిగ సామాజిక వర్గానికి న్యాయం చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగ కులస్తులకు ఒక్క ఎంపీ టికెట్ కూడా కాంగ్రెస్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ టికెట్ కాంగ్రెస్ ఇవ్వకపోవడంతో మాదిగ సమాజం కాంగ్రెస్‌కు దూరమయ్యే అవకాశం ఉందని, ఉద్యమ నాయకుడిగా తనకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్ అయినా కేటాయించి మాదిగ సామాజికవర్గం కాంగ్రెస్ వెంటే ఉండేలా చేసుకోవాలని సూచించారు. గతంలో కంటోన్మెంట్‌లో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తప్పకుండా కంటోన్మెంట్ టికెట్ తనకే కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

- ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని నీలి మార్చ్ నిర్వహించనున్నట్లు పిడమర్తి రవి ప్రకటించారు. బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

ఖమ్మంలో వర్సిటీని ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆ జిల్లాకు చెందిన ఓయూ అధ్యాపకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ డిపార్టుమెంట్‌లో జరిగిన సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ పోరాట సమితిని ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధిక భాగం ఏజెన్సీ ప్రాంతం అయినందున ఉన్నత విద్యలో వెనుకబడి ఉందన్నారు. వర్సిటీ ఏర్పాటుతో వెనుకబడిన వర్గాలు, ఆదివాసులు, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, ఎ.నాగేశ్వర్ రావు, రీసెర్చ్ స్కాలర్ నాగేశ్వర్‌రావు, వంశీధర్, అనురాధ పాల్గొన్నారు.

బహుజనుల చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్, రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ బహుజన ప్రజల చక్రవర్తి అని, మొగలుల పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన యోధుడని బీఆర్ఎస్ నేత రామన్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద మంగళవారం గడ్డం రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షులు చక్రవర్తిగౌడ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామన్‌గౌడ్ మాట్లాడుతూ.. పీడిత వర్గాల పోరాట యోధుడు, గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగురవేసిన గెరిల్లా పోరాడి గోల్కొండ సింహాసనాన్ని అధిష్టించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. కిషన్‌గౌడ్, రామ్‌మోహన్‌గౌడ్, పడాల శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్, సత్యం, వినోద్, ప్రియరాజ్, బీసీ నాయకులు నరేందర్‌గౌడ్, కోల జనార్దన్ తదితరులున్నారు

రహమత్‌నగర్ : ప్రజా రంజక పాలనపై తిరుగుబాటు జెండాను ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ కొనియాడారు. సర్వాయి పాపన్న 314 వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సైట్ టూ2లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, బబ్లూగౌడ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సైట్3లో ఇఫ్తార్ విందు..

సైట్3 ముస్లిం మైనారిటీ నాయకులు మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బాబాఫసీయుద్దీన్ పాల్గొన్నారు. సంతోష్, రహీమ్, రషీద్, ఆల్ ఖైదీతో పాటు డివిజన్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బాబా ఫసీయుద్దీన్

యూనివర్సిటీ కార్యాలయం ప్రారంభం



యూనివర్సిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పంజగుట్ట: నైపుణ్యాలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలరని గుజరాత్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.బీ.జడేజా అన్నారు. సోమాజిగూడలో మంగళవారం గుజరాత్‌కు చెందిన మార్వాడీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో అత్యుత్తమ విద్య మన విద్యార్థులకు ఎంతో అవసరమని దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసం

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తికి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించారు. వారు చెప్పినట్లుగానే బాధితుడు మొదటగా కొంత పెట్టుబడి పెట్టాడు. వాటికి లాభాలు వచ్చాయని నమ్మించారు. అనంతరం మరిన్ని లాభాల కోసం వెల్త్ మేనేజ్‌మెంట్‌లో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టమని బాధితుడికి చెప్పారు. బాధితుడికి ఏడాది పాటు వడ్డీ లేకుండా వర్చువల్ లోన్ ఇచ్చినట్లు చూపించారు. లాభాలకు ఆశపడి బాధితుడు రూ.21.7 లక్షలు డిపాజిట్ చేశాడు. అనంతరం బాధితుడు రూ.2.2 లక్షలను లాభంగా విత్‌డ్రా చేసుకున్నాడు. మరోసారి బాధితుడు రూ.7 లక్షలు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. ఆ డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో బాధితుడు రూ.19, 50,000 మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

పండ్లు కొనడానికి వచ్చిన వ్యక్తిపై దాడి..

వెంగళరావునగర్ : పండ్లు కొనడానికి వచ్చిన వ్యక్తిపై వ్యాపారి దాడి చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.ఎస్.వినయ్‌చంద్ ఈనెల 1న రాత్రి రాజీవ్‌నగర్ రోడ్-1 వద్ద ఉన్న పండ్ల దుకాణం వద్దకు వెళ్లి పండ్లను బేరమాడుతున్నారు. ఈ క్రమంలో దుకాణదారుడు ఆజామ్ అనే యువకుడు వినయ్‌చంద్‌పై అకారణంగా దాడి చేశాడు. ఈ దాడిలో వినయ్‌చంద్ కొంతసేపు స్పృహ కోల్పోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి అతడిని లేపి సముదాయించారు. అనంతరం అతడిని క్షమాపణ కోరమని అడగ్గా ఆజామ్ వినకుండా మరించ రెచ్చిపోయి తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడాడు.దీంతో వినయ్‌చందర్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు చోరీ

జువైనల్ హోమ్‌కు మైనర్లు

రహమత్‌నగర్ : ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఓ మైనర్ బాలుడు, అతడికి సహకరించిన మరో నలుగురు మైనర్లను బోరబండ పోలీసులు ఆరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తి తన ద్విచక్ర వాహనం దొంగతనం అయిందని మూడ్రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు మైనర్ బాలుడు దొంగతనం చేసినట్లు గుర్తించారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన మైనర్ బాలుడితో పాటు అతడికి సహకరించిన మరో నలుగురు మైనర్లను మంగళవారం జువైనల్ కోర్టులో హాజరు పరిచిన అనంతరం హోమ్‌కు తరలించారు.

6న 'పాటపై తూటా' సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ప్రజా గాయకుడు గద్దర్ పై కాల్పులు జరిపి 27 ఏళ్లు పూర్తయినా ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే పాటపై తూటా సమావేశం విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కొడుకు సూర్యకిరణ్, ఓయూ అధ్యాపకులు డాక్టర్ పరుశురామ్, డాక్టర్ ప్రేమయ్య, బాల కోటి, రవికుమార్, వినీతపాండే తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పర్యటన



రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులతో కేంద్రమంత్రి మాట్లాడారు. రహమత్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పేద ప్రజల సంక్షేమ కోసం కేంద్రం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.గౌతంరావు, లంకాల దీపక్‌రెడ్డి, కుంబాల గంగరాజు, భరత్‌గౌడ్, కొలన్ సత్యనారాయణ, ప్రేమ్, డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

సర్దార్ పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

శ్రీనగర్‌కాలనీ: సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ఎర్రగడ్డ డివిజన్ హేమావతినగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవిగౌడ్, రమేష్‌నాయక్, ఎర్ర కృష్ణకుమార్, ఆకాష్, మధుగౌడ్, యాకమ్మగౌడ్, నాగేందర్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, అరాచకాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అఖిల భారత గౌడ సంఘం కార్యదర్శి సీహెచ్.దీపాదేవిగౌడ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన దీపాదేవి మంగళవారం సోమాజిగూడలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని స్థాపించిన గొప్ప నాయకుడని, ఆయన ఆశయాలను నెరవేర్చడానికి, ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడానికి నేటితరం ముందుండాలని కోరారు.



భారీ శబ్దం వెలువరించే సైలెన్సర్లకు చెక్..



బంజారాహిల్స్: అధిక శబ్దంతో దూసుకెళ్తున్న వాహనదారులను గుర్తించి సైలెన్సర్లను మోడిఫైడ్ చేసిన ఘటనలో వారిపై జరిమానాలు విధించడమే కాకుండా అలాంటి సైలెన్సర్లను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు వాటిని దగ్ధం చేశారు. ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 47, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 89, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 25, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 200 మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించిన పోలీసులు వాటిని జేసీబీతో ధ్వంసం చేశారు. బైక్ ఒరిజినల్ సైలెన్సర్లను మార్చి అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను మోటార్ వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసుకుంటూ.. న్యూసెన్స్‌కు పాల్పడుతుండగా ఎక్కడికక్కడ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. ఈ వాహనాలను సీజ్ చేసి వాటి సైలెన్సర్లను తొలగించడమే కాకుండా ఒరిజినల్ సైలెన్సర్‌ను బిగించుకున్న తర్వాతనే సదరు వాహనదారుడికి అప్పగించారు. వీటివల్ల ఎదురయ్యే అనర్థాలను వారికి తెలియజేశామని పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్ తెలిపారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక





బంజారాహిల్స్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని లేక్‌వ్యూ బంజారాఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌కాన్, మహ్మద్ అజహరుద్దీన్, మోహన్‌యాదవ్, ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ షరీఫ్, ధన్‌రాజ్ రాథోడ్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ అజారుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ సీనియర్ నేత మోసిన్ ఖురేషి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌లు పాల్గొన్నారు. ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీకలని చెప్పారు. అసద్, రవిగౌడ్, ఆకాష్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా లోన్ తీసుకుని ఉడాయించిన సభ్యురాలు

వెంగళరావునగర్: డ్వాక్రా గ్రూపు సభ్యులందరికీ వచ్చిన నగదును తీసుకుని ఓ సభ్యురాలు ఉడాయించిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన వెస్ట్ శ్రీనివాస్‌నగర్ ప్రాంతానికి చెందిన చాపరాల కరీంరాణి గ్రూపు ఎస్ఎల్‌పీగా వ్యవహరిస్తుంది. ఇటీవల గ్రూపు సభ్యుల్లో ఒకరైన గౌరీ గ్రూపు తరఫున బ్యాంకు నుంచి రూ.2 లక్షల నగదును తీసుకుంది. వాస్తవానికి ఆ నగదును గ్రూపు సభ్యులందరికీ పంచాల్సి ఉంది. రెండువారాలైనా పంచకపోవడంతో గ్రూపు సభ్యులు ఆమె ఇంటికి వెళ్లారు. చుట్టుపక్కల వారిని విచారించగా.. గౌరీ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిందని తెలిపారు. గ్రూపు సభ్యులు ఆమెకు ఫోన్ చేసిన ప్రయోజనం లేదు. దీంతో విషయాన్ని సభ్యులు బ్యాంకు అధికారులకు తెలియజేశారు. మంగళవారం గ్రూపు సభ్యులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేను ప్రభావిత సమస్యలపై అవగాహన



సనత్‌నగర్: పేను ప్రభావంతో పిల్లల్లో ఉత్పన్నమయ్యే సమస్యలపై బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి మాట్లాడుతూ.. మెడికర్‌కు చెందిన హెయిర్ హైజీన్ మిషన్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 300 పాఠశాలల్లో మూడున్నర లక్షల మంది విద్యార్థులకు పేను సమస్య పరిష్కారాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ అండ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ అమూల్య మైసూర్ మాట్లాడుతూ.. తలలో పేనులు ఉండడం వల్ల పిల్లలు అసౌకర్యానికి గురవుతుంటారన్నారు. వేప, కొబ్బరి వంటి సహజ పదార్థాలు పేను సమస్యను పరిష్కరించడంలో దోహదం చేస్తాయన్నారు.

త్వరలో రాష్ట్రానికి జస్టిస్ చంద్రఘోష్ కమిషన్

- కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ
- కోల్‌కతాలో జస్టిస్ చంద్రఘోష్‌తో నీటిపారుదల శాఖ కార్యదర్శి భేటీ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రారంభించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ త్వరలో హైదరాబాద్‌కు రానున్నారు. నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ మంగళవారం కోల్‌కతాలో జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో సమావేశమై విచారణ ప్రారంభించే అంశంపై చర్చించారు. బ్యారేజీలపై న్యాయ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతోపాటు విధివిధానాలను ఆయనకు సమర్పించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని, విచారణ ప్రారంభించడానికి షెడ్యూల్ అందజేయాలని కోరారు. ఈ నెల రెండో వారంలో జస్టిస్ చంద్రఘోష్ హైదరాబాద్‌కు వచ్చి విచారణ ప్రారంభించేందుకు అవకాశముంది.

8న 'కాళేశ్వరం'పై విచారణ

ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని సీబీఐకి అప్పగించాలని పిటిషన్లు

- నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్‌ను కలిపి వింటామన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం.. మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లలో వాదనలను సోమవారం(ఈనెల 8న) వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్లలో ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు పిటిషన్ల తరఫు న్యాయవాదులకు చెబుతూ.. విచారణను వాయిదా వేసింది. మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చేందుకు.. పూర్తి అంశంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది.

'జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలి. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)తో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలి. మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తేనే కుంగుబాటుకు అసలు కారణాలు బట్టబయలవుతాయి. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్ల భద్రతకు వీలుగా చర్యలు చేపట్టేలా నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వాలి' అని కోరుతూ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, కాంగ్రెస్ నేత బక్క జడ్సన్‌తో పాటు మరో ఇద్దరు పిటిషన్లు(4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్) దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

ప్రభుత్వ నిర్ణయం తెలుసుకుని చెప్పండి

సీబీఐకి అప్పగించే విషయం, పిటిషనర్ల వాదనపై ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకొని చెప్పాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) ఇమ్రాన్ ఖాన్ ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయాన్ని ఏఏజీ.. ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పార్టీ ఇన్ పర్సన్ (అతనే వాదనలు వినిపిస్తారు)గా కేఏ పాల్ వాదిస్తూ వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అయితే ప్రభుత్వ వాదన కూడా వినాల్సి ఉన్నందున ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. తమ వాదనలు వినాలని పాల్, ఇతర పిటిషనర్ల లాయర్లు కోరగా ధర్మాసనం నిరాకరించింది. వ్యాజ్యాలను ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్నామంటూ విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. గతేడాది ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ప్రాజెక్టును సందర్శించి మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగిపోవడానికి కారణాలపై ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ నివేదికను గత నెల విచారణ సందర్భంగా ప్రభుత్వం.. ధర్మాసనం ముందు ఉంచింది.

షీట్ పైల్స్‌కు బదులు సెకెంట్ పైల్స్

- నీటిపారుదల శాఖ సూచనలే కారణం
- నిపుణుల కమిటీకి అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ వెల్లడి
- కటాఫ్, క్రాస్ కటాఫ్ నిర్మాణంలో సైతం ఉల్లంఘనలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాదుల) కింద రక్షణగా షీట్ పైల్స్‌ను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) జారీ చేసిన డిజైన్లకు విరుద్ధంగా సెకెంట్ పైల్స్‌ను ఏర్పాటు చేయడానికి ఆ శాఖ జారీ చేసిన సూచనలే కారణమని ..నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్' తెలిపింది. 2017 ఫిబ్రవరి 4న నీటిపారుదల శాఖ రామగుండం డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెకెంట్ పైల్స్‌ను వాడాలని లేఖ రాశారని.. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీకి తెలిపింది. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం కోసం ఈ కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

2019లోనే ప్రమాద ఘంటికలు

సీడీఓ ఇచ్చిన డిజైన్లను ఉల్లంఘించి బ్యారేజీ రెండో బ్లాక్‌కి సంబంధించిన ఎగువ కటాఫ్ వాల్స్‌ను నిర్మించినట్టు నిర్మాణ సంస్థ అంగీకరించింది. అయితే, సంబంధిత ఇంజనీర్ నుంచి ఇందుకు ఆమోదం తీసుకున్నట్టు తెలిపింది. క్రాస్ కటాఫ్ వాల్స్ నిర్మాణంలో సైతం డిజైన్లను ఉల్లంఘించినట్టు తెలిపింది. 2019 వరదల సందర్భంగా బ్యారేజీ పూర్తిగా నిండిఉండగా, గేట్లను తక్కువ ఎత్తులో పైకి ఎత్తి వరదను వదలడంతో దిగువన రక్షణగా ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోయాయని నిర్మాణ సంస్థ తెలిపింది. ఈఎన్‌సీ రామగుండం విజ్ఞప్తితో మళ్లీ వాటిని పునరుద్ధరించినప్పటికీ, ఆ తర్వాతి కాలంలో వచ్చిన వరదల్లో మళ్లీ కొట్టుకుపోయాయని, 2019 వరదల సమయంలోనే బ్యారేజీ ప్రమాద ఘంటికలు మోగించిందంటూ నిపుణుల కమిటీ అడిగిన ఓ ప్రశ్నకు నిర్మాణ సంస్థ బదులిచ్చింది. కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతంలో లోతైన గుంతలు పడి బ్యారేజీ పునాదుల కింద ఏర్పాటు చేసిన సెకెంట్ పైల్స్‌కి నష్టం కలిగించాయని తమ పరిశీలనలో తేలినట్టు వెల్లడించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిలో నీటి నిల్వకు ఏర్పాట్లు లేకపోవడంతోనే ఇలా జరిగిందని వివరించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిల్లో నీళ్లు నిల్వ ఉండేలా ప్రత్యామ్నాయ టెయిల్ పాండ్ వంటి నిర్మాణాన్ని చేపట్టాలని మోడల్ స్టడీస్ నిర్వహించిన నిపుణులు చెప్పినట్లు తెలిపింది.

బ్యారేజీలో నీళ్లు నిల్వ చేయరాదు

బ్యారేజీకి శాశ్వత రక్షణ చర్యలు తీసుకునే వరకు నీటిని నిల్వ చేయరాదని నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది వచ్చే వరదను ఎప్పటికప్పుడు వదిలేయాలని సూచించింది.

ముక్కలు చేసి.. మూసీలో పడేసి!

▶ మొదటి పేజీ తరువాయి

పొందుపరిచారు. మంగళవారం వీరిద్దరిని గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శనివారం వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ప్రణీత్‌రావు దారికి వచ్చాడంటూ...

ఈ కేసులో తొలి అరెస్టు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుదే. తొలుత పోలీసు విచారణకు అతడు సహకరించలేదని, అయితే రానురాను సహకరిస్తూ కీలక వివరాలు వెల్లడించారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు రాజీనామా చేసిన రోజే (గత ఏడాది డిసెంబర్ 4న) ఆయన ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న టీఎస్ఎస్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కైతోజు కృష్ణతో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలు ఆఫ్ చేయించాడు. వార్‌రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. తనతో వచ్చిన ఎలక్ట్రీషియన్‌తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ముక్కలు చేశాడు. వీటి శకలాలను నాగోలు వద్ద మూసీనదిలో పారేశాడు. ఈ విషయాలు వెలుగులోకి రావడంతోనే అప్రమత్తమైన సిట్ అధికారులు మూసీలో సోదాలు చేశారు. వీరికి ధ్వంసమైన హార్డ్‌డిస్క్ కేసులు 5, హార్డ్‌డిస్క్ ముక్కలు తొమ్మిది లభించాయి. వీటితో పాటు తాము మూసీ నుంచే ఆరు మెటల్ హార్డ్‌డిస్క్ ముక్కల్నీ సీజ్ చేశామని కోర్టుకు తెలిపారు.




వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి నిందితులు తిరుపతన్న, భుజంగరావు

ఎస్ఐబీ కార్యాలయం నుంచి ఆధారాలు

ప్రణీత్‌రావు వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు మూసీనది నుంచే కాకుండా గ్రీన్‌లాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయం, దాని ఆవరణ, పరిసరాల నుంచి కొన్ని ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు సేకరించారు. అక్రమ ట్యాపింగ్‌కు వినియోగించిన 12 కంప్యూటర్లు, 7 సీపీయూలు, ల్యాప్‌టాప్, మానిటర్లు, పవర్ కేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఎలక్ట్రీషియన్ గదిలో క్లూస్, ఫోరెన్సిక్ అధికారులతో కలిసి సోదాలు చేసిన సిట్.. హార్డ్‌డిస్క్‌లు కట్ చేస్తున్నప్పుడు కింద పడి, మూలలకు చేరిన వాటి పొడిని సీజ్ చేశారు. ఎస్ఐబీ కార్యాలయ ఆవరణలో పాక్షికంగా కాలిన డాక్యుమెంట్లు, స్పైరల్ బైండింగ్ చేసిన పత్రాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీకి సంబంధించిన లాగ్‌బుక్ ప్రతులను పోలీసులు సేకరించారు. ఎస్ఐబీ కానిస్టేబుల్ కొత్త నరేష్‌గౌడ్ నుంచి వాంగ్మూలం నమోదు చేశారు.

ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌కు నోటీసులు?



అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌రావుకు సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఎస్ఓటీలో పని చేయడానికి తన నమ్మిన బంటుల్ని నియమించుకోవాలని ప్రభాకర్‌రావు భావించి నల్లగొండ నుంచి ప్రణీత్, రాచకొండ నుంచి భుజంగరావు, సైబరాబాద్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి తిరుపతన్నలకు అవకాశం ఇచ్చారు. వీరు ఎస్ఐబీతో పాటు మరో మూడు ప్రాంతాల్లో సర్వర్లు ఏర్పాటు చేసి సాంకేతిక నిఘా కొనసాగించారని తెలిసింది. ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించడానికి వేణుగోపాలరావును విచారించాలని సిట్ నిర్ణయించుకుంది. దీంతో బుధవారం బంజారాహిల్స్ ఠాణాలో విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో వేణుగోపాల్‌రావు పేరును సిట్ అధికారులు పొందుపరిచారు. వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన వేణుగోపాల్ 1989లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. చిగురుమామిడి, కరీంనగర్ రూరల్, జమ్మికుంట ఠాణాల్లో పని చేస్తుండగా అనేక వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారు. 2013లో డీఎస్పీ పదోన్నతి పొంది పెద్దపల్లి, సైబరాబాద్ క్రైమ్స్, ఎల్బీనగర్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఎస్ఐబీలో అదనపు ఎస్పీ హోదాలో దాదాపు ఏడేళ్లు పని చేసి పదవీ విరమణ పొందారు. ఆపై ప్రభాకర్‌రావు సహకారంతో ఓఎస్డీగా కొనసాగారు.

అత్తింటి ఆరళ్లకు ముగ్గురు బలి

- ఏడాది బిడ్డను చంపి.. తల్లి ఆత్మహత్య
- కూతురు, మనవడి మృతితో అమ్మమ్మ బలవన్మరణం
- కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో విషాదం



శ్రీజ, రేయాన్స్ మృతదేహాలు

కరీంనగర్ రూరల్: అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులను తట్టుకోలేక ఏడాది బిడ్డకు విష గుళికలు ఇచ్చి చంపిందా తల్లి. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని తట్టుకోలేక మృతురాలి తల్లి సైతం ఆత్మహత్యకు పాల్పడింది. ఒకేరోజు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతితో కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో తీరని విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మకల్ గ్రామ పంచాయతీ విజయ్‌నగర్‌కాలనీలో ఉంటున్న ఉపాధ్యాయ దంపతులు గద్దె వెంకటేశ్వరచారి- జయప్రద(55) తమ చిన్న కూతురు శ్రీజ(25)కు మూడేళ్లక్రితం వరంగల్ జిల్లా మొగ్దుంపూర్‌కు చెందిన నరేశ్‌తో కట్నకానుకలతో వివాహం జరిపించారు. ఏడాదిపాటు సక్రమంగా కాపురం చేసిన నరేశ్... కొడుకు ఆర్యన్(1) పుట్టాక శ్రీజను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. అత్తమామలు సుజాత-కేశవచారి హింసించడంతో శ్రీజ గత నెల 29న బొమ్మకల్‌లోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం ఉదయం 6గంటలకు కొడుకు మొదటి బర్త్‌డే గురించి నరేశ్‌కు శ్రీజ ఫోన్ చేయడంతో అత్తమామలు, భర్త కలిసి తీవ్రంగా దూషించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీజ క్రిమిసంహారక మాత్రలను కొడుకు ఆర్యన్‌కు తాగించి ఆ తర్వాత తానూ వేసుకుంది. అపస్మారకస్థితిలో పడి ఉన్న తల్లి, కొడుకులను జయప్రద, వెంకటేశ్వరచారి అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బిడ్డ మృతిచెందగా శ్రీజ చికిత్స పొందుతూ చనిపోయింది. కూతురు, మనవడి మృతిని తట్టుకోలేక జయప్రద ఇంటికివెళ్లి క్రిమిసంహారక మాత్రలు వేసుకుంది. ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

నగర వార్తలు

5న పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ప్రత్యేక ప్రార్థనలు

హిమాయత్‌నగర్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి నిరసనగా పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫ్రంట్ నాయకులు తెలిపారు. నగరంలోని అన్ని మసీదుల్లో రంజాన్ మాసం చివరి శుక్రవారం అయిన ఈ నెల 5న నల్ల బ్యాడ్జీలను ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, సనావుల్లాఖాన్ తదితరులు మాట్లాడుతూ 72 ఏళ్లుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతూనే ఉందని, ఆరు నెలలుగా ఈ దాడులు తీవ్రమయ్యాయన్నారు. అమెరికా తదితర సంపన్న దేశాల అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి పాల్పడుతుందని ఆరోపించారు. ఈ దాడులపై భారతదేశం స్పందించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ఫ్రంట్ ప్రతినిధులు మహ్మద్ అబ్దుల్, షకీల్, ఎం.ఎం.షరీఫ్, అహ్మద్ హీమాదీన్, నయీముల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఫైనాన్స్ ఏసీగా గీతా రాధిక

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఫైనాన్స్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా బి.గీతా రాధిక నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ విభాగం బాధ్యతలు నిర్వహించిన రిటైర్డ్ అధికారి డి.జయరాజ్ కెనెడీని రిలీవ్ చేసిన కమిషనర్ రోనాల్డ్‌రాస్.. ఆయన బాధ్యతల్ని ఎస్టేట్స్ విభాగం అడిషనల్ కమిషనర్, ఫైనాన్స్ విభాగం జేసీగా ఉన్న గీతా రాధికకు అప్పగించారు. ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా ఉన్న కోట శ్రీవాత్సవకు ఎస్టేట్స్, హెరిటేజ్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో రిటైరయ్యాక కొనసాగుతున్న వారిని తొలగించాల్సిందిగా ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం ముగియగానే ఫైనాన్స్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతున్న కెనెడీ సేవల్ని నిలిపివేసి రిలీవ్ చేశారు.

సరదా ఆట.. పతకాల వేట..



నగరంలో విస్తరిస్తున్న క్రీడాభిరుచి

- గృహిణులు, ఉద్యోగుల్లోనూ ఆటలపై ఆసక్తి
- సరదా ఆట నుంచి సీరియస్ ప్లేయర్లుగా మారుతున్న వైనం
- దోహదం చేస్తున్న సరికొత్తశైలి, వన్‌స్టాప్ క్రీడా ప్రాంగణాలు



సాక్షి, సిటీబ్యూరో: పిన్న వయసు నుంచే క్రీడలను సీరియస్‌గా తీసుకుంటూ శిక్షణ పొందుతూ అంచలంచెలుగా ఎదగడం ఎప్పటి నుంచో చూశాం. అయితే సరదాగా ఆటలు ఆడడం ప్రారంభించి సీరియస్ ప్లేయర్స్‌గా మారిపోవడం మాత్రం ఇప్పుడిప్పుడే చూస్తున్నాం. ఇటీవల హైదరాబాద్ వంటి నగరాల్లో ఏర్పాటవుతున్న హాబీ స్పోర్ట్స్ సెంటర్స్...ఈ తరహా క్రీడాకారుల తయారీ కేంద్రాలుగా అవతరిస్తున్నాయి.

ఒకప్పుడు ఏదైనా క్రీడలో రాణించాలనుకుంటే... ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టేడియంలు, శిక్షణా కేంద్రాలు ఎంచుకునేవారు. అయితే గత కొంత కాలంగా కేవలం హాబీగా ఆటలు ఆడేవారి కోసం, వ్యాయామ సాధనంగా ఆటలను ఎంచుకునేవారి కోసం సైతం... అత్యాధునిక క్రీడా ప్రాంగణాలు ఏర్పాటవుతున్నాయి. తొలిదశలో టెన్నిస్ కోర్ట్స్, ఫుట్ బాల్ టర్ఫ్స్... ఇలా ఏదో ఒక ఆటకు సంబంధించినవి మాత్రమే ప్రత్యేకించినవి నగరంలో ఉండేవి. ఇప్పుడు అరడజనుపైగా ఆటలను ఒకే ప్రాంగణంలో ఆడుకునేందుకు అవకాశం కల్పించే విశాలమైన స్పోర్ట్స్ సెంటర్లు వెలుస్తున్నాయి.

ఉద్యోగుల నుంచి గృహిణుల దాకా...

ఈ తరహా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లకు తొలుత కార్పొరేట్ ఉద్యోగులు మాత్రమే మహరాజ పోషకులు కాగా ఇప్పుడు విద్యార్థులు, వ్యాపారులు, గృహిణులు సైతం వీటిని సందర్శిస్తున్నారు.

కుటుంబ సమేతంగా మాల్స్, థియేటర్లకు, పబ్స్‌కి వెళ్లడం లానే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు వచ్చి... వచ్చి వేర్వేరు ఆటల్ని ఎంజాయ్ చేసి వెళ్లడం అనేది ఇప్పుడు కొత్త ట్రెండ్. ఒకే చోట పలు రకాల ఆటలు ఆడుకునేందుకు అవసరమైన కోర్టులు, వ్యాయామం చేసేందుకు జిమ్, కాఫీ,టీ,జ్యూస్‌లతో సేదతీరేందుకు కెఫేలు...ఇవన్నీ కలిపిన వన్ స్టాప్ స్పోర్ట్స్ సెంటర్స్‌కి నగరంలో ఆదరణ పెరుగుతోంది.

సరదాగా మొదలుపెట్టి... స్క్వాష్ లో జాతీయస్థాయి క్రీడాకారిణిగా...



విద్యార్థినిగా ఏదైనా ఆటలో ప్రావీణ్యం సాధించాలని టేబుల్ టెన్నిస్, చెస్ వంటివి ఆడుతూ ఎంజాయ్ చేస్తుండేదాన్ని. అదే క్రమంలో స్క్వాష్ కూడా ట్రై చేశాను. స్వల్పకాలంలోనే పూర్తిగా దానిపైనే దృష్టి నిలిపాను. మంచి శిక్షణ, ప్రోత్సాహం లభించడంతో వేగంగా ప్రావీణ్యం సాధించి రాష్ట్రం తరపున జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాను. గత ఐదేళ్లలో సాధించిన అనేక విజయాలు, పతకాలు ఏర్పరచిన సరికొత్త జీవిత లక్ష్యం దిశగా సాగిపోతున్నాను. సరదాగా అయినా, సీరియస్‌గా అయినా ఆటల్ని ఎంచుకోవడం ఆరోగ్యానికి మంచి చేయడం మాత్రమే కాదు ఒక్కోసారి జీవితంలో అనూహ్యమైన మార్పుల్ని కూడా తెస్తుందనేది నా అనుభవం. -సాన్వి శ్రీ, జాతీయస్థాయి స్క్వాష్ క్రీడాకారిణి

కరోనా తర్వాత క్రీడాసక్తి పెరిగింది..



గతంలో ప్రొఫెషనల్స్‌కు మాత్రమే క్రీడలు పరిమితం అన్నట్టు ఉండేది. అయితే హాబీగా కూడా ఆటల్ని ఎంచుకోవడం గత పదేళ్ల కాలంలో పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా కరోనా తర్వాత పెరిగిన ఆరోగ్యస్పృహ ఆటలపై ఆసక్తిని పెంపొందించింది. మాకు కరోనా ముందు వందల సంఖ్యలో మాత్రమే సభ్యులు ఉండగా, కరోనా అనంతరం ప్రతి సెంటర్‌లోనూ అది వేలకు చేరింది. గత ఆరేళ్లలో అరడజను పైగా ఇలాంటి సెంటర్లు నగరంలో నెలకొల్పాం. రానున్న కాలంలో నగరంలో ప్రతి ఇంటి నుంచీ ఒక్కరైనా క్రీడాకారుడు/క్రీడాకారిణి వచ్చే స్థాయికి చేరుకునేందుకు అందరం మన వంతు కృషి చేయాలి.
-ఆదిత్య, గేమ్ పాయింట్ నిర్వాహకులు, మాదాపూర్

కాంగ్రెస్ మాదిగ వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుంది

మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వుడ్ మూడు స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకుండా మాదిగలకు వ్యతిరేక పార్టీ అని తనకుతానే రుజువు చేసుకుందని ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాష్ట్ర జనాభా లెక్కల నుంచి తొలగించిందని, ఎస్సీల్లో 100కు 70 శాతం ఉన్న మాదిగలను పక్కనపెట్టి 25 శాతం ఉన్న మాలలకు, ఊరికి ఒక్కరు కూడా లేని బైండ్ల సామాజిక వర్గాలను దగ్గరకు తీసిందన్నారు. మాదిగలకు కాంగ్రెస్ చేసిన ద్రోహానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో, 119 నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో 10 రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉంటే ఎస్సీ రిజర్వుడ్ 3, ఎస్టీ రిజర్వుడ్ 2 పోగా మిగిలిన 12 స్థానాల్లో ఇప్పటికే ఆరు స్థానాలు రెడ్డి సామాజికవర్గానికే కేటాయించారని, ఇంకా ప్రకటించబోయే స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ముందజలో ఉన్నారన్నారు. మాదిగలతో పాటు, బీసీలను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ, బీసీలు సంఘటితమై ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాజీనామా చేయకుండా పార్టీలు మారితే రాళ్లతో కొట్టి చంపండి అన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు కడియం శ్రీహరిని రాజీనామా చేయకుండా ఎలా పార్టీలోకి తీసుకున్నాడని, ఇప్పుడు రాళ్లతో కడియంను కొట్టాలా రేవంత్‌ను కొట్టాలా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి విలువలు లేని రాజకీయాలు, విధానాలు లేని రాజకీయాలు చేస్తున్నారన్నారు. తాను గత 40 సంవత్సరాలుగా ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశానని ఇంతగా రెడ్డి కులతత్వ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. కడియం శ్రీహరి వరంగల్‌లో ప్రెస్‌మీట్ పెట్టి తాను లేనిదే మందకృష్ణ లేడని అంటున్నాడని ఆయన ఎమ్ఆర్‌పీఎస్‌కు సహకరించింది తక్కువ ఉద్యమ ద్రోహం చేసింది ఎక్కువ అన్నారు.

ఇఫ్తార్ విందులు దైవభక్తికి నిదర్శనం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్, ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: ఇఫ్తార్ విందులు దైవభక్తికి, క్రమశిక్షణకు నిదర్శనమని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం గొల్కొండ చోటాబజార్‌లో మజ్లిస్ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం వారిలోని దైవ భక్తికి నిదర్శనమని అన్నారు. ఇఫ్తార్ స్థానికులు, యువకుల మధ్య వారధిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ నాయకుడు హారూన్ ఫరాన్, పాషాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ ఆత్మీయ పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో డాక్టర్ కేవీ రమణాచారి, జీవీ రెడ్డి తదితరులు

చిక్కడపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవీఆర్ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ఎంపిక చేసిన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. జీవీఆర్ సాహితీ కిరణం సౌజన్యంతో నిర్వహించిన పోస్ట్‌కార్డ్ కథల పోటీ విజేతలకు నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారిణుల కూచిపూడి ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో రామరాజు శ్రీనివాసరావు, జి.వెంకటరెడ్డి, చిల్లా రాజశేఖర్‌రెడ్డి, సి.రామకృష్ణ, లంకా లక్ష్మీనారాయణ, కాంతికృష్ణ, విజయలక్ష్మీ, రామరాజు, లక్ష్మీశ్రీనివాస్, రాఘవరెడ్డి, సినీగీత రచయిత మౌనశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన లక్ష్మీ సామ్రాజ్యం



బంగారు పతకాన్ని సాధించిన లక్ష్మీ సామ్రాజ్యం

వెంగళరావునగర్: గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరిగిన ఉత్తర అమెరికా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన నర్రా లక్ష్మీ సామ్రాజ్యం కటా నాంచాక్ విభాగంలో అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించింది. ఈమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా గొట్లగట్టు గ్రామం. కాగా గత కొన్నేళ్ళుగా నగరంలోనే స్థిరపడ్డారు. రుద్రమదేవి సెల్ఫ్ అకాడమీని ఏర్పాటు చేసి వివిధ రంగాలకు చెందిన మహిళలకు కరాటే పోటీల్లో శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం పోలీసు డిపార్ట్‌మెంట్ షీ టీమ్‌లో మెంబర్‌గా నియమించింది. నగరానికి చెందిన షీ టీమ్‌లోని అనేకమంది మహిళా కానిస్టేబుల్స్‌కు కూడా ఇప్పటికీ శిక్షణ అందిస్తున్నారు. కాగా ఈ పతకాన్ని సాధించడంలో తనకు ప్రత్యేకంగా శిక్షణ అందించిన కటా నాంచాక్ గోల్డ్‌మెడలిస్ట్ డాక్టర్ వి.రవి కృషి మరువలేనిదన్నారు. కాగా లాస్‌వెగాస్‌లో జరిగిన కరాటే పోటీల్లో వివిధ దేశాలకు చెందిన దాదాపు రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో లక్ష్మీ సామ్రాజ్యంకు ప్రథమ బహుమతిగా బంగారు పతకం లభించింది. ఈ సందర్భంగా పలువురు షీ టీమ్ సభ్యులు ఆమెను అభినందించారు.

‘నా దేహం నా ఇష్టం. నాకు ఇష్టమైనవి తింటాను’... అనుకోవడంలో ఇతరులకు ఎటువంటి అభ్యంతరమూ ఉండాల్సిన అవసరం లేదు. కానీ సమాజంలో గౌరవంగా జీవించాలంటే మనం తినే ఆహారం ఆరోగ్యకరంగా ఉండాలి. వినడానికి విచిత్రంగా ఉన్నా సరే ఇది నిజం. ప్రతి ఒక్కరూ ‘పోషకాహారం తీసుకోవాలి, దేహానికి అవసరమైనంత మాత్రమే తీసుకోవాలి. దానికి తగినట్లు వ్యాయామం చేయాలి’... దైనందిన జీవితం ఇలా క్రమబద్ధంగా ఉన్న వ్యక్తి ఆలోచనలు ఆరోగ్యకరంగా ఉంటాయి. ప్రవర్తన కూడా గౌరవపూర్వకంగా ఉంటుంది. స్థూలంగా చెప్పినా సూక్ష్మంగా చెప్పినా, విషయం ఏమిటంటే... ఆరోగ్యకరమైన దేహం ఆరోగ్యకరంగా ఆలోచిస్తుంది. మానసిక ఆరోగ్యంలో అపసవ్యతలు తలెత్తాయంటే అవి కేవలం మానసికం మాత్రమే కాదు, అసలైన సమస్య దేహంలోనే ఉంటుంది. దేహానికి అందుతున్న ఆహారంలోనే ఉంటుంది... అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితా గుప్తా.


ప్రతీకాత్మక చిత్రం

ఆకలికి అలవాటుకి తేడా ఉంది

ఇదో మైండ్‌గేమ్!

‘‘సమాజంలో మంచి వ్యక్తిగా చలామణి కావాలంటే మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసిక ఆరోగ్యం మీద మన అలవాట్లు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. మనకు తెలియకుండా చేసే పొరపాటు ఏమిటంటే ‘ఆకలి– అలవాటు’ మధ్య తేడా గుర్తించకపోవడం. ఆకలి లేకపోయినా అలవాటుగా తినడం, ఒత్తిడిలో ఉన్నప్పుడు దాన్నుంచి తప్పించుకోవడానికి ఆహారాన్ని ఆశ్రయించడం అనే దురలవాటు ఎప్పటి నుంచో ఉంది, కానీ ఇటీవల ఎక్కువైంది. దైనందిన జీవితంలో ఒత్తిడి ఎక్కువైంది, జిహ్వను సంతృప్తి పరుచుకోవడానికి జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లడం అనేది కూడా మన జీవనశైలిలో భాగమైపోయింది. నిజానికి మన మెదడు మనతో గేమ్ ఆడుతుంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిసినప్పటికీ మనసు జంక్‌ఫుడ్ మీదకు మళ్లిస్తుంది. ఇదెలాగంటే... రేపటి నుంచి వ్యాయామం మొదలు పెట్టాలని నిర్ణయం తీసుకుని అలారం పెట్టుకుంటాం. అలారం మోగినప్పుడు ఆపేసి మళ్లీ నిద్రపోతాం. మన జీవనశైలికి అనుగుణంగా మన మెదడులో మ్యాపింగ్ జరిగిపోయి ఉంటుంది. దాని నుంచి బయటపడడానికి మెదడు ఇష్టపడదు. ఆ కంఫర్ట్ జోన్ నుంచి మనల్ని కూడా బయటకు రానివ్వదు. అలాంటప్పుడు మనం మెదడు మాటను పెడచెవిన పెట్టడమే పరిష్కారం. మనల్ని మనం దురలవాట్ల నుంచి బయటేసుకోవాలంటే ఆ ప్రయత్నంలో మనల్ని వెనక్కి లాగే మెదడు చెప్పే మాటను వినకూడదు.

ఆహారం-మానసిక అనారోగ్యం!

మనం అలవాటుగా నిత్యం జంక్‌ఫుడ్‌తో పొట్టను నింపేస్తుంటే దేహం శక్తిహీనమవుతూ ఉంటుంది. అలసటతోపాటు ప్రతిదానికీ చిరాకు, ఆందోళన, ఆవేశపడడం వంటి లక్షణాలు తోడవుతాయి. మెదడు నుంచి నాడీ వ్యవస్థ ద్వారా దేహభాగాలకు అందాల్సిన సంకేతాల్లో అపసవ్యతలు తలెత్తుతాయి. ఒక విషయానికి సక్రమంగా ప్రతిస్పందించాల్సిన సందర్భంలో విపరీతంగా స్పందించడం వంటి మార్పులు కనిపిస్తాయి. మానవ సంబంధాలు దెబ్బతింటాయి. మానసిక సమస్యలు తీవ్రరూపం దాల్చినప్పుడు మాత్రమే మానసిక వైద్యుని సంప్రదిస్తుంటాం. ప్రతి ఒక్కరిలో సమస్య అంతటి స్థాయి తీవ్రతకు దారితీయదు. కానీ మధ్యస్థ దశ ఎక్కువ మందిలో కనిపిస్తుంటుంది. ఈ సమస్యకు వైద్యం... మనం మంచి ఆహారం తీసుకోవడమే. బ్రెయిన్ మనతో ఆడుకుంటుంది, మనం బ్రెయిన్‌ని మన అధీనంలో ఉంచుకోగలగాలి. అదే దేహానికి–మెదడుకు సమగ్రమైన ఆరోగ్యం. మనం ఏమి తింటున్నామో దానిని బట్టి మనం ఏమిటో చెప్పవచ్చు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువెళ్లగలిగితే సమాజం ఎదుర్కొంటున్న అనేక మానసిక రుగ్మతలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన బంధాలతో అందమైన సమాజాన్ని నిర్మించడానికి నా వంతుగా చేస్తున్న ప్రయత్నమే ఇది’’ అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితాగుప్తా.

– వాకా మంజులారెడ్డి,
‘సాక్షి’ ఫీచర్స్ ప్రతినిధి

వార్ధక్యం పొంచి ఉంటుంది

బాడీ–మైండ్‌ని కలిపి ఒక యూనిట్‌గా పరిగణించాలి. ఒకటి ప్రమాదంలో పడితే రెండవది కూడా ప్రమాదంలో పడుతుంది. దేహం సమతుల ఆరోగ్యంతో ఉన్నప్పుడే మెదడు కూడా సంపూర్ణారోగ్యంతో ఉంటుంది. దేహానికి సంతులిత ఆహారం అందనప్పుడు తలెత్తే సమస్యలు మానసిక అపసవ్యతలు మాత్రమే కాదు వార్ధక్యం కూడా. త్వరగా వయసు మీద పడుతున్న వారిలో దేహానికి పోషకాహారం తగిన మోతాదులో అందకపోవడంతోపాటు చిన్న చిన్న మానసిక రుగ్మతలతో సతమతమైన నేపథ్యం కనిపించి తీరుతుంది. ఇది అంతర్జాతీయంగా నిర్వహించిన అధ్యయనం. జంక్‌ఫుడ్ కారణంగా ఎదురయ్యే సమస్య స్థూలకాయం మాత్రమే కాదు మానసిక అనారోగ్యాలు కూడా. దేహం లోపల ఇన్‌ఫ్లమేటరీ కండిషన్‌కు దారి తీస్తుంది. అది దేహం వార్ధక్యం బారిన పడడానికి తొలి దశ.

– సుస్మితా గుప్తా,
హెల్త్ సైకాలజిస్ట్, ద క్యూర్ స్పేస్



మీరు ఆర్థిక అక్షరాస్యులేనా?!

‘భారతీయ స్త్రీలు ఆర్థికంగా అక్షరాస్యులు కాకపోవడానికి ప్రధాన కారణం పితృస్వామ్యమే’ అంటోంది గ్లోబల్ సర్వే స్టాండర్డ్ అండ్ పూర్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఆర్థిక భద్రత, ఆర్థిక అక్షరాస్యత స్త్రీకి ఎంత అవసరమో తెలుసుకుంటే ఆమె పురోభివృద్ధిలో మరిన్ని మంచిమార్పులు చోటుచేసుకుంటాయన్నది అక్షర సత్యం.


ప్రతీకాత్మక చిత్రం

సంపాదనలో నేటితరం మహిళలూ తమ సత్తాను చూపుతున్నారు. వృత్తి, ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అక్షరాస్యతలోనూ ముందడుగు వేస్తున్నారు. అయితే, ఆర్థిక అక్షరాస్యతలో మాత్రం మహిళ వెనకంజలోనే ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ బారోమీటర్ సర్వే స్పష్టం చేస్తోంది. 28 దేశాలలో నిర్వహించిన ఈ సర్వేలో (స్త్రీ-పురుషులు ఇద్దరినీ కలిపి) భారతదేశం 23వ స్థానంలో ఉంది. కేవలం 35 శాతం మంది మాత్రమే ఆర్థిక అక్షరాస్యులుగా ఉంటే, 65 శాతం మందికి ఆర్థిక అవగాహన తక్కువ. ఇందులోనూ మహిళలు మరింతగా వెనకబడి ఉన్నారు అని తెలియజేసింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ వందకోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు సొంత బ్యాంకు ఖాతా కూడా లేనివారున్నారు.

భావోద్వేగాలతో ఆట

తరచూ భర్తలు తమ భార్యలతో ‘నేను సంపాదిస్తున్నాను కాబట్టి నువ్వు సంపాదించాల్సిన అవసరం ఏముంది? ఇంటిని, పిల్లలను నిర్లక్ష్యం చేసినట్టే అవుతుంది’ అనే ఎమోషనల్ స్ట్రాటజీలతో మహిళలు ఇరుక్కుంటున్నారు. దీంతో మహిళలు క్రమంగా ఒంటరిగా, నిస్సహాయంగా మారుతుంటారు. దురదృష్టం ఏమిటంటే ‘ప్రేమ’ అనే పేరుతో జరిగే ఆర్థిక దుర్వినియోగాన్ని మహిళలు గుర్తించలేకపోతున్నారు. ఆర్థిక భద్రత లేకపోవడంతో స్త్రీలు తమకి నప్పని సంబంధాలలోనూ సర్దుబాటు చేసుకుంటూ జీవించాల్సి వస్తుంది. చెడు సంబంధాలలోకి వెళుతుంటారు. డబ్బును పొదుపు చేసి పెట్టుబడులు పెట్టడానికి బదులు, ఆమె కుటుంబం కోసం తనను తాను త్యాగం చేసుకుంటుంది. చివరకు అదే కుటుంబంలోని వ్యక్తులు లేదా పిల్లలు స్త్రీల మీద ఆర్థిక ఒత్తిడిని తీసుకువస్తున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గృహహింసను తగ్గించవచ్చని ‘రైట్స్ ఆఫ్ ఈక్వాలిటీ’ అనే సంస్థ ‘ది ఎకనామిక్ అబ్యూజ్ అండ్ ది ఇంపార్టెన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ లిటరీ ఆఫ్ ఉమెన్’ నివేదికలో పేర్కొంది.

నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి

కుటుంబం ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో సాధారణంగా మహిళలు ఉండరు. లక్ష్మి ఒక సాధారణ గృహిణి. ఇప్పటికీ బ్యాంకు ఖాతా తెరవడానికి, కేవైసీ చేయడానికి భర్తతో కలిసే బ్యాంకుకు వెళుతుంది. ఆర్థికవిషయాలు అంటే ఆమెకు ఒక విధమైన భయం. సొంతంగా ఎప్పుడూ ప్రయత్నం కూడా చేయదు. ఇలాంటి గృహలక్ష్ములు మన దేశంలో ఎంతోమంది ఉన్నారు. ఉమ ఉద్యోగం చేస్తుంది. కానీ, ఆమె ఏటీఎం కార్డ్ భర్త వద్ద ఉంటుంది. పాస్‌వర్డ్ లాంటివి ఆమె స్వయంగా రూపొందించదు. అవన్నీ ఆమె భర్త చేస్తాడు. ఉద్యోగం చేస్తున్నా కూడా ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక స్వేచ్ఛ లేని ఇలాంటి మహిళలు కోట్లాదిమంది ఉన్నారు.

షాపింగ్‌లో సమస్య లేదు

‘ఆర్థిక అక్షరాస్యత అంటే బ్యాంకుకు వెళ్లడం, అకౌంట్ ఓపెన్ చేయడం, చిన్న చిన్న లావాదేవీలు చేయడం అనుకోవాలా?!’ అనే ప్రశ్న ఉదయించకమానదు. అయితే, ‘ఇండియన్ ఉమెన్ అండ్ ఫైనాన్షియల్ ఫిట్‌నెస్’ రచయిత సునీల్ గాంధీ మాట్లాడుతూ ‘చాలా మంది మహిళలకు మొబైల్ యాప్‌లో షాపింగ్ చేయడం, క్యాబ్ బుక్ చేసుకోవడంలో ఎటువంటి సమస్య ఉండటం లేదు. అయితే, తమ సొంత బ్యాంకు ఖాతాను నిర్వహించడంలో లేదా ఆన్‌లైన్ లావాదేవీలు, పెట్టుబడుల పట్ల మాత్రం చాలా అసౌకర్యంగా ఉంటున్నారని చెబుతున్నారు. ‘ఆమె బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, డబ్బు లావాదేవీలు, వడ్డీలు, చక్రవడ్డీల ఉచ్చులో చిక్కుకోకూడదు అని పురుషులు భావిస్తారు. ఆమె కూడా ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టడానికి, ఈఎమ్ఐ కట్టడానికి, ఆస్తిలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపదు. వ్యక్తిగత ఫైనాన్స్, జ్ఞానం, నైపుణ్యాలు, వంటి ఆర్థిక సమాచారం ఉన్నవారు తమ డబ్బుకు సంబంధించి సొంతంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉన్నవారు ఆర్థికంగా అక్షరాస్యులు’ అని సునీల్ గాంధీ వివరిస్తున్నారు.

మహిళలను నియంత్రించే ఆయుధం

ఉద్దేశపూర్వకంగానే మహిళలకు ‘ఆర్థిక స్వేచ్ఛ’ ఇవ్వడం లేదు. కుటుంబంలోని మగవారే దీనిని అడ్డుకుంటున్నారు. భారతీయ స్త్రీలు ఇంటిని చూసుకుంటారు. పురుషులు సంపాదిస్తారు. దీంతో ‘తమకు ఏం అవసరమో పురుషులే చూసుకుంటారు’ అనే ఆలోచన స్త్రీలను ఆర్థిక స్వేచ్ఛకు దూరం చేస్తుంది. చేతిలో డబ్బు, దానిని ఖర్చు చేసే హక్కు పురుషులకు ఉండటం మహిళలను నియంత్రించే ఆయుధంగా మారింది.

– గీతికా చంద్ర,
‘ఫైనాన్స్ బేసిక్స్ ఫర్ ఉమెన్’ రచయిత్రి

కొట్టకుండా వేధింపులు

‘నేను సంపాదిస్తున్నాను, నా సంపాదనతో ఇల్లు నడుస్తోంది. నేను సంపాదించకపోతే కుటుంబం దిక్కులేనిది అవుతుంది. నేను సంపాదిస్తున్నాను కాబట్టి నా ఇష్టం మేరకు అన్నీ నడవాలి’ ఈ తరహా ఆలోచన పురుషుల్లో పెరిగి మహిళలపై వేధింపులకు కారణమవుతోంది. 95 శాతం గృహహింస కేసుల్లో డబ్బు ప్రధానపాత్ర పోషిస్తోంది. చాలా మంది మహిళలు ఈ విధమైన ఆర్థిక వేధింపులకు గురవుతున్నారు.

– సీమీ వినాయక్,
సైకాలజిస్ట్

అవగాహనకు మార్గాలు..

- ఆర్థికంగా అక్షరాస్యత ఉన్న మహిళలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది, వేటికి ఎంత ఖర్చు అవుతుంది, ఎంత దుర్వినియోగం అవుతుంది అనే విషయాల పట్ల అవగాహన ఉండాలి. అంతేకాదు, ఏ పథకాల్లో డబ్బు ఉంచడం ప్రయోజనకరం... వంటి అంశాలపై దృష్టి పెట్టడం వల్ల మార్కెట్‌లో ఆర్థిక కదలిక ఏమిటో తెలుస్తుంది.
- ఫిక్స్‌డ్ డిపాజిట్స్, స్కీమ్‌లు, నాన్–డీమ్యాట్ ఇన్వెస్ట్‌మెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి అవగాహన పెంచుకోవాలి.
- మహిళలు తమ భర్త ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారో తప్పక తెలుసుకోవాలి.
- ఏయే రుణాలు తీసుకుంటున్నారు, వాటి కాలపరిమితి ఎంత, వడ్డీ ఎంత అనేది తెలుసుకోవాలి.
- ప్రస్తుతం చాలా లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలు ఆన్‌లైన్ లావాదేవీల మొత్తం ప్రక్రియను తెలుసుకోవాలి.
- మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, బ్యాంకులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీస్, జీవిత బీమాలో పెట్టుబడి పెట్టినట్లయితే ఎప్పుడూ కంబైన్డ్‌గా చేయడం మంచిది. నామినీలో మీ పేరు ఉందో లేదో చెక్ చేయాలి. మీ సొంత బ్యాంకు ఖాతా వివరాలను ఎల్లప్పుడూ అప్‌డేట్‌లో ఉంచండి.

అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం... ఇలా మన సంస్కృతిలో దానగుణానికి విశేష గౌరవం ఉంది. అయితే భువనేశ్వర్‌కు చెందిన హరిప్రియ నాయక్ ప్రచారం చేసేది మాత్రం ‘శిరోజాల దానం’. ‘మీరు దానం చేసే శిరోజాల పేద కేన్సర్ పేషెంట్ల ముఖంలో చిరునవ్వు తీసుకొస్తుంది’ అంటుందామె. సేకరించిన జుట్టుతో విగ్గులు తయారు చేయించి పంచుతున్న హరిప్రియ నాయక్ అనేక ప్రశంసలు పొందుతోంది.

సేవ


శిరోజాల దాతలతో ప్రియానాయక్

శిరోజాలు దానం చేయండి

కేన్సర్‌తో పోరాడి గెలవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. చాలా మంది గెలుస్తారు. అయితే దిగువ మధ్యతరగతి స్త్రీలు, పేద స్త్రీలు ఈ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. కేన్సర్ చికిత్స సమయంలో కిమోథెరపీ వల్ల జుట్టు రాలిపోతుంది. ఆ సమయంలో శిరోముండనం కూడా చేయించుకోవాల్సి వస్తుంది. స్తోమత కలిగిన వర్గాల స్త్రీలు తిరిగి పూర్తి జుట్టు వచ్చేవరకూ విగ్గులు ధరిస్తారు. కాని పేద వర్గాల స్త్రీలకు ఆ అవకాశం ఉండదు. వారి కోసం, వారి ఆత్మవిశ్వాసం కోసం ఉచితంగా విగ్గులు ఏర్పాటు చేస్తోంది హరిప్రియ నాయక్. ‘శిరోజాల దానం ఇవాళ్టి అవసరం’ అంటుందామె.

సామాజిక సేవ

ఒడిశాలోని ఖుర్దా జిల్లాకు చెందిన 32 ఏళ్ల హరిప్రియ నాయక్ సామాజిక సేవారంగంలో పని చేస్తోంది. ‘ఒకసారి నేను కీమోథెరపీ వల్ల జుట్టు కోల్పోయిన పేదస్త్రీలను చూశాను. వారు ఇంటినుంచి బయటకు రావడానికే సిగ్గుపడుతున్నారు. కేన్సర్‌తో పోరాడే సమయంలో మానసికంగా, శారీరకంగా గట్టిగా ఉండాలి. మానసికంగా కుచించుకుపోతే కష్టం. స్త్రీలు జుట్టును ఇష్టపడతారు. వారికి సరైన విగ్గు ఇవ్వగలిగితే ఆత్మవిశ్వాసం వస్తుందని పనిలోకి దిగాను’ అంటుంది హరిప్రియ నాయక్. ఆమె 2021లో ‘మిషన్ స్మైల్ ఫర్ ది కేన్సర్ ఫైటర్స్’ పేరుతో ఒక కార్యక్రమాన్ని శిరోజాల సేకరణ కోసం మొదలుపెట్టింది. శిరోజాల దానం కోసం ప్రచారం కొనసాగించింది.


ప్రియానాయక్

9 మంది సాయం ఒకరికి మేలు

‘సింథటిక్ విగ్గులు త్వరగా పాడవుతాయి. వాటివల్ల చర్మ సంబంధ ఇబ్బందులు వస్తాయి. అదే సహజమైన జుట్టుతో చేసిన విగ్గులు మన్నికగా ఉంటాయి. ఇందు కోసం ఎవరైనా సరే శిరోజాలు ఇవ్వొచ్చు. కాని 12 అంగుళాల కంటే ఎక్కువ పొడవు ఉన్నప్పుడే అవి ఉపయోగపడతాయి. 9 మంది ఇచ్చిన జుట్టుతో ఒక్క విగ్గు తయారవుతుంది. మా ప్రచారం ఒడిశాలో మాత్రమే కాదు జార్ఖండ్‌లో కూడా కొనసాగుతోంది. ఒక ఆరేళ్ల పాప మాకు శిరోజాలు ఇవ్వడం ఒక రికార్డు’ అంటుంది హరిప్రియ నాయక్.

హెయిర్ డొనేషన్ ఒడిశా

‘హెయిర్ డొనేషన్ ఒడిశా’ పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుంది హరిప్రియ నాయక్. వాలెంటీర్లు పని చేసే వారిని ఆహ్వానిస్తుంది. ఇప్పటికి 150 మంది వాలెంటీర్లు ఆమెతోపాటు పని చేస్తున్నారు. శిరోజాలు దానం చేసే వారి నుంచి వాటిని సేకరించి హైదరాబాదులోని ‘హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ కేన్సర్ పేషెంట్స్’ సంస్థకు పంపుతారు. అది ఉచితంగా విగ్గులు తయారు చేసి ఇస్తుంది. వాటిని కేన్సర్ ఫైటర్స్‌కు అందజేస్తారు.

‘నా జుట్టు తగినంత పెరిగిన ప్రతిసారీ నేను దానం చేస్తుంటాను. మీరు కూడా చేయండి. ఇది కూడా పుణ్యకార్యమే’ అంటుంది హరిప్రియ నాయక్.

యూత్ పల్స్

J బ్యూటీకి జై కొడుతున్నారు!



చర్మం జిడ్డుగా లేకుండా ఉండడానికి ఏంచేయాలి? కంటి కింద నల్ల వలయాలను ఎలా తప్పించాలి? ఎండ నుంచి చర్మాన్ని ఎలా రక్షించుకోవాలి? చర్మం మెరవాలంటే ఏం చేయాలి? చర్మసంరక్షణ నుంచి సౌందర్యం వరకు సందేహాల సముద్రంలో ఈదులాడుతున్న యువతరానికి నిన్నా మొన్నటి వరకు ‘కె–బ్యూటీ’ లేదా కొరియన్ బ్యూటీ చుక్కానిగా కనిపించింది. అయితే ఇప్పుడు యూత్ దృష్టి జె–బ్యూటీ(జపనీస్ బ్యూటీ)పై మళ్లింది. ఇది జపాన్ బ్యూటీ బ్రాండ్‌ల మార్కెటింగ్ మాయాజాలమా? సహజమైన పరిణామమా? అనే చర్చను పక్కనపెడితే ‘జె–బ్యూటీ’లోని సహజత్వాన్ని, వాబీ–సాబీ తత్వాన్ని యువతరం బాగా ఇష్టపడుతోంది...

మృదువైన చర్మం కోసం కలలు కనే యువతరానికి చిరపరిచితమైన ట్రెండ్ కె–బ్యూటీ(కొరియన్–బ్యూటీ) బ్యూటీ ఇండస్ట్రీపై భారీ ప్రభావాన్ని చూపించింది. మైండ్–బాగ్లింగ్ ప్రొడక్ట్స్, మల్టీ–స్టెప్ రొటీన్స్‌తో ‘కె–బ్యూటీ’ గ్లోబల్ సెన్సేషన్‌గా నిలిచింది. యువ ప్రపంచాన్ని అమితంగా ఆకట్టుకుంది. తాజా విషయానికి వస్తే ‘జె–బ్యూటీ’ లేదా జపనీస్ బ్యూటీ యువతరం ఫేవరెట్‌గా మారింది. ‘పవర్ ఫుల్ సిస్టర్ ఆఫ్ కె–బ్యూటీ’ గా పేరు తెచ్చుకున్న ‘జె–బ్యూటీ’ కె–బ్యూటీని అధిగమించేలా దూసుకుపోతోంది. ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్లతో కలిసి జపనీస్ బ్యూటీ బ్రాండ్‌లు కలిసి పనిచేయడం కూడా మన దేశంలో ‘జె–బ్యూటీ’ పాపులారిటీకి కారణం అయింది.

‘జె–బ్యూటీ’కి ఎందుకు ఇంత పాపులారిటీ వచ్చింది... అనే విషయానికి వస్తే... నిపుణుల మాటల్లో చెప్పాలంటే...‘జె–బ్యూటీ’లోని ప్రధాన ఆకర్షణ సింప్లిసిటీ, ఎఫెక్టివ్‌నెస్. ‘ప్రివెన్షన్ రాదర్ దేన్ కరెక్షన్ ’

తత్వంతో కూడిన ఈ విధానం హ్యాపీగా, హెల్తీగా ఉండేలా చర్మ సంరక్షణతోపాటు పర్యావరణ ఒత్తిళ్ల నుంచి రక్షణకు ప్రాధాన్యత ఇస్తుంది, గ్రీన్ టీ, రైస్ బ్రాన్, సీవీడ్‌లాంటి పొటెంట్ ఇన్‌గ్రేడియెంట్స్ ‘జె–బ్యూటీ’లో భాగం అయ్యాయి.

‘ఘుమఘుమలతో కూడిన ఖరీదైన వంటకాల కంటే సాదాసీదా పప్పన్నం ఎంచుకోవడం లాంటిదే జె–బ్యూటీ. దీనిపై జపనీస్ తత్వం వాబీ–సాబీ ప్రభావం ఉంది. ఇంపర్‌ఫెక్షన్, సింప్లిసిటీ నుంచి అందాన్ని దర్శించడమే వాబీ –సాబీ తత్వం. జె–బ్యూటీ ప్రాథమికంగా రెండు విషయాలపై దృష్టి పెడుతుంది. వర్తమానంలో చర్మ సౌందర్యం. రెండోది భవిష్యత్తులో చర్మ సమస్యలు రాకుండా నివారించడం’ అంటుంది ముంబైకి చెందిన డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్ డాక్టర్ శిఖా షా.

జపనీస్ కల్చర్ అండ్ లైఫ్‌స్టైల్‌పై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెరగడం కూడా మన దేశంలో ‘జె–బ్యూటీ’పై ఆసక్తి కలిగించే కారణాలలో ఒకటి.

‘ఆరోగ్యకరమైన, ప్రకాశవంతమైన చర్మం కోసం 11–12 స్టెప్ స్కిన్‌కేర్ రొటిన్ అవసరం అనే అపోహను జె– బ్యూటీ బ్రేక్ చేసింది’ అంటుంది డాక్టర్ మోనికా బాంబ్రూ.

‘కె–బ్యూటీ’తో పోల్చితే ‘జె–బ్యూటీ’ని ప్రత్యేకంగా ఉంచుతున్నదేమిటి? అనే విషయానికి వస్తే...

చర్మసంరక్షణ విషయంలో రెండిటికీ పేరు ఉన్నప్పటికీ వాటి విధానాలు, తత్వం వేరు. ‘కె–బ్యూటీ’ అనేది ఇన్నోవేషన్, ఎక్స్‌పెరిమెంటేషన్స్‌పై దృష్టి పెడుతుంది. మల్టీ–స్టెప్ రొటిన్స్, ట్రెండ్–డ్రైవన్ ఫార్ములేషన్స్ ఉంటాయి. ఇక ‘జె–బ్యూటీ’ అనేది సింప్లిసిటీ, మినిమలిజం, సహజపదార్థాలపై దృష్టి పెడుతుంది.

‘జె–బ్యూటీకి తిరుగులేదు’ అని అంటుంది ముంబైకి చెందిన అద్విక శ్రీవాస్తవ. ‘జె–బ్యూటీ’పై కొండంత ఇష్టంలోనూ ఆచితూచి ఆలోచించేవారు లేకపోలేదు. ఇందుకు ఉదాహరణ బెంగళూరుకు చెందిన చైత్ర.

‘కె–బ్యూటీతో పోల్చితే జె–బ్యూటీ ఆసక్తికరంగా అనిపిస్తుంది. అలా అని వేలంవెర్రిగా జె–బ్యూటీ ప్రొడక్ట్స్ కొనాలనుకోవడం లేదు. జె–బ్యూటీ గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను’ అంటుంది చైత్ర.

క్లీన్ బ్యూటీ ట్రెండ్

గతంలో పోల్చితే జపనీస్ బ్యూటీ కంపెనీలపై యువత ఆసక్తి పెరిగింది. దీనికి అనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలు మారుతున్నాయి...అంటుంది గ్లోబల్ డేటా రిపోర్ట్. ‘కె–బ్యూటీ అనేది ట్రెండీ ఇన్‌గ్రేడియెంట్స్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, క్విక్ రిజల్ట్స్‌కు ప్రాధాన్యత ఇస్తుంటే జె–బ్యూటీ ఇందుకు భిన్నంగా సహజమైన పదార్థాలతో శాశ్వత ప్రభావంపై దృష్టి పెడుతుంది’ అంటున్నాడు ‘గ్లోబల్ డేటా’ కన్స్యూమర్ అనలిస్ట్ మణి భూషణ్ శుక్లా. ‘సహజ’ ‘సేంద్రియ’ ‘అలెర్జీరహిత’ మాటలతో ‘జె–బ్యూటీ’ ‘క్లీన్ బ్యూటీ’ ట్రెండ్‌గా పేరు తెచ్చుకుంది.



క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్-విజయ్ జోడీ

యూఎస్ క్లే కోర్టు చాంపియన్‌షిప్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. హ్యూస్టన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) ద్వయం 6-3, 6-4తో మైకేల్ మో-ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా) జంటను ఓడించింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

సుమిత్ నగాల్ శుభారంభం

గ్రాండ్‌ప్రి హసన్-2 ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మొరాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ 4-6, 6-3, 6-2తో కొరెంటిన్ ముటెట్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. 2 గంటల 10 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఆరు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో 61వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ)తో సుమిత్ ఆడతాడు.



మయాంక్ మెరుపు బౌలింగ్

- హడలెత్తించిన లక్నో పేస్ బౌలర్
- సూపర్ జెయింట్స్‌కు రెండో విజయం
- రాణించిన డికాక్, పూరన్
- 28 పరుగులతో ఓడిన బెంగళూరు


మయాంక్ యాదవ్

బెంగళూరు: అందివచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా నిప్పులు చెరిగే బంతులతో మరోసారి లక్నో పేస్ బౌలర్ మయాంక్ యాదవ్ హడలెత్తించాడు. వేగానికి తోడు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసి ఐపీఎల్ టోర్నీలో లక్నో జట్టుకు వరుసగా రెండో విజయాన్ని అందించాడు. మయాంక్ (3/14) దెబ్బకు సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు మళ్లీ నిరాశే ఎదురైంది. మయాంక్‌తోపాటు డికాక్, నికోలస్ పూరన్ రాణించడంతో... మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 28 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా లక్నో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్ (56 బంతుల్లో 81; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), పూరన్ (21 బంతుల్లో 40 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. మహిపాల్ లామ్రోర్ (13 బంతుల్లో 33; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆట ఆడగా... పటిదార్, గ్రీన్, మ్యాక్స్‌వెల్ వికెట్లను తీసి లక్నో విజయంలో కీలకపాత్ర పోషించిన మయాంక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనూ మయాంక్ మూడు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం అందుకున్నాడు.

డికాక్, పూరన్ మెరుపులతో...

లక్నో జట్టు ఓపెనర్ డికాక్ ఆరంభం నుంచే ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టాప్లీ ఇన్నింగ్స్ తొలి ఓవర్లో అతను 3 బౌండరీలు, సిరాజ్ మూడో ఓవర్లో 2 సిక్స్‌లు బాదాడు. దీంతో కెప్టెన్ కేఎల్ రాహుల్ (20; 2 సిక్స్‌లు) తక్కువే చేసినా... దేవదత్ పడిక్కల్ (6) విఫలమైనా... లక్నో ఇన్నింగ్స్‌పై ఏమాత్రం ప్రభావం పడలేదు. 36 బంతుల్లో డికాక్ ఫిఫ్టీ పూర్తవగా జట్టు స్కోరు 12వ ఓవర్లోనే వందకు చేరింది. స్టొయినిస్ (15 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించగా, ఆఖర్లో పూరన్ మెరుపులతో లక్నో భారీస్కోరు చేయగలిగింది. 19, 20వ ఓవర్లను పూర్తిగా ఆడిన పూరన్ 5 సిక్స్‌లతో 33 పరుగులు పిండుకున్నాడు.


కోహ్లి

కోహ్లి అవుటవడంతోనే...

బెంగళూరు ఇన్నింగ్స్ ఆరంభంలో కొద్దిసేపే బాగుంది. కెప్టెన్ డు ప్లెసిస్ బౌండరీలతో వేగం పెంచగా, నవీనుల్ నాలుగో ఓవర్లో కోహ్లి సిక్స్‌తో టచ్‌లోకి వచ్చాడు. మరుసటి ఓవర్ తొలి బంతికి కోహ్లి ఫోర్ కొట్టడంతో స్కోరు 40/0 వద్ద బాగానే ఉంది. అక్కడే కోహ్లి నిష్క్రమించగా, మరుసటి ఓవర్లో డుప్లెసిస్ (19; 3 ఫోర్లు) రనౌటయ్యాడు. చెత్త షాట్ ఆడిన మ్యాక్స్‌వెల్ (0) పూరన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతే 43 పరుగులకే ముగ్గురు హిట్టర్లను కోల్పోయిన బెంగళూరు కష్టాల్లో పడింది. మయాంక్ అద్భుత బంతికి గ్రీన్ (9) బౌల్డ్ కాగా.. అనూజ్ (11) కూడా జట్టును ఆదుకోలేకపోయాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన లామ్రోర్ సిక్స్‌లు, ఫోర్లతో రెచ్చిపోయాడు. 20 బంతుల్లో 46 పరుగుల సమీకరణం ఆర్‌సీబీలో కొత్త ఆశలు రేపగా... మరుసటి బంతికి కార్తీక్ (4) అవుట్ కావడంతోనే బెంగళూరు ఖేల్ ఖతమైంది.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × కోల్‌కతా
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	3	3	0	6	1.249
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	4	1	3	2	-0.876
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) డాగర్ (బి) టాప్లీ 81; కేఎల్ రాహుల్ (సి) డాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 20; పడిక్కల్ (సి) అనూజ్ (బి) సిరాజ్ 6; స్టొయినిస్ (సి) డాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 24; పూరన్ (నాటౌట్) 40; బదోని (సి) డుప్లెసిస్ (బి) యశ్ దయాళ్ 0; కృనాల్ పాండ్యా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-53, 2-73, 3-129, 4-143, 5-148. **బౌలింగ్:** రీస్ టాప్లీ 4-0-39-1, యశ్ దయాళ్ 4-0-24-1, సిరాజ్ 4-0-47-1, మ్యాక్స్‌వెల్ 4-0-23-2, మయాంక్ డాగర్ 2-0-23-0, గ్రీన్ 2-0-25-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) పడిక్కల్ (బి) సిద్ధార్థ్ 22; డుప్లెసిస్ (రనౌట్) 19; పటిదార్ (సి) పడిక్కల్ (బి) మయాంక్ యాదవ్ 29; మ్యాక్స్‌వెల్ (సి) పూరన్ (బి) మయాంక్ యాదవ్ 0; గ్రీన్ (బి) మయాంక్ యాదవ్ 9; అనూజ్ (సి) పడిక్కల్ (బి) స్టొయినిస్ 11; మహిపాల్ (సి) పూరన్ (బి) యశ్ ఠాకూర్ 33; దినేశ్ కార్తీక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 4; మయాంక్ డాగర్ (రనౌట్) 0; టాప్లీ (నాటౌట్) 3; సిరాజ్ (సి) పూరన్ (బి) నవీనుల్ 12; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 153. వికెట్ల పతనం:** 1-40, 2-42, 3-43, 4-58, 5-94, 6-103, 7-136, 8-137, 9-138, 10-153. **బౌలింగ్:** సిద్ధార్థ్ 3-0-21-1, కృనాల్ పాండ్యా 1-0-10-0, నవీనుల్ 3.4-0-25-2, మయాంక్ యాదవ్ 4-0-14-3, రవి బిష్ణోయ్ 3-0-33-0, యశ్ ఠాకూర్ 4-0-38-1, స్టొయినిస్ 1-0-9-1.

భారత నంబర్‌వన్‌గా అర్జున్

విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించిన తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్



సాక్షి, హైదరాబాద్: కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. ఓపెన్ విభాగం క్లాసికల్ ఫార్మాట్‌లో అధికారికంగా భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా అర్జున్ అవతరించాడు. ఏప్రిల్ నెలకు సంబంధించి అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) విడుదల చేసిన క్లాసికల్ ఫార్మాట్ రేటింగ్స్‌లో 20 ఏళ్ల అర్జున్ 2756 పాయింట్లతో ప్రపంచ 9వ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఈ క్రమంలో భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించి భారత టాప్ ర్యాంకర్‌గా వరంగల్ జిల్లాకు చెందిన అర్జున్ నిలిచాడు. విశ్వనాథన్ ఆనంద్ 2751 పాయింట్లతో ప్రపంచ 11వ ర్యాంక్‌లో ఉన్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 1న తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తొలిసారి అధికారికంగా విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి భారత కొత్త నంబర్‌వన్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఆనంద్ మళ్లీ టాప్ ర్యాంక్‌కు చేరుకోగా... ఏడు నెలల తర్వాత అర్జున్ ప్రదర్శనకు ఆనంద్ మరోసారి భారత నంబర్‌వన్ స్థానాన్ని చేజార్చుకున్నాడు. ఆనంద్, పెంటేల హరికృష్ణ, గుకేశ్ తర్వాత ప్రపంచ టాప్-10 ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించిన నాలుగో భారతీయ చెస్ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. తాజా రేటింగ్స్‌లో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే; 2830 పాయింట్లు), ఫాబియానో కరువానా (అమెరికా; 2803 పాయింట్లు), నకమురా (అమెరికా; 2789 పాయింట్లు) వరుసగా తొలి మూడు ర్యాంక్‌ల్లో నిలిచారు. భారత్ నుంచి టాప్-100లో 10 మంది గ్రాండ్‌మాస్టర్లు (అర్జున్-9, ఆనంద్-11, ప్రజ్ఞానంద-14, గుకేశ్-16, విదిత్-25, హరికృష్ణ-37, నిహాల్ సరీన్-39, నారాయణన్-41, అరవింద్ చిదంబరం-72, రౌనక్ సాధ్వాని-81) ఉన్నారు.

ప్రజ్ఞానంద, హంపిలపైనే దృష్టి


ప్రజ్ఞానంద


కోనేరు హంపి


గుకేశ్


విదిత్


వైశాలి

నేటి నుంచి క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ఓపెన్, మహిళల విభాగాల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌కు ప్రత్యర్థులను నిర్ణయించే క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి రంగం సిద్ధమైంది. టొరంటోలో నేడు మొదలయ్యే ఈ టోర్నీలో భారత్ నుంచి ఏకంగా ఐదుగురు గ్రాండ్‌మాస్టర్లు బరిలో ఉన్నారు. ఓపెన్ విభాగంలో ప్రజ్ఞానంద, గుకేశ్ (తమిళనాడు), విదిత్ (మహారాష్ట్ర)... మహిళల విభాగంలో కోనేరు హంపి (ఆంధ్రప్రదేశ్), ప్రజ్ఞానంద సోదరి వైశాలి (తమిళనాడు) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. భారత్ నుంచి ప్రజ్ఞానంద, హంపి ఫేవరెట్స్‌గా కనిపిస్తున్నారు. ఓపెన్ విభాగంలో 8 మంది... మహిళల విభాగంలో 8 మంది మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మొత్తం 14 రౌండ్ల చొప్పున టోర్నీని నిర్వహిస్తారు. అత్యధిక పాయింట్లు గెలిచిన ప్లేయర్లు విజేతగా నిలుస్తారు. క్యాండిడేట్స్ టోర్నీ ఓపెన్ విభాగం విజేత ప్రస్తుత విశ్వవిజేత డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగం విజేత ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ టైటిల్ కోసం తలపడతారు. బుధవారం కేవలం ప్రారంభోత్సవం ఉంది. గురువారం తొలి రౌండ్ గేమ్‌లు జరుగుతాయి. ఈ టోర్నీలో పోటీపడనున్న క్రీడాకారుల వివరాలు...

ఓపెన్ విభాగం: ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ (భారత్), నెపోమ్నిషి (రష్యా), కరువానా, నకమురా (అమెరికా), అబసోవ్ (అజర్‌బైజాన్), అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్). **మహిళల విభాగం:** హంపి, వైశాలి (భారత్), టింగ్‌జీ లె, టాన్ జోంగి (చైనా), కాటరీనా లాగ్నో, గొర్యాక్‌చినా (రష్యా), సలీమోవా (బల్గేరియా), అనా ముజిచుక్ (ఉక్రెయిన్).

సినిమా

హాలీవుడ్‌లో సీక్వెల్ జోరు

హాలీవుడ్‌లో సీక్వెల్ అనగానే దాదాపు అందరి దృష్టి 'అవతార్' మీద ఉంటుంది. దర్శకుడు జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' తొలి భాగం 2009లో రాగా, రెండో భాగం రావడానికి పదమూడేళ్లు (2022) పట్టింది. మూడు, నాలుగు, ఐదు భాగాలను ప్రకటించారు కామెరూన్. మూడో భాగం ఈ ఏడాది విడుదల కావాల్సి ఉండగా వచ్చే ఏడాదికి వాయిదా పడింది. 'అవతార్' అభిమానులను ఇది నిరాశపరిచే విషయమే. అయితే ఈ ఏడాది దాదాపు పది సీక్వెల్స్ రానున్నాయి. పలు హిట్ చిత్రాలకు కొనసాగింపుగా రానున్న ఆ సీక్వెల్స్ గురించి తెలుసుకుందాం.









సమ్మర్‌లో సైన్స్ ఫిక్షన్

ఈ వేసవికి రానున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'. 'వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' (2017)కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' ఫ్రాంచైజీలో ఇది నాలుగో భాగం. మూడు భాగాలూ సూపర్ హిట్టయిన నేపథ్యంలో తాజా చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. వెస్ బాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విలియమ్ టీగ్, ఫ్రెయా అలన్ తదితరులు నటించారు. మే 10న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఫుల్ యాక్షన్‌తో బ్యాడ్ బాయ్స్

జూన్‌లో బ్యాడ్ బాయ్స్ తెరపైకి రానున్నారు. బడ్డీ కాప్ యాక్షన్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బ్యాడ్ బాయ్స్: రైడ్ ఆర్ డై'. 2003లో వచ్చిన 'బ్యాడ్ బాయ్స్'కి నాలుగో భాగం ఇది. మూడో భాగం 'బ్యాడ్ బాయ్స్ ఫర్ లైఫ్' (2020) విడుదలైన నాలుగేళ్లకు వస్తోన్న సీక్వెల్ ఇది. ఈ చిత్రంలో డిటెక్టివ్ ల్యూటినెంట్ మైఖేల్‌గా లీడ్ రోల్‌ని విల్ స్మిత్ చేశారు. రెండో, మూడో భాగానికి దర్శకత్వం వహించిన ఆదిల్, బిలాల్ ద్వయం తాజా చిత్రాన్ని కూడా తెరకెక్కించారు. నాలుగు భాగాల్లోనూ మైఖేల్ పాత్రను విల్ స్మిత్‌నే చేశారు. యాక్షన్, కామెడీతో రూపొందిన ఈ చిత్రం జూన్ 7న రిలీజ్ కానుంది.

ఆరేళ్లకు డెడ్‌పూల్

ఈ ఏడాది అత్యంత భారీ అంచనాలు ఏర్పడ్డ సీక్వెల్ చిత్రాల్లో 'డెడ్‌పూల్ 3'ది ప్రముఖ స్థానం. ర్యాన్ రేనాల్డ్స్ టైటిల్ రోల్‌లో షానీ లెవీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. మార్వెల్ కామిక్ బుక్స్‌లోని డెడ్‌పూల్ క్యారెక్టర్ ఆధారంగా రూపొందిన తొలి చిత్రం 'డెడ్‌పూల్' (2016). టిమ్ మిల్లర్ దర్శకత్వం వహించిన ఈ సూపర్ హీరో ఫిల్మ్ సూపర్ హిట్టయింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా షానీ లెవీ దర్శకత్వంలో రూపొందిన 'డెడ్‌పూల్ 2' (2018) కూడా బంపర్ హిట్. ఆరేళ్లకు మూడో భాగం 'డెడ్‌పూల్ అండ్ వుల్వరిన్' వస్తోంది. మూడు భాగాల్లోనూ డెడ్‌పూల్ పాత్రను ర్యాన్ రేనాల్డ్స్ చేశారు. జూలై 26న ఈ చిత్రం రిలీజ్ కానుంది.







హారర్ జూయిస్

దాదాపు మూడు దశాబ్దాల క్రితం వచ్చిన ఫ్యాంటసీ హారర్ కామెడీ మూవీ 'బీటిల్ జూయిస్' (1988) సంచలన విజయం సాధించింది. టిమ్ బర్టన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో బీటిల్ జూయిస్ పాత్రను మైఖేల్ కీటన్ పోషించారు. దాదాపు 35 ఏళ్లకు ఈ చిత్రానికి సీక్వెల్‌గా టిమ్ బర్టన్ దర్శకత్వంలోనే 'బీటిల్ జూయిస్ 2' రూపొందింది. సీక్వెల్‌లోనూ బీటిల్ జూయిస్ పాత్రను మైఖేల్ కీటన్ చేశారు. సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కానుంది.

అక్టోబర్‌లో జోకర్

అక్టోబర్ నెల రెండు సీక్వెల్స్‌ని చూపించనుంది. ఒకటి 'జోకర్' సీక్వెల్... మరోటి 'వెనమ్' సీక్వెల్. అమెరికన్ కామిక్స్ ఆధారంగా మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జోకర్' (2019). టాడ్ ఫిలిప్స్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో జోకర్ అనే ఆర్థర్ ఫ్లెక్స్ పాత్రను జోక్విన్ ఫీనిక్స్ పోషించారు. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో 'జోకర్'కి సీక్వెల్‌గా 'జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్' చిత్రం రూపొందింది. అక్టోబర్ 4న ఈ జోకర్ తెరపైకి రానున్నాడు.

ఇదే ఆఖరి వెనమ్

కొలంబియా పిక్చర్స్ నిర్మించిన స్పైడర్‌మేన్ యూనివర్స్‌లో ఆరో చిత్రం 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్'. 'వెనమ్' (2018), 'వెనమ్: లెట్ దేర్ బీ కార్నేజ్' (2021) చిత్రాలకు సీక్వెల్ ఇది. ఈ మూడో భాగంతో 'వెనమ్' సీక్వెల్ ముగుస్తుందని టాక్. కెల్లీ మార్సెల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ వెనమ్ పాత్రను టామ్ హార్డీ పోషించారు. ఈ చిత్రం జూలైలోనే రిలీజ్ కావాల్సింది. అయితే వేతనాల పెంపుకి రచయితలు చేపట్టిన సమ్మె వల్ల వాయిదా పడింది. అక్టోబర్ 25న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

రెండు దశాబ్దాలకు గ్లాడియేటర్

రెండు దశాబ్దాల క్రితం వచ్చిన హిస్టారికల్ డ్రామా 'గ్లాడియేటర్' (2000) అనూహ్యమైన విజయం సాధించింది. రిడ్లీ స్కాట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రసెల్ క్రో, జోక్విన్ ఫీనిక్స్ తదితరులు నటించారు. పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు వసూలు చేసింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రిడ్లీ స్కాట్ దర్శకత్వంలోనే రూపొందిన 'గ్లాడియేటర్ 2' నవంబర్ 22న రిలీజ్ కానుంది. పాల్ మెస్కల్, డెంజెల్ వాషింగ్టన్ తదితరులు నటించారు.

ఈ చిత్రాలతో పాటు యాక్షన్ అడ్వెంచర్ కామెడీ మూవీ 'సోనిక్ ది హెడ్ హాగ్ 3' డిసెంబర్ 20న, అదే రోజున యానిమేటెడ్ మూవీ 'హూ ఫ్రేమ్డ్ రాగర్ రాబిట్ 2', 'ది కరాటే కిడ్' ఆరో భాగం డిసెంబర్ 13న... ఇంకా వీటితో పాటు ఈ ఏడాది మరికొన్ని సీక్వెల్స్ వచ్చే చాన్స్ ఉంది.

సావిత్రిగారిని చూడగానే నోట మాట రాలేదు - చిరంజీవి


● 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణలో ఓ దృశ్యం

''మహానటి సావిత్రిగారిపై రాసిన 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకాన్ని ఆవిష్కరించడంతో నా జన్మ సార్థకం అయిందని భావిస్తున్నాను'' అన్నారు హీరో చిరంజీవి. దివంగత నటి సావిత్రిపై సంజయ్ కిశోర్ రచించిన 'సావిత్రి క్లాసిక్స్' బుక్ లాంచ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ – ''నా తొలి సినిమా 'పునాదిరాళ్లు'లోనే సావిత్రిగారితో నటిస్తున్నానని తెలియగానే ఒళ్లు జలదరించింది. రాజమండ్రిలోని పంచవటి హోటల్‌లో ఉన్న సావిత్రిగారిని పరిచయం చేసేందుకు నన్ను తీసుకెళ్లారు. ఆమెను చూడగానే నోట మాట రాలేదు. 'నీ పేరేంటి బాబు' అని అడిగారామె. చిరంజీవి అన్నాను. 'శుభం బాగుంది' అన్నారు. మరుసటి రోజ వర్షం వల్ల 'పునాదిరాళ్లు' షూటింగ్ క్యాన్సిల్ అయింది. నేను సరదాగా డ్యాన్స్ చేస్తూ జారిపడ్డాను. అయినా ఆగకుండా నాగుపాములా డ్యాన్స్ చేయడంతో అందరూ క్లాప్స్ కొట్టారు. అప్పుడు సావిత్రిగారు 'భవిష్యత్‌లో మంచి నటుడు అవుతావు' అని చెప్పిన మాట నాకు వెయ్యి ఏనుగుల బలం అనిపించింది. 'ప్రేమ తరంగాలు'లో సావిత్రిగారి కొడుకుగా నటించాను. ఆ తర్వాత ఆమెతో నటించే, ఆమెను చూసే చాన్స్ రాలేదు. కేవలం కళ్లతోనే నటించగల, హావభావాలు పలికించగల అలాంటి గొప్ప నటి ప్రపంచంలో మరెవరూ లేరు'' అన్నారు. ఈ వేడుకలో సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, కుమారుడు సతీశ్ కుమార్, నటీనటులు జయసుధ, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, మురళీ మోహన్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడారు.

విభిన్నమైన ప్రేమకథ


● నవదీప్

నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ ఇతర పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌పై సి స్పేస్ సంస్థ నిర్మించిన 'లవ్ మౌళి' ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన ప్రేమకథలకు తెరరూపమే ఈ సినిమా. విభిన్నమైన ప్రేమకథలు కోరుకునే ప్రేక్షకుల మనసులకు మా చిత్రం హత్తుకుంటుంది. ఈ చిత్రంలో నవదీప్ కొత్తగా కనిపిస్తారు'' అన్నారు.

హాస్య నటుడు విశ్వేశ్వర రావు కన్నుమూత



ప్రముఖ హాస్య నటుడు గరిమెళ్ల విశ్వేశ్వర రావు (64) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నై సిరుచ్చేరిలోని తన నివాసంలో సోమవారం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో పుట్టారు విశ్వేశ్వర రావు. ఆరేళ్ల వయసులో 'పొట్టి ప్లీడరు' సినిమాతో నటుడిగా కెరీర్ ఆరంభించారాయన. ఆ తర్వాత 'భక్త పోతన, బాలమిత్రుల కథ, ఓ సీత కథ, మా నాన్న నిర్దోషి, పట్టిందల్లా బంగారం, అందాల రాముడు, సిసింద్రీ చిట్టిబాబు'.. ఇలా బాలనటుడిగా 150కి పైగా సినిమాలు చేశారు. అనంతరం కామెడీ, సహాయక పాత్రల్లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. 'ముఠా మేస్త్రి, ప్రెసిడెంట్‌గారి పెళ్లాం, ఆమె కథ, ఆయనకు ఇద్దరు, అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి, మెకానిక్ అల్లుడు, శివాజీ, అవును.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు'.. ఇలా దాదాపు రెండొందల సినిమాల్లో తనదైన నటనను కనబరిచారు. తెలుగు, తమిళ, కన్నడంలో 300కిపైగా చిత్రాల్లో నటించారు విశ్వేశ్వర రావు. 150కి పైగా సీరియల్స్‌లో నటించారు. 'విస్సు టాకీస్' పేరుతో యూ ట్యూబ్ చానల్‌ని ప్రారంభించారు. అందులో సెలబ్రిటీలను ఇంటర్వ్యూ చేయడంతో పాటు చిత్ర సీమలో తన అనుభవాలు, జ్ఞాపకాలను పంచుకునేవారు. విశ్వేశ్వర రావు నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగానూ వ్యవహరించారు. ఆయన మృతిపట్ల పలువురు తెలుగు, తమిళ, కన్నడ చిత్రరంగ ప్రముఖులు సంతాపం తెలిపారు. విశ్వేశ్వర రావుకి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు భార్గవి, పూజ ఉన్నారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి.

నిర్మాతగా కొనసాగుతాను


● పాయల్

''నాకు చిన్నప్పటి నుంచే గ్లామర్ ఇండస్ట్రీ అంటే ఆసక్తి. అయితే నిర్మాత అవుతానని అనుకోలేదు. అనుకోకుండా 'భరతనాట్యం' వంటి మంచి సినిమా నిర్మించే అవకాశం వచ్చింది. నా పేరు, మా బాబు రుషాంత్ పేరు వచ్చేలా పీఆర్ ఫిలింస్ బ్యానర్ పెట్టాను'' అన్నారు పాయల్ సరాఫ్. సూర్యతేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహించిన సినిమా 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 5న రిలీజవుతోంది. పాయల్ మాట్లాడుతూ– ''నా భర్త హితేష్‌కి సూర్యతేజ చెప్పిన నచ్చింది. దర్శకుడు కావాలనుకునే ఓ కుర్రాడు నేర ప్రపంచంలో చిక్కుకుంటాడు. అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడు? అనేది ఈ చిత్రకథ. ఇక నిర్మాతగా కొనసాగుతాను. నటిగా చాన్స్ వస్తే చేస్తాను'' అన్నారు.

సైకలాజికల్ థ్రిల్లర్


● హర్షివ్ కార్తీక్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ నెల 5న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ– ''అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా చేశాను. జాబ్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నటన, రచన, డైరెక్షన్, ప్రొడక్షన్.. ఇలా అన్నీ ఆన్ లైన్‌లో నేర్చుకున్నా. మానసిక అనారోగ్యం ఉన్న ఓ వ్యక్తి ఆడిషన్‌కు వెళతాడు. అక్కడ అవమానం జరగడంతో అతను ఎంతవరకూ వెళ్లాడు? అనేది 'బహుముఖం' కథ. సస్పెన్స్, సైకలాజికల్ థ్రిల్లర్స్‌ని ఇష్టపడేవారు మా సినిమాని ఎంజాయ్ చేస్తారు. నా తర్వాతి సినిమా కోసం ఒక యాక్షన్ డ్రామా కథ రాసుకున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
3-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	111	73,904
నిఫ్టీ ▽	9	22,453

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,211	▽	187
డోజోన్స్	39,074	▽	492
ఎఫ్‌టీఎస్ఈ 100	7,935	▽	18
డాక్స్	18,283	▽	209
షాంఘై	3,075	▽	2
నికాయ్	39,838	▽	33

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	68,961	△	298
బంగారం (99.5 స్వచ్ఛత)	68,685	△	297
వెండి (కిలో)	76,127	△	1,016

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.44	105.98
€	యూరో	భారతీయ	88.42	90.77
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	54.41	55.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	53.25	55.16
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.34	64.02
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.34	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.82	23.60
¥	చైనా యువాన్	భారతీయ	10.41	12.48

హ్యాపీ మొబైల్స్ ఆరో వార్షికోత్సవ ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్ విక్రయాల సంస్థ హ్యాపీ మొబైల్స్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా 'హ్యాపీ డేస్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రతి కొనుగోలుపై ఆరు కచ్చితమైన బహుమతులు అందించనుంది. మొబైల్స్, ఎల్ఈడీ స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్స్‌ల కొనుగోలుపై అత్యధికంగా 7.5% వరకు తక్షణ డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది. మొబైల్ ఉపకరణాలపై గరిష్ఠంగా 65% వరకు తగ్గింపు ఆఫర్ ఇస్తుంది. వీటికి తోడు ఎక్స్ఛేంజీ ఆఫర్లు, ఒకసారి స్క్రీన్ మార్చుకునే సదుపాయం కల్పిస్తుంది. ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల కొనుగోలుపై ప్రతి కస్టమర్‌కి అత్యుత్తమ ఆఫర్లు అందించనుంది.

నీల్‌కమల్ బ్రాండ్ అంబాసిడర్‌గా రణ్‌బీర్ కపూర్



హైదరాబాద్: ప్రముఖ ఫర్నిచర్ సంస్థ నీల్‌కమల్ స్లీప్ తమ ప్రచారకర్తగా బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్‌ను ఎంపిక చేసుకుంది. ''మా బ్రాండ్ అంబాసిడర్‌గా రణబీర్ కపూర్‌ని నియమించుకోవడం సంతోషంగా ఉంది. సంస్థ ఉత్పత్తులను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రణ్‌బీర్‌కున్న ప్రజాదరణ తోడ్పడుతుంది'' అని నీల్‌కమల్ స్లీప్ అధిపతి ఇషాన్ పరేఖ్ తెలిపారు. నాణ్యమైన నిద్ర ప్రాముఖ్యతను అర్థం చేసుకొని వ్యక్తిగత నిద్ర అలవాట్లను గౌరవించే నీల్ కమల్ స్లీప్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని రణ్‌బీర్ కపూర్ పేర్కొన్నారు. ఈ మ్యాట్రెస్‌లు ప్రశాంతమైన నిద్రానుభవాన్ని అందిస్తాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40

పన్ను వసూళ్ల లక్ష్యం సాధించిన కేంద్రం!



న్యూఢిల్లీ: ఆర్థిక పురోగతిని ప్రతిబింబిస్తూ కేంద్రం మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని దాదాపు సాధించింది. 2024 ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన సవరిత అంచనాల ప్రకారం... 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్ల లక్ష్యం రూ.34.37 లక్షల కోట్లు. అత్యున్నత స్థాయి వర్గాల సమాచారం ప్రకారం ఈ వసూళ్లు దాదాపు లక్ష్యానికి చేరువయ్యాయి. ప్రత్యక్ష పన్ను వసూళ్లు (కార్పొరేట్, వ్యక్తిగత పన్నులు) రూ.19.45 లక్షల కోట్లు ఒనగూరగా, రూ. 14.84 పరోక్ష పన్ను వసూళ్లు (జీఎస్‌టీ, కస్టమ్స్, ఎక్సైజ్) జరిగాయి. ఆర్థిక సంవత్సరం పూర్తి లెక్కలు తేలితే లక్ష్య సాధన సాధించినట్లు స్పష్టమవుతుందని ఆ వర్గాలు వెల్లడించాయి. నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చి 17తో ముగిసిన కాలానికి రూ.18.90 లక్షల కోట్లు. జీఎస్‌టీ వసూళ్లు రికార్డులను సృష్టించిన సంగతి తెలిసిందే.

లక్ష్యం చేరని డిజిన్వెస్ట్‌మెంట్

2023-24లో రూ. 16,507 కోట్లు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పీఎస్‌యూలలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 16,507 కోట్లు మాత్రమే సమకూర్చుకోగలిగింది. గతేడాది బడ్జెట్‌లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 51,000 కోట్లను సమీకరించాలని తొలుత ప్రతిపాదించింది. అయితే 2024 ఫిబ్రవరి 1న అంచనాలను రూ. 30,000 కోట్లకు సవరించింది. దీపమ్ వివరాల ప్రకారం మార్చి31తో ముగిసిన గతేడాది ప్రభుత్వం రూ. 16,507 కోట్లు మాత్రమే సమీకరించింది. 2018-19, 2017-18లలో మాత్రమే ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను అందుకోగలిగింది. 2017-18లో బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. లక్ష కోట్లను మించుతూ ఏకంగా రూ. 1,00,056 కోట్లు సమకూర్చుకుంది. 2018-19లోనూ రూ. 80,000 లక్ష్యాన్ని అధిగమించి రూ. 84,972 కోట్లు అందుకుంది.

తెలుగు రాష్ట్రాల్లో జియోకు కొత్తగా 2.59 లక్షల చందాదారులు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో జియోకు 2024 జనవరిలో కొత్తగా 2.59 లక్షలకు పైగా చందాదారులు కొత్తగా చేరారు. ట్రాయ్ గణాంకాల ప్రకారం జనవరి లో జియో అత్యధికంగా 2,59,788 మొబైల్ చందాదారులను చేర్చుకుంది. దీంతో జియో కస్టమర్ల సంఖ్య 3.24 కోట్లకు చేరుకుంది. ఇదే నెలలో ఎయిర్‌టెల్ 1.18 లక్షల కొత్త మొబైల్ చందాదారులు చేరారు. మరోవైపు వోడాఐడియా 44,649 మంది సభ్యులను, బీఎస్ఎన్ఎల్ 16,146 మంది కస్టమర్లను కోల్పోయాయి. గణాంకాల ప్రకారం జనవరి 2024 నాటికి దేశంలో మొత్తం మొబైల్ కస్టమర్ల సంఖ్య 52.67 కోట్లకు చేరుకుంది.



మార్చిలో తయారీకి కొత్త ఆర్డర్ల దన్ను

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం మార్చిలో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది.



హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఫిబ్రవరిలో 56.9 వద్ద ఉంటే, మార్చిలో ఏకంగా 16 సంవత్సరాల గరిష్ఠ స్థాయి 59.1కి ఎగసింది. వ్యవస్థలో సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్‌లు, ఉత్పత్తి, ఇన్‌పుట్ స్టాక్‌ల బలమైన వృద్ధిని ఈ ఫలితం ప్రతిబింబిస్తుంది. సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. గడచిన 33 నెలల ఈ సానుకూలత ఉంది.

ఏఎస్ఐసీ చెయిర్‌గా సంగీత జిందాల్



ముంబై: ఏషియా సొసైటీ ఇండియా సెంటర్ (ఏఎస్ఐసీ) బోర్డు కొత్త చెయిర్‌గా సంగీతా జిందాల్ ఎన్నికయ్యారు. ఆమె ఎన్నిక ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దేశీయంగానే కాకుండా దక్షిణాసియాలో సమకాలీన కళల రంగానికి ఆమె సేవలు అందిస్తున్నారని ఏఎస్ఐసీ తెలిపింది.

బీఎండబ్ల్యూ, టాటా టెక్ జత

న్యూఢిల్లీ: ఆటో రంగ జర్మన్ దిగ్గజం బీఎండబ్ల్యూ గ్రూప్, దేశీ ప్రొడక్ట్ ఇంజనీరింగ్, డిజిటల్ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్ చేతులు కలపనున్నాయి. తద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిసహా.. దేశీయంగా ఐటీ డెవలప్‌మెంట్ హబ్‌కు తెరతీయనున్నట్లు సంయుక్తంగా వెల్లడించాయి. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశాయి. ప్రణాళికల్లో భాగంగా పుణే, బెంగళూరు, చెన్నైలలో ఐటీ అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పనున్నట్లు పేర్కొన్నాయి. బెంగళూరు, పుణేలలో ప్రధాన అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించాయి. చెన్నైలో ఐటీ సొల్యూషన్ల బిజినెస్‌పై దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొన్నాయి. అధీకృత సంస్థల అనుమతుల ఆధారంగా భాగస్వామ్యాన్ని కుదుర్చుకోనున్నట్లు వెల్లడించాయి. జేవీతో ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్‌ను అందించనున్నాయి.

సంయుక్త సంస్థ ఏర్పాటుకు రెడీ



ఒప్పంద కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు

ఎస్‌డీవీ సొల్యూషన్లు

జేవీ ప్రధానంగా బీఎండబ్ల్యూ గ్రూప్ ప్రీమియం వాహనాలకు సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహన(ఎస్‌డీవీ) సొల్యూషన్లు సమకూర్చనుంది. అంతేకాకుండా ఐటీ బిజినెస్‌కు డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్లు సైతం అందించనుంది. సుమారు 100 ఇన్నోవేటర్లతో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు సంయుక్త ప్రకటనలో బీఎండబ్ల్యూ, టాటా టెక్ వెల్లడించాయి. రానున్న కాలంలో వీలైనంత త్వరగా ఈ సంఖ్యను నాలుగంకెలకు పెంచనున్నట్లు తెలియజేశాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ కేంద్రాల బీఎండబ్ల్యూ గ్లోబల్ నెట్‌వర్క్‌లో జేవీ భాగంకానున్నట్లు పేర్కొన్నాయి. బీఎండబ్ల్యూ గ్రూప్‌తో చేతులు కలపడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ఇంజనీరింగ్‌లో కస్టమర్లకు అత్యున్నత సొల్యూషన్లు అందించేందుకు కట్టుబడి ఉన్న విషయాన్ని తెలియజేస్తున్నట్లు టాటా టెక్ సీఈవో, ఎండీ వారెన్ హారిస్ పేర్కొన్నారు. టాటా టెక్‌తో భాగస్వామ్యం ఎస్‌డీవీ విభాగంలో పురోగతికి సహకరించనున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ క్రిస్టోఫ్ గ్రోట్ తెలియజేశారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ • స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ప్రైవేటు రంగ బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల అంశాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు నష్టపోయి 73,904 వద్ద స్థిరపడింది. నిఫ్టీ తొమ్మిది పాయింట్లు నష్టపోయి 22,453 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ఇంట్రాడేలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 271 పాయింట్లు పతనమై 73,744 వద్ద కనిష్టాన్ని, నిఫ్టీ 74 పాయింట్లు క్షీణించి 22,388 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. ఆఖరి గంటలో కన్జూమర్ డ్యూరబుల్స్, సర్వీసెస్, మెటల్, యుటిలిటీ, కమోడిటీ రంగాలకు చెందిన మధ్య, తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.28%, 1.14% చొప్పున పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు భారీ నష్టాల నుంచి రికవరీ అయ్యాయి. రిటైల్ విభాగాన్ని విభజిస్తుందన్న వార్తలతో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ షేరు 12% లాభపడి రూ.236 వద్ద ముగిసింది.

ఐపీవోల జోరు

• 2023-24లో 76 కంపెనీల లిస్టింగ్
• రూ. 62,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్ల జోష్‌తో మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ప్రైమరీ మార్కెట్ సైతం జోరు చూపింది. ప్రధాన విభాగంలో మొత్తం 76 కంపెనీలు ఐపీవోల ద్వారా సుమారు రూ. 62,000 కోట్లు సమీకరించాయి. అంతక్రితం ఏడాది(2022-23)తో పోలిస్తే ఇది 19 శాతం అధికం. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లోనూ పబ్లిక్ ఇష్యూలకు కంపెనీలు క్యూ కట్టే వీలున్నట్లు స్టాక్ నిపుణులు భావిస్తున్నారు. దేశీయంగా పెట్టుబడుల ప్రవాహం, కార్పొరేట్ సుపరిపాలన, సానుకూల ప్రభుత్వ విధానాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జోరు తదితర అంశాలు ఇందుకు సహకరించనున్నట్లు పంటోమాత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్ ఒక నివేదికలో పేర్కొంది. వెరసి ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ ద్వారా రూ. లక్ష కోట్ల సమీకరణకు వీలున్నట్లు పంటోమాత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ఎండీ మహావీర్ లునావత్ అంచనా వేశారు.

గతంలో తక్కువే

పబ్లిక్ ఇష్యూల ద్వారా 2022-23లో 37 కంపెనీలు లిస్టయ్యాయి. తద్వారా ఉమ్మడిగా రూ. 52,115 కోట్లు సమకూర్చుకున్నాయి. కాగా.. గతేడాది విభిన్న రంగాల నుంచి కంపెనీలు ఐపీవోలు చేపట్టాయి. అయితే 2022-23లో 51 శాతం ఆక్రమించిన ఫైనాన్షియల్ రంగం నుంచి రూ. 9,655 కోట్లు మాత్రమే సమీకరించాయి. ఇది మొత్తం నిధుల్లో 20 శాతంకంటే తక్కువే. ఇక ఆధునిక తరం టెక్నాలజీ కంపెనీలలో కేవలం యాత్రా, మామాఎర్త్, జాగిల్ మాత్రమే లిస్టయ్యాయి. తొలి రోజు లిస్టింగ్ లాభాల విషయానికివస్తే.. 2022-23లో 9 శాతంతో పోలిస్తే గతేడాది 29 శాతానికి ఎగశాయి. ఈ బాటలో 70 శాతం అంటే 55 స్టాక్స్ ఇష్యూ ధర కంటే ఎగువనే ట్రేడవుతున్నాయి.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో 47 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ).. దేశవ్యాప్తంగా ఐపీపీబీ శాఖల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 47 (యూఆర్-21, ఈడబ్ల్యూఎస్-04, ఓబీసీ-12, ఎస్సీ-07, ఎస్టీ-03).
» అర్హత: ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.03.2024 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:05.04.2024
» వెబ్‌సైట్: www.ippbonline.com

ఎన్ఎండీసీ లిమిటెడ్‌లో 193 అప్రెంటిస్‌లు

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్)లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎండీసీ), బైలాదిలా ఐరన్ ఓర్ మైన్, కిరాండుల్ కాంప్లెక్స్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 193
» విభాగాలు: ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, సీఓపీఏ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 31.03.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» ఇంటర్వ్యూ తేదీలు: 15.04.2024, 16.04.2024, 18.04.2024, 19.04.2024, 20.04.2024, 21.04.2024, 22.04.2024, 25.04.2024, 26.04.2024.
» ఇంటర్వ్యూ వేదిక: బైలా క్లబ్ అండ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్, బీఐవోఎం, కిరాండుల్ కాంప్లెక్స్, కిరాండుల్, దంతెవాడ జిల్లా, ఛత్తీస్‌గఢ్.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apprenticeshipindiagov.in

ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీలో 158 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఢిల్లీలోని ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 158
» విభాగాల వారీగా ఖాళీలు: డిజైన్-06, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-10, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-13, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్-05, ఎకనామిక్స్(యూఎస్ఎంఈ) -04, మేనేజ్‌మెంట్(యూఎస్ఎంఈ)-27, బయోటెక్నాలజీ -09, మెకానికల్ ఇంజనీరింగ్-34, కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్-50.
» అర్హత: సంబంధిత విభాగాల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, స్లెట్/సెట్, యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్/జీప్యాట్/గేట్/ఐసీఎంఆర్/నెట్-లెక్చర్‌షిప్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. బోధన, పరిశోధన అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, ప్రజెంటేషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.04.2024
» దరఖాస్తు హార్డ్‌కాపీ పోస్టులో పంపేందుకు చివరి తేది: 24.04.2024.
» వెబ్‌సైట్: www.dtu.ac.in

ఎన్‌పీసీఐఎల్‌లో 335 అప్రెంటిస్‌లు

కోటా(రాజస్థాన్)లోని రావత్‌బాటా రాజస్థాన్ సైట్ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 335
» ట్రేడుల వారీగా ఖాళీలు: ఫిట్టర్-94, ఎలక్ట్రీషియన్-94, ఎలక్ట్రానిక్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఏ), టర్నర్, మెషినిస్ట్, వెల్డర్. -శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» స్టైపెండ్:నెలకు రూ.7,700 నుంచి రూ.8,855
» అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 14 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.04.2024.
» వెబ్‌సైట్: https://npcilcareers.co.in

పది తర్వాత.. కెరీర్ ప్లాన్ ఇలా!

టెన్త్.. ప్రతి విద్యార్థి జీవితంలో.. టర్నింగ్ పాయింట్! పదో తరగతి తర్వాత ఏం చేయాలి.. ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలా.. ఉద్యోగం కోసం ప్రయత్నించొచ్చా.. సత్వరం ఉపాధిని అందించే మార్గాలు ఏవి.. ఇలా ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఎన్నో సందేహాలు!! ఎక్కువ మంది ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీలో చేరి.. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో చేరాలని కలలు కంటున్నారు. వీటితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు.. కోర్సులు, కెరీర్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

» అందుబాటులో పలు కోర్సులు, ఉపాధి మార్గాలు
» ఎక్కువ మంది తొలి గమ్యం ఇంటర్మీడియెట్
» ఇంజనీరింగ్‌కు మార్గంగా పాలిటెక్నిక్స్
» సత్వర ఉపాధితో ఐటీఐల వైపు మొగ్గు

పదో తరగతి తర్వాత అధిక శాతం మంది ఇంటర్మీడియెట్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందులోనూ ఎంపీసీ, బైపీసీల్లో చేరి భవిష్యత్తులో ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందాలనే ఆలోచనతో ఉంటున్నారు. మరికొంతమంది విద్యార్థులు మాత్రం సత్వరం ఉపాధి కల్పించే ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

తొలి గమ్యం.. ఇంటర్

ఇంటర్(ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ)లో ప్రతి గ్రూప్ దేనికదే ప్రత్యేకమైనవి. అత్యధిక శాతం మంది ఎంపీసీలో చేరుతున్నారు. ఆ తర్వాత బైపీసీతోపాటు సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ వంటి గ్రూప్‌లతోనూ ఉజ్వల అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. అదేవిధంగా టెక్నికల్ స్కిల్స్, వృత్తి నైపుణ్యాలు అందించే ఒకేషనల్ కోర్సుల్లోనూ చేరే వీలుంది.

ఇంజనీరింగ్‌కు కేరాఫ్ ఎంపీసీ

- ఎంపీసీ.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల కలయికగా ఉండే గ్రూప్ ఇది. ఈ గ్రూప్‌తో ఈఏపీసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, బిట్‌శ్యాట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకు సాధించి ఇంజనీరింగ్‌లో కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. ఎన్‌డీఏ, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీంల ద్వారా డిఫెన్స్ రంగంలో కెరీర్ ప్రయత్నాలు చేయొచ్చు. వీటితోపాటు భవిష్యత్తులో సైన్స్ రంగంలో స్థిరపడాలనుకుంటే.. బీఎస్సీ, ఆ తర్వాత ఎమ్మెస్సీ, రీసెర్చ్ కోర్సులు చేసే అవకాశం కూడా ఉంది.
- నైపుణ్యాలు: ఎంపీసీతో రాణించేందుకు కంప్యుటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ స్కిల్స్ ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతోపాటు మన కళ్ల ముందు కనిపించే గ్యాడ్జెట్స్, వాటి పనితీరును తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి.

బైపీసీ.. బహుళ అవకాశాలు


- ఎంపీసీ తర్వాత ఎక్కువ మంది ఎంచుకునే గ్రూప్.. బైపీసీ! ఈ గ్రూప్ ఉత్తీర్ణులు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-యూజీలో ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో అడుగుపెట్టొచ్చు. రాష్ట్ర స్థాయిలో ఈఏపీ సెట్(అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్)లో ర్యాంకు సాధించి వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీలో చేరే వీలుంది. ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశముంది. ఇంటర్మీడియెట్ బైపీసీ అర్హతతో బీఎస్సీ (బీజెడ్‌సీ)లో అడుగు పెట్టొచ్చు. ఇప్పుడు బీజెడ్‌సీలోనూ బయో ఇన్ఫర్మాటిక్స్, బయోటెక్, హ్యూమన్ జెనెటిక్స్, జెనెటిక్స్ వంటి వినూత్న సబ్జెక్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. ఫార్మా, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి.
- నైపుణ్యాలు: బైపీసీ గ్రూప్‌ను ఎంచుకునే విద్యార్థులకు లైఫ్ సైన్సెస్‌పై సహజ ఆసక్తి ఉండాలి. జీవులు, పరిసరాలు, పర్యావరణంపై ఆసక్తితో పాటు వాటి పట్ల సహానుభూతి(ఎంపతీ) వంటివి ఉంటే మేలు.

సీఈసీ.. కార్పొరేట్ కెరీర్స్

- కార్పొరేట్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం.. సీఈసీ. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌లు కలయికగా ఉండే గ్రూప్ ఇది. సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్య పరంగా బీకాం కోర్సు ముఖ్య మార్గంగా నిలుస్తోంది. బీకాం చదువుతూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. తద్వారా కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్ కాలర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అదేవిధంగా బ్యాచిలర్ డిగ్రీ తర్వాత.. పీజీ స్థాయిలో ఎంకామ్, ఎంబీఏలో చేరే వీలుంది. ముఖ్యంగా అకౌంటింగ్ రంగంలో రాణించాలనుకునే వారు ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేసుకోవచ్చు.
- నైపుణ్యాలు: కాలిక్యులేషన్ స్కిల్స్, గణాంకాల విశ్లేషణ, సూక్ష్మ స్థాయి పరిశీలన, వ్యాపార, వాణిజ్యాలపట్ల ఆసక్తి వంటి ఉండాలి.

కాంపిటీటివ్ కింగ్.. హెచ్ఈసీ

హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌లుగా



ఉండే హెచ్ఈసీపై పట్టు సాధించడం ద్వారా ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించొచ్చు అనేది నిపుణుల అభిప్రాయం. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకున్న వారికి ఈ గ్రూప్ అనుకూలంగా నిలుస్తోంది. ఇటీవల కాలంలో బీఏలోనూ పలు జాబ్ ఓరియెంటెడ్ గ్రూప్ కాంబినేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా ప్రైవేటు రంగంలో కొలువులు దక్కించుకోవచ్చు.

ఇంజనీరింగ్‌కు మార్గం.. పాలిటెక్నిక్

భవిష్యత్తులో ఇంజనీరింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారికి టెన్త్ తర్వాత అందుబాటులో ఉన్న చక్కటి మార్గం.. పాలిటెక్నిక్ కోర్సులు. మూడు, మూడున్నరేళ్ల వ్యవధి ఉండే ఈ కోర్సులు పూర్తిచేసుకోవడం ద్వారా పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అదేవిధంగా పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఈసెట్‌లో ర్యాంకుతో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగుపెట్టే అవకాశం కూడా ఉంది.

ఇండస్ట్రీలో ఉపాధికి ఐటీఐ

పదో తరగతి అర్హతగా వృత్తి విద్య శిక్షణతోపాటు స్వయం ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ సెంటర్స్(ఐటీఐ). నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రెనింగ్ పరిధిలోని ఐటీఐల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ తదితర పదుల సంఖ్యలో ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సు ఉత్తీర్ణత తర్వాత పారిశ్రామిక సంస్థల్లో టెక్నీషియన్స్‌గా ఉపాధి పొందొచ్చు. అదే విధంగా అప్రెంటీస్‌షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ అందించే సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో ప్రాధాన్యం లభిస్తుంది.

గురుకుల కళాశాలలు

- పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ స్థాయిలో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటిలో అడుగుపెట్టాలంటే.. రాష్ట్ర స్థాయిలో ఆర్‌జేసీ సెట్‌ల పేరుతో నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.
- తెలంగాణ రాష్ట్రంలో.. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా టీఎస్ఆర్‌జేసీ-సెట్ నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏపీ ఆర్‌జేసీ సెట్ నిర్వహిస్తారు. ఈ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారికి పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో బోధన ఉంటుంది. నీట్ యూజీ, ఐఐటీ జేఈఈ వంటి వాటికి ప్రత్యేక శిక్షణసైతం లభిస్తుంది.

అగ్రి పాలిటెక్నిక్స్

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేకంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్ ఏర్పాటు చేశారు. వీటిలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా వంటి కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తన సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఒకేషనల్ కోర్సులు

ఇంటర్మీడియెట్ తర్వాత సత్వరం ఉపాధి పొందాలనుకునే వారికి మరో చక్కటి అవకాశం.. ఒకేషనల్ కోర్సులు. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ షిప్ నుంచి ఆటో మొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ...టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పలు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డులు.. అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హోంసైన్స్, హ్యూమానిటీస్, పారా మెడికల్ విభాగాల్లో ఒకేషనల్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా సంబంధిత రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

ఆసక్తి ప్రధానం

పదో తరగతి తర్వాత కోర్సును ఎంచుకునే ముందు విద్యార్థులు ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతోపాటు వ్యక్తిగత సామర్థ్యాలపైనా స్పష్టత తెచ్చుకోవాలి. ఇందుకోసం తాము లక్ష్యంగా భావిస్తున్న కోర్సుల స్వరూపం గురించి అవగాహన పెంచుకోవాలి. అవి తమ సామర్థ్యానికి సరితూగుతాయని భావిస్తేనే వాటిలో చేరాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా...

విస్తారా విమానాల రద్దు

పైలట్ల మూకుమ్మడి సెలవు

శంషాబాద్: విస్తారా ఎయిర్‌లైన్స్‌లో పైలట్ల మూకుమ్మడి సెలవు కారణంగా దేశవ్యాప్తంగా ఆ సంస్థ విమానాలు రద్దు కావడంతో పాటు పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి ఉదయం 8.30 గంటలకు ముంబై బయల్దేరాల్సిన యూకే–874 విమానం రద్దయింది. దీంతోపాటు రాత్రి 8.20 గంటలకు బెంగళూరు వెళ్లాల్సిన యూకే 894 విమానాన్ని కూడా రద్దు చేశారు. ఢిల్లీ, గోవా తదితర నగరాల నుంచి మిగతా విమానాలు యథాతథంగా రాకపోకలు సాగించాయి. విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్-అయోధ్య విమాన సర్వీసులు ప్రారంభం



శంషాబాద్: హైదరాబాద్ నుంచి అయోధ్యకు స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ నాన్‌స్టాప్ విమాన సర్వీసులను మంగళవారం ప్రారంభించింది. ఎస్‌జీ611 సర్వీసు ఉదయం 10.45 గంటలకు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుని బయల్దేరింది. మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులుంటాయని ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ.. అయోధ్యతో పాటు సమీపంలోని సాంస్కృతిక పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను సందర్శించాలనుకునే ప్రయాణికులు నాన్‌స్టాప్ సర్వీసులతో సుఖ ప్రయాణ అనుభూతి పొందవచ్చన్నారు.

యుద్ధం నీడలో 'వైద్యం' పూర్తి!

ఉక్రెయిన్-ఉజ్బెకిస్తాన్ నుంచి ఎంబీబీఎస్ పాసైన 210 మంది విద్యార్థులు

వారిలో 86 మంది అమ్మాయిలు కూడా..

గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో కన్నుల పండువగా గ్రాడ్యుయేషన్ సెర్మనీ

దేశంకాని దేశంలో ఎంబీబీఎస్ కోర్సు చదివేందుకు రెక్కలు కట్టుకొని వెళ్లారు.. ఓ కాలేజీలో తొలి సెమిస్టర్ పూర్తి చేసి రెండో సెమిస్టర్‌లోకి అడుగుపెట్టారు. అంతలోనే ఒక్కసారిగా దేశమంతా బాంబుల మోత, కాల్పుల శబ్దాలతో విలవిల్లాడారు.. కేంద్రం చొరవతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్వదేశం చేరుకున్నా ఆగిన చదువును కొనసాగించాలన్న పట్టుదలతో తొలుత 2–3 నెలలు ఆన్‌లైన్ చదువులు చదివి.. ఆ తర్వాత కన్నవారిని, కేంద్రాన్ని ఒప్పించి మరో దేశంలోని కాలేజీలో కోర్సును పూర్తిచేసి స్వదేశానికి తిరిగొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తాలూకు మనోవేదనను అధిగమించి.. అన్ని పరీక్షల్లోనూ విజయం సాధించిన 210 మంది వైద్య విద్యార్థుల విజయగాథ ఇది.



ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులతో ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి, ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం చైర్మన్ విజయబాబు తదితరులు

లక్డీకాపూల్: ఉక్రెయిన్‌లోని జపోరిఝియా స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో చేపట్టిన ఎంబీబీఎస్ కోర్సును.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఉజ్బెకిస్తాన్‌లోని బుఖారా స్టేట్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిచేసిన 10 రాష్ట్రాలకు చెందిన 210 మంది విద్యార్థులకు మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో కన్నుల పండువగా పట్టాల పంపిణీ జరిగింది. 86 మంది విద్యార్థినులు సహా మొత్తం 210 మంది ఉజ్బెకిస్తాన్ వెళ్లి కోర్సు పూర్తిచేశారు. అయితే జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) సూచనల మేరకు మొత్తం 210 మంది విద్యార్థులకు.. వారు ఎంబీబీఎస్ కోర్సు మొదలుపెట్టిన ఉక్రెయిన్‌లోని జపోరిఝియా స్టేట్ మెడికల్ యూనివర్సిటీ నుంచే పట్టాలు రావడం గమనార్హం. కాగా, ఎంబీబీఎస్ పాసైన విద్యార్థుల్లో 110 మంది ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామ్ (ఎఫ్ఎంజీఈ) రాయగా 81 మంది తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులయ్యారు. వారిలోనూ 34 మంది అమ్మాయిలు ఉన్నారు.

ఆ విద్యార్థులది అపార కృషి: ఉజ్బెకిస్తాన్ రాయబారి

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారత్‌లో ఉజ్బెకిస్తాన్ రాయబారి సర్దోర్ రుస్తంబేవ్ మాట్లాడుతూ విద్యార్థులంతా అపార కృషితో పాటు అడ్డంకులన్నింటినీ ఎదుర్కొని మరీ విజయం సాధించారన్నారు. వాళ్ల విజయంలో తమ దేశం పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నామని చెప్పారు. యుద్ధ కాలంలో విద్యార్థులు ఉక్రెయిన్ నుంచి స్వదేశానికి వచ్చేలా చొరవ చూపడంతోపాటు తిరిగి వారిని ఉజ్బెకిస్తాన్ పంపడంలో కీలకపాత్ర పోషించిన నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ, ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖలో భారతీయ ప్రతినిధి డాక్టర్ దివ్యా రాజ్‌రెడ్డిని అభినందించారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తగిన అనుమతులు ఇచ్చిన కేంద్రానికి, జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు కూడా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం చైర్మన్ పి. విజయబాబు, డాక్టర్ దివ్యారాజ్‌రెడ్డి, ఉజ్బెకిస్తాన్ ఎంబసీ ఫస్ట్ సెక్రటరీ ఎస్. సుయరొవ్, ఉజ్బెకిస్తాన్ ఎంబసీ కౌన్సిలర్ ఐ. సాలియెవ్, నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీఈఓ డాక్టర్ బీవీకే రాజ్, ఏఐజీ ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ సందీప్ సాహా తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ డీజిల్ బంక్

ఫోన్ చేస్తే చాలు అందుబాటులో..



మంచిర్యాల రూరల్ (హాజీపూర్): మొబైల్ టిఫిన్ సెంటర్, మొబైల్ ఏటీఎం, మొబైల్ జనరేటర్లు, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పటికే ఉండగా.. ఇందులో మొబైల్ డీజిల్ బంక్ చేరింది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన ఓ వ్యాపారి మొబైల్ డీజిల్ బంక్ ట్యాంకర్‌ను కొనుగోలు చేశారు. జిల్లావ్యాప్తంగా డీజిల్ అవసరాలున్న ప్రాంతాలను గుర్తించి మరీ అక్కడికి వెళ్లి వాహనాలకు డీజిల్ పోస్తున్నారు. మార్కెట్ ధర కన్నా రూ.2 వరకు తక్కువలో అందిస్తున్నట్లు మొబైల్ డీజిల్ బంక్ ట్యాంకర్ నిర్వాహకుడు తెలిపారు. ప్రస్తుతం గ్రామాల వారీగా మొబైల్ డీజిల్ బంక్‌ను అందుబాటులో ఉంచుతుండగా.. వాహనచోదకులు వచ్చి డీజిల్ పోసుకుంటున్నారు. డీజిల్ అవసరం ఉన్నవారు ఫోన్ చేస్తే చాలు.. వాహనాలు ఎక్కడ ఉన్నా వచ్చి డీజిల్ నింపేస్తామని నిర్వాహకుడు తెలిపారు.

నకిలీ వైద్యులపై కేసులు

- తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 19 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి (టీఎస్ఎంసీ) వెల్లడించింది. ఎన్ఎంసీ చట్టం ప్రకారం మొదటిసారి పట్టుబడిన వారికి రూ. 5 లక్షల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించింది. సేవ ముసుగులో ప్రజలను నకిలీ వైద్య వ్యవస్థ దోచుకుంటోందని మండిపడింది. గ్రామాల్లో అత్యవసర వైద్యం అందిస్తున్నామంటూ 75 నుంచి 80 శాతం నకిలీ వైద్యులు (ఆర్ఎంపీ, పీఎంపీ వ్యవస్థ) తిష్ట వేశారని మండలి పేర్కొంది. పట్టణాల్లోనూ అనేకమంది నకిలీ వైద్యులు రోగులను పీల్చి పిప్పిచేస్తున్నారని మండలి అధికారులు తెలిపారు. నకిలీ వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వ్యవస్థపై తెలంగాణ వైద్య మండలి ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి ప్రణాళిక రచిస్తున్నామని, ప్రథమ చికిత్స కేంద్రాల ముసుగులో ఇబ్బడిముబ్బడిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్, షెడ్యూల్ హెచ్ డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్ రాసే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. జిల్లాల్లో నకిలీ వైద్యులను గుర్తించి వాటిపై దాడులకు స్పష్టమైన ప్రణాళిక రచిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో పీహెచ్‌సీలో పనిచేసే డాక్టర్లపై ఆర్ఎంపీ, పీఎంపీలు దుష్ప్రచారం చేస్తూ ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని టీఎస్ఎంసీ మండిపడింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ల్యాబ్‌లు, ఫార్మసీల నిర్వహణ, టెస్టులు చేయకుండానే రిపోర్టులు ఇస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణలో ఆర్ఎంపీ, పీఎంపీ వ్యవస్థను ప్రక్షాళన చేసేవరకు నూతన వైద్య మండలి కార్యవర్గం విశ్రమించదని టీఎస్ఎంసీ స్పష్టం చేసింది.

సామాజిక తనిఖీల్లో తెలంగాణ, కేరళ ప్రథమం

వందశాతం జీపీల్లో సామాజిక తనిఖీ పూర్తి చేసిన రెండు రాష్ట్రాలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 2023–24లో వందశాతం గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీలు పూర్తిచేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, కేరళ అగ్రభాగాన నిలిచాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని 540 మండలాల్లోని 12,769 గ్రామపంచాయతీల్లో సాగుతున్న పనుల పరిశీలనను తెలంగాణ సామాజిక తనిఖీ సంస్థ పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలకు చెల్లించిన వేతనాలు, లబ్ధిపొందిన ప్రతి జాబ్‌కార్డుదారుని కలవడంతో పాటు పనులను కూడా స్వయంగా పరిశీలించినట్టు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. ప్రతిమండలంలో కూలీలు, ప్రజల సహకారంతో గ్రామసభలలో తనిఖీ నివేదిక గురించి తెలియజేయడంతో పాటు మండల స్థాయిలో ప్రజావేదికలు నిర్వహించినట్టు తెలిపారు. తెలంగాణలో వందశాతం సామాజిక తనిఖీలు పూర్తిచేయడం సంతోషదాయకమని, ఇదే స్ఫూర్తితో 2024–25కు కార్యాచరణ సిద్ధం చేసుకుని సామాజిక తనిఖీ సంస్థ ముందుకు సాగుతోందని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఒక ప్రకటనలో తెలిపారు.

7 సైబర్ క్రైమ్ స్టేషన్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం ఏడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లను ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్ర పరిధి గల సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆధ్వర్యంలో ఈ స్టేషన్లు పనిచేయనున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్ర పరిధిగల ఒక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్, మరో ఆరు పోలీసు కమిషనరేట్ల పరిధిలో కూడా ఈ సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, ఖమ్మం, రామగుండం పోలీసు కమిషనరేట్ల పరిధిలో జరిగే సైబర్‌క్రైమ్‌కు సంబంధించి అక్కడ ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆ కేసులను సంబంధిత సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ అధికారులు దర్యాప్తు చేస్తారు. సైబర్ క్రైమ్ రాష్ట్ర స్థాయికి విస్తరించి ఉన్న పక్షంలో ఆ కేసులను హైదరాబాద్‌లోని సైబర్‌క్రైమ్ స్టేషన్ దర్యాప్తు చేయనుంది, ప్రతి సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషన్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా డీఎస్పీ స్థాయి అధికారి ఉంటారు. రాష్ట్రస్థాయిలోని స్టేషన్ నుంచి సలహాలు, సూచనలు, దర్యాప్తులో అనుసరించాల్సిన మార్గాల గురించి వివరిస్తారు. స్టేషన్లు ప్రారంభించిన తొలిరోజే మొత్తం 10 సైబర్‌క్రైమ్ కేసులు నమోదు అయ్యాయి.

నాక్స్ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

ఈనెల 15 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ (నాక్స్) ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్న సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఇన్ సైబర్ లా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 15 వరకు గడువు అని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్హత గల అభ్యర్థులు అర్హులని, ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ ఫీజులో కూడా 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం కేంద్రప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో www. nacsindia. org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని, వివరాలకు 7893141797 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.